Lok Satta
People Power

Lok Satta Party

# లోక్‌సత్తా 20+:
# 100 నిజాలు (విజయాలు)
# మాట్లాడుకుందాం!





"కుల వివక్ష, రైతు పట్ల వివక్ష స్వతంత్ర భారతదేశాన్ని తీవ్రంగా కుంగదీస్తున్నాయి. రైతు (కౌలుదారు)కు జరుగుతున్న అన్యాయం ప్రకృతి శాపం వల్ల కాదు... పాలకుల పాపం వల్ల ! రైతుల్ని రోబోలుగా, పరిశ్రమలకు ముడిసరకులు అందించటానికి, ఓట్లు వేయటానికి పనికొచ్చే యంత్రాలుగా చూస్తున్నారు. పంటలకు న్యాయమైన ధర ఇవ్వకపోయినా, వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలు కల్పించేందుకు మంచి విద్య, ఆరోగ్యం వంటి విధానాలను చేపట్టకపోయినా... ముున్ముందు భారతదేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలు పెనుసంక్షోభాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. స్వేచ్ఛామార్కెట్, హేతుబద్ధ రాయితీలు, మౌలిక వసతులతో రైతుకి, వినియోగదారుడికి, దేశ ఖజానాకు లాభం చేకూర్చవచ్చని, ఆహారభద్రతను పరి రక్షించవచ్చని లోక్‌సత్తా వ్యవసాయ విధానాలు ఇప్పటికే నిరూపించాయి. ప్రపంచంలో మనది గొప్ప దేశమని మరీ ఎక్కువ నటించకుండా.... "రైతులకు ఆదాయం" చుట్టూ ఈ నూతన వ్యవసాయ విధానాలను ప్రభుత్వాలు ఇప్పటికైనా అనుసరించాలి. రైతులు కులం, ప్రాంతం, భాష, పార్టీలకతీతంగా ఏకమై స్వేచ్ఛామార్కెట్‌లో ధర్మబద్ధ వ్యాపారంలా వ్యవసాయాన్ని చేయాలి. గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరాన్ని, వివక్షల్ని తొలగిస్తేనే ప్రపంచస్థాయి భారతదేశాన్ని నిజంగా ఆవిష్కరించగలం."

- డా॥ జయప్రకాష్ నారాయణ్
లోక్‌సత్తా వ్యవస్థాపకులు

# లోక్‌సత్తా 20+ :

# 100 నిజాలు (విజయాలు)

# మాట్లాడుకుందాం!

**లోక్‌సత్తా 20+:**

**100 నిజాలు (విజయాలు) మాట్లాడుకుందాం!**

**(Loksatta 20+: Let us talk 100 Truths/Victories)**

**ప్రచురణ : ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా**

**వెల : రూ. 20**

**తొలి ముద్రణ : 2017-18**

**కాపీలు : 1000**

**చిరునామా :**

Foundation for Democratic Reforms / Lok satta
Flat No.801 & 806,
Srinivasa Towers,
Besides ITC Kakatiya Hotel,
Begumpet, Hyderabad- 500 016
Telangana Ph. 040-23419949  Fax. 23419948
email:info@fdrindia.org, www.fdrindia.org

# ప్రస్తుతానికి 100!

కాంగ్రెస్, బీజేపీ సహా మనదేశంలో చాలా పార్టీలకు భావోద్వేగ పరిస్థితులు, నాయకుడు/నాయకురాలిని బట్టే రిలవెన్స్ ఉంటుంది. అవన్నీ ఉన్నా కూడా ఒక్క ఓటు తేడాతోనైనా ఎన్నికల్లో ఓడితే ఆ రిలవెన్స్ పోతుంది. టీఆర్ఎస్ బలమైన నాయకత్వంతో గెలిచి అదే ఊపులో కొనసాగుతుండటంతో ఇక తెలంగాణలో తెలుగుదేశం అనవసరం అని చాలామంది అనుకుంటున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో, ఇంకొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ అనవసరం అనే భావన ఉంది. ఇంకొంతకాలం పోతే ఇంకోపార్టీకీ అదే పరిస్థితి రావచ్చు. ఈ దేశంలో ఓట్లు, సీట్లు పొందుతున్న ఏ పార్టీకీ మధ్య మౌలికంగా తేడా లేకపోవటమే ఇందుకు ప్రాథమిక కారణం. చాలా సందర్భాల్లో కృత్రిమంగా సృష్టించిన ప్రత్యేక పరిస్థితులకు ఒక ఆశావహ, బలమైన నాయకత్వం తోడై తమ పార్టీ భిన్నంగా కనిపిస్తూ అధికారంలోకి రాగలుగుతోంది తప్ప, తమకు ప్రత్యేకించి రిలవెన్స్ ఉందని అధికార పార్టీలు సభ్యులు కూడా అనుకోవటం లేదు. ఇక మిగతా పార్టీల విషయానికొస్తే.. మరీ ప్రతిపక్షం లేకపోతే అధికారపార్టీకి కన్నూమిన్నూ కానదనే భయంతోనే తప్ప మిగతా సాంప్రదాయ పార్టీలన్నీ లేకపోయినా ప్రజలేమీ పెద్దగా వర్రీ అవరు. కానీ 2014లో లోక్‌సత్తాకు ఎన్నికల్లో పెద్దగా ఓట్లు, ఒక్క సీటూ రాకపోయినా.. లోక్‌సత్తా పార్టీ ఉండాలా వద్దా అని తెలంగాణలో ర్యాండమ్ సర్వే చేస్తే 95శాతానికిపైగా జనం 'కచ్చితంగా ఉండాలని' కోరారు. లోక్‌సత్తా విషయంలోనూ నాయకత్వాన్ని ప్రస్తావిస్తారుగానీ, లోక్‌సత్తా విధానాలను, కొత్త రాజకీయ సంస్కృతిని కలిపే ఇక్కడ నాయకత్వాన్ని చూస్తారు. లోక్‌సత్తా అనగానే మనసులో ఒక ముద్ర మెరుస్తుంది. అవినీతి వ్యతిరేక ఉద్యమమని, పార్టీ అని, మంచి విధానాలు, ఆలోచనలు, మేధోదృక్కోణం ఉన్న ప్రత్యామ్నాయ రాజకీయమని పట్టణ ప్రాంతాల్లో చాలామందికి, గ్రామాల్లో చెప్పుకోదగిన శాతానికి ఒక పర్సెప్షన్ ఏర్పడుతుంది. లోక్‌సత్తా చేస్తున్నది దీర్ఘకాలిక కృషి. ఎప్పటికప్పుడు కొత్తతరం కూడా ఇందులో భాగస్వాములవుతూ తమ పాత తరం కంటే మెరుగైన రీతిలో లక్ష్యాల సాధన చేస్తుండాలి. కానీ లోక్‌సత్తా పట్ల ఎంతో కొంత అవగాహనతోనో, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కార్యక్రమాలనో, సోషల్ మీడియా పోస్టింగులనో చూసో వస్తున్న కొత్తతరానికి ఇంకా స్పష్టత కావాల్సి వుంది. విజయం సాధించటమంటే డబ్బు, కెరీర్, అధికారం తప్ప మరేమీ కాదని ఇంట్లో తల్లిదండ్రులు, సమాజంలో మిత్రులు, ప్రచారసాధనాలు నూరిపోస్తున్న కాలంలో.. లోక్‌సత్తా తన గొప్ప భావజాలంతో ఇన్నేళ్లుగా

ఏం సాధించింది? 1,2,3 అని చెప్పండి అన్న ప్రశ్న కూడా వారి నుంచి వస్తోంది. దానికితోడు, తొలినుంచీ లోక్‌సత్తాలో ఉన్నవారు కూడా మనం సాధించిన విజయాలను ఒక బుక్‌లెట్‌లాగా వేస్తే ప్రజల్లోకి, ముఖ్యంగా యువతలోకి తేలిగ్గా తీసుకెళ్లగలం అంటున్నారు. ఇదేసమయంలో జేపీ సోషల్ మీడియా అడ్మిన్లు 'నిజాలు మాట్లాడుకుందాం' అనే ఒక పోస్టర్ క్యాంపయిన్‌ను ప్రారంభించారు. దీనికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇజాల లక్ష్యమైన నిజాలే తప్ప లోక్‌సత్తాకు ప్రత్యేకించి ఇజాలేమీ ఉండవు కాబట్టి.. ఇదే టైటిల్‌తో లోక్‌సత్తా సాధించిన విజయాలను రూపొందించాలని ప్రయత్నం ప్రారంభించాం. హేతుబద్ధత, సాక్ష్యాధారాలు, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే నూతన ప్రజాస్వామిక రాజకీయ సంస్కృతి ద్వారా లోక్‌సత్తా సాధించిన 100 నిజాలను చెబితే ఒక ల్యాండ్ మార్క్‌లా ఉంటుందన్న భావన కలిగింది. వంద క్రోడీకరించలమా? అన్న సందేహమూ వచ్చింది. ఓ 70, 80 అయితే గ్యారంటీ అనుకుని మొదలెట్టాం. కానీ 100 దాటి ఊటలా ఊరుతూనే ఉన్నాయి. ల్యాండ్‌మార్క్‌గా 100 మాత్రమే తీసుకున్నాం. మిగిలినవి తర్వాతికాలంలో ఉపయోగించుకుందాం. లోక్‌సత్తా సాధించిన 100 విజయాలను వరస ప్రాధాన్యత క్రమంలో ఇవ్వలేదుగానీ, ఏది మొదట చెబుదామనే సంశయం మాత్రం వచ్చింది. లోక్‌సత్తా కృషిని స్ఫురింపచేసేలా ఒక ఫ్రేమ్‌వర్క్‌లా మొదటి విజయం ఉంటే బాగుంటుందనిపించింది. మథనపడ్డాక, 'వ్యవస్థీకృత మార్పు' లోక్‌సత్తా వినూత్నత అనిపించింది. గత 2,000 సంవత్సరాలలో ఎవరూ చెప్పనిది లోక్‌సత్తా కొత్తగా చెప్పటం లేదు. కానీ ఎంతో సంక్లిష్ట భిన్నత్వం ఉన్న భారత్‌లో వ్యవస్థీకృత మార్పును సాధించే ప్రయత్నాన్ని ప్రారంభించటం ద్వారా ప్రపంచంలో ఇంతవరకూ ఎవరూ చేయనంతస్థాయి కృషిని చేస్తోంది. అందుకే వ్యక్తిగత నిజాయతీకన్నా వ్యవస్థీకృత నిజాయతీ గొప్పదని సూచిస్తూ లోక్‌సత్తా సాధిస్తున్న వ్యవస్థీకృత మార్పుతో 100 నిజాల (విజయాల)ను ప్రారంభించాం. క్లియరెన్స్ కోసం జేపీ దగ్గరకు వెళ్లగా, ప్రాథమికంగా పర్లేదు, గో ఎహెడ్ అన్నారు. అలా లోక్‌సత్తా సాధించిన 100 నిజమైన విజయాలను రేఖామాత్రంగా ఈ సంచికలో అందిస్తున్నాం. లోక్‌సత్తా 2017 ఆగస్టు 3న ఇరవయ్యేళ్లు పూర్తి చేసుకుని మూడో దశాబ్దంలోకి అడుగుపెట్టింది. పాత తరానికి స్పష్టత కోసం, కొత్త తరానికి అవగాహన కోసం, ఇప్పుడిప్పుడే వస్తున్న స్కూలు తరానికి పరిచయం కోసం ఇవి ఉపయోగపడతాయని ఆశిస్తున్నాం. నివారించదగ్గ బాధలను తొలగించటం, సామర్థ్యాన్ని వికసింప చేసుకుని వివక్షలేకుండా ఎదిగే అవకాశాలను ప్రతి బిడ్డకూ అందించటం లోక్‌సత్తా మౌలిక లక్ష్యం! ఈ లక్ష్యం కోసం.. కళ్లు చెదిరే కెరీర్‌ను, యవ్వనసమయాన్ని దేశంలో మౌలిక సంస్కరణల కోసం వెచ్చించి పైకి

కనిపించకుండా కుళ్లబొడిచే అపారభారాన్ని దశాబ్దాలుగా తాను మోస్తూ బహుముఖ పోరాటాలు చేస్తున్నా, అంత త్యాగాలు చేయనక్కర్లేకుండానే కొంత సమయాన్ని, కొన్ని వనరులను లోక్‌సత్తాకు ఇవ్వమని జేపీ కోరుతుంటారు. ఇందుకు స్పందించి చాలామంది వచ్చారు. ధైర్యాన్ని పెంచే సమయం వచ్చినప్పుడు కలిసొచ్చేవారు ఇంకా చాలామందే ఉన్నారు. లోక్‌సత్తా లక్ష్యాల కోసం నిజాయతీగా పూర్తి సామర్థ్యంతో పనిచేసేవారు జీవితంలో డబ్బు, పేరు, గుర్తింపు సంపాదించుకుంటే సంతోషమే. కానీ వాటన్నిటినీ మించింది మీరు లోక్‌సత్తా ద్వారా చేస్తున్నారు. అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే గొప్ప సమాజాన్ని భావితరాలకు నిర్మిస్తున్నారు. కోట్లు, భవనాలు సంపాదించి ఇవ్వటం కంటే పిల్లలకు గొప్ప సమాజాన్ని ఇవ్వటం ఎన్నో రెట్లు మిన్న! ఇదేదో మత, విప్లవ ఛాందస ఉద్యమాలరీతిలో ఉన్మాదంతో వెర్రెక్కించేలా చెబుతున్నది కాదు. ప్రతి ఒక్కరూ హేతుబద్ధంగా తమకు తాము ధృవీకరించుకోగలిగేలా చెబుతున్నది. "మనం సక్రమంగా వ్యవహరించకపోతే భూగోళం మనుగడ వందేళ్లు దాటడం కష్టం" అని విఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ హెచ్చరించినా, "ఇతరులకు న్యాయం చేయటమే మనకు వేగంగా న్యాయం జరగటానికి మార్గం" అన్న గాంధీ సలహా ఇచ్చినా.. సమాజాన్ని బాగు చేయటంలోనే మన సుఖం దాగివుందని చెప్పటమే! మానవాళి ఎన్ని తరాలు మారినా, ఇతర గ్రహాలకు వెళ్లినా ఈ విలువలో ఎటువంటి మార్పూ ఉండదు. చరిత్రకు సరైన పక్షాన నిలిచిన లోక్‌సత్తా సభ్యులు, అభిమానులు, శ్రేయోభిలాషులందరికీ లోక్‌సత్తా 20+ శుభాకాంక్షలతో..

- ప్రచురణకర్తలు

# లోక్‌సత్తా 20+

మన రాజకీయ వ్యవస్థని, పాలనని సమూలంగా సంస్కరించి ప్రజాస్వామ్యంలో లొసుగులని ప్రజల భాగస్వామ్యంతో సరిచేయాలని డా॥ జయప్రకాష్ నారాయణ్ నాయకత్వం లో 1997, ఆగస్టు 3న ఆవిర్భవించిన లోక్‌సత్తా ఉద్యమం మూడవ దశాబ్దంలోకి అడుగు పెట్టింది. జేపీ నాయకత్వంలోనే 1996లో స్థాపించిన ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం (ఎఫ్‌డీఆర్–ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) లోక్‌సత్తా మాతృసంస్థ.

స్వచ్ఛంద సంస్థ అంటే ప్రజలకు కొన్ని రంగాలలో సేవల్ని, వసతుల్ని కల్పించటానికి పరిమితమవటం పరిపాటి. కానీ లోక్‌సత్తా అన్ని సమస్యలకూ తల్లివేరు లాంటి, అన్ని సమస్యలకూ ప్రధాన పరిష్కారం కాగల రాజకీయ, పాలనా రంగాల్ని ప్రక్షాళన చేయటానికి నడుం బిగించింది. ప్రపంచదేశాలన్నిటి అనుభవాల్నీ అధ్యయనం చేసి భారతదేశ పరిస్థితుల కనుగుణంగా వాటిని రూపొందించి మనదేశంలో సంస్కరణల్ని సాధించే ప్రయత్నాన్ని జయప్రకాష్ నారాయణ్ ప్రారంభించారు. అమెరికా, బ్రిటన్, సింగపూర్, చైనా వంటి దేశాల్లో సంస్కరణలు మంచి మార్పుల్ని తెచ్చినా, ఎన్నో మతాలు, కులాలు, భాషలు, తెగలు ఉన్న భారతదేశంలో ఆ సంస్కరణల్ని తీసుకురావటం ప్రపంచంలోని ఏ దేశంలోకన్నా కూడా కష్టమైన పని. అధిక జనాభా గల సువిశాల చైనాలోనైనా మార్పు తేవచ్చుగానీ భారత్‌లో తేవటం కష్టమని సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ సైతం ఓ సందర్భంలో అన్నారు. అయినా పెద్దసంఖ్యలో యువత, మునుపెన్నడూ లేనంతస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం, ప్రజలలో మార్పు రావాలన్న తపన ఉండటం వల్ల.. ఈ 'ప్రపంచంలోనే అతి పెద్ద కల' కష్టమైనా కూడా పూర్తిగా ఆచరణసాధ్యమని, అందరికీ ఎదిగే అవకాశాలున్న భారత్‌ను నిర్మించటానికిది తప్ప మరో మార్గం లేదని ఈ

మహాకార్యాన్ని ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా చేపట్టింది.

వ్యక్తి స్వేచ్ఛ, స్వపరిపాలన, పౌరులకి పాలనలో భాగస్వామ్యం, చట్టబద్ధ పాలన, పొరపాట్లని ఎప్పటికప్పుడు సరిచేసే స్వయందిద్దుబాటు పద్ధతులు మూలస్తంభాలుగా మన వ్యవస్థని సరయిన గాడిలో పెట్టటం లోక్‌సత్తా మౌలిక లక్ష్యం. ఓటుకు – ప్రజల పన్నుల డబ్బుకు ఉన్న సంబంధాన్ని తెలియచెప్పి, నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించే సమగ్ర రాజకీయ, పాలనా సంస్కరణోద్యమం భారతదేశంలో లోక్‌సత్తాతోనే మొదలైంది. చాలామంది సూక్ష్మస్థాయిలో ఆ కృషిని చేసినా మొట్టమొదటి సమూల కృషి లోక్‌సత్తాదే. ప్రజల చుట్టూ తిరిగే వ్యవస్థల నిర్మాణాన్ని లోక్‌సత్తా ఒక ఉద్యమంలా మార్చింది. దేశంలో ప్రజాస్వామ్య ఉద్యమాలకు, ఎన్నో మౌలిక మార్పులకు నాంది పలికింది. ప్రజాస్వామ్యం పీఠంతో ప్రారంభమై లోక్‌సత్తాగా రూపుదిద్దుకున్న ఈ ప్రయత్నం తెలుగునాట, దేశవ్యాప్తంగా, విదేశాలలో కూడా అనేకమందిని ప్రభావితం చేసింది. ఈవేళ అందరూ లోక్‌సత్తా భాష మాట్లాడుతున్నారు. భారతదేశంలో సుపరిపాలన, అవినీతిరహిత సమాజస్థాపన, పౌరసేవలు తదితర సమూల రాజకీయ, ఆర్థిక, పాలనా మార్పుల కోసం నిరంతరం కృషి చేస్తున్న విశ్వసనీయ ఉద్యమ సంస్థగా లోక్‌సత్తా గుర్తింపు తెచ్చుకుంది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఒక శాంతియుత, ప్రజాస్వామ్య భావవిప్లవం ఏ ఆర్భాటం లేకుండా, రాజ్యాంగ పరిధిలో చట్టబద్ధంగా వివిధ రూపాలలో పోరాడుతూ, ఏ అధికారం లేకుండా ఇన్ని విజయాలను సాధించటం ప్రపంచ చరిత్రలోనే అరుదు. గత 70 ఏళ్లలో ఇన్ని ఫలితాలని సాధించిన ఏకైక సంస్థ – ఉద్యమం.. ఎఫ్‌డీఆర్–లోక్‌సత్తా!

“వివక్ష లేకుండా తనలోని శక్తిసామర్థ్యాలను వికసింపచేసుకుని ఎదిగే అవకాశాల్ని ప్రతి బిడ్డకూ కల్పించటం, నివారించదగ్గ బాధల్ని తొలగించటం” ఈ రెంటినీ సాధించటం ద్వారా ప్రతి వ్యక్తీ తన జీవితంలో తలెత్తుకుని ఆత్మవిశ్వాసంతో, సుఖసంతోషాలతో బతికేలా చేయటమే.. ఎఫ్‌డీఆర్ లక్ష్యాలను వివిధ రూపాలలో ప్రజల్లోకి తీసుకెళ్తున్న లోక్‌సత్తా సంస్కరణల వెనక ప్రధాన స్ఫూర్తి. ఇందుకోసమే ‘ప్రజలే ప్రభువులు, పాలకులు, ప్రభుత్వోద్యోగులు సేవకులే’ అనే నినాదంతో తమ సాధికారత కోసం అవగాహనతో రాజ్యాంగబద్ధంగా పోరాడే పౌరశక్తిగా ప్రజల్ని తయారుచేస్తూ వారికో వేదికగా దీపస్తంభంలా లోక్‌సత్తా పనిచేస్తోంది.

లోక్‌సత్తా ఉద్యమం తొలినాటి నుంచి ఒక వినూత్నమయిన, విశిష్టమయిన పంథాని అనుసరించింది. లోక్‌సత్తా ఆవిర్భావం వరకూ రాజకీయాలని ద్వేషించటం,

తిరస్కరించటం మధ్యతరగతి వర్గానికి, యువతకి ఆనవాయితీ అయింది. లోక్‌సత్తా ఆ సాంప్రదాయానికి విరుద్ధంగా, నిజమయిన రాజకీయం పవిత్ర వ్యాసంగమని నిర్ద్వంద్వంగా ప్రకటించింది. ప్రజాస్వామ్యం, రాజకీయం అవిభాజ్యమని, రాజకీయాన్ని తిరస్కరించటం స్వేచ్ఛకి, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టవుతుందని లోక్‌సత్తా బలంగా వాదించింది. మన రాజకీయంలో ఉన్న లోపాలకి విరుగుడు మరింత మంచి, మరింత ఎక్కువ రాజకీయమేనని, ప్రజల భాగస్వామ్యంతో జనరాజకీయాన్ని సృష్టించటం అత్యవసరమని ఉద్ఘాటించింది. లోక్‌సత్తా అవిశ్రాంతంగా చేసిన ఈ పోరాటం కాలక్రమేణా దేశంలో విద్యావంతులని, మధ్యతరగతిని, యువతని, మీడియాని గణనీయంగా ప్రభావితం చేసింది. ఈ క్రమంలో మన ప్రజాస్వామ్యం దిశను, భాషను గణనీయంగా ప్రభావితం చేసింది లోక్‌సత్తా. గత మూడు దశాబ్దాలుగా ఎన్నడూలేనంతగా గతంలో రాజకీయాన్ని ద్వేషించిన వర్గాలు ఇప్పుడు రాజకీయాన్ని విస్మరించరానిదని, ఏదో ఒక రూపంలో నిజాయతీగా రాజకీయాన్ని ప్రభావితం చేయటం అవసరమని గుర్తిస్తున్నాయి.

స్వతంత్ర పోరాటంలో వలసపాలనకి వ్యతిరేకంగా కొన్నిరకాల ఉద్యమరూపాలని మన జాతి నిర్మాతలు రూపొందించారు. పరాయిపాలన పట్ల విముఖత ఉన్న కాలంలో, ప్రజలకి ఓటుగాని, ప్రాథమిక హక్కులుగాని లేనికాలంలో, పాలనని, జనజీవనాన్ని స్తంభింపజేయటం ఒక ఎత్తుగడగా రూపుదిద్దుకుంది. కానీ స్వతంత్రం వచ్చి మనం రాజ్యాంగాన్ని ఏర్పరుచుకున్నాక కూడా అదే సంప్రదాయం ఆనవాయితీగా కొనసాగుతూ వచ్చింది. ప్రజల దృష్టిని ఆకర్షించాలన్నా, పత్రికలలో సులభంగా ప్రచారం పొందాలన్నా, ప్రభుత్వాలని ఇరుకున పెట్టాలన్నా బందులు, రాస్తారోకోలు, రైల్‌రోకోలు లాంటి కార్యక్రమాలతో ప్రజాజీవనాన్ని ఆటంకపరచటం మాత్రమే మార్గమని అన్నివర్గాలు నమ్ముతూవచ్చాయి. లోక్‌సత్తా ఉద్యమం తొలినుంచి ఆటంకానికి, విధ్వంస సంస్కృతికి స్వస్తిచెప్పింది. ఒక స్వేచ్ఛాయుత సమాజంలో ఓటుహక్కు, వాక్స్వాతంత్ర్యం, రాజ్యాంగం ఇచ్చిన హక్కులు మాత్రమే ప్రజలకు ఆయుధాలుగా ఉండాలని, ఉద్యమాలు చట్టం, రాజ్యాంగం, ఇతరుల హక్కుల రక్షణ– ఈ పరిధులకి లోబడి ఉండాలని లోక్‌సత్తా నిరంతరం నమ్మి ఆచరించింది, ఏటికి ఎదురీదింది, కొత్తరకం ఉద్యమాలకి నాంది పలికింది.

నిజమయిన ఫలితాలని సాధించాలంటే వినూత్న మార్గాలు కావాలని లోక్‌సత్తా గుర్తించింది. పెట్రోలు బంకుల్లో తూనిక మోసాన్ని అరికట్టటం కోసం ముందుగా

# ఐదు కోణాల్లో సంస్కరణలు

ప్రజాస్వామ్యం బలోపేతమై ప్రతి పౌరుడూ సాధికారతతో తలెత్తుకుని బతికేందుకు, ఎదిగేందుకు ఎఫ్.డి.ఆర్, లోక్‌సత్తా ముఖ్యంగా ఐదు కోణాల్లో సంస్కరణల కోసం పనిచేస్తున్నాయి:

**1. స్వేచ్ఛ:** వ్యక్తి స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణం. భావ ప్రకటన హక్కు, ఎక్కడైనా నివశించే హక్కు, మత స్వేచ్ఛ, వృత్తి స్వేచ్ఛ ఇందులో భాగాలు. కానీ వ్యక్తి స్వేచ్ఛను అనేక రూపాలలో హరిస్తున్నారు.

**2. స్వయంపాలన:** ప్రజాస్వామ్యంలో పౌరులకు తమని తాము ప్రత్యక్షంగా లేదా పరోక్ష ప్రాతినిధ్య పద్ధతిలో పాలించుకునే హక్కు ఉంది. కానీ మన ఎన్నికల వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండటం వల్ల ఎన్నికల్లో డబ్బు, కండబలం, కులం, ప్రాంతం, మతం చొరబడి ప్రజలను కేవలం ఓటు వేసే యంత్రాలుగా మార్చేశాయి.

**3. ప్రజల భాగస్వామ్యాధికారం:** పాలనలో పౌరులకు నిరంతర భాగస్వామ్యం ఉండాలి. కానీ కేంద్రీకృత పాలన వల్ల పౌరుల ప్రమేయం లేకుండా నిర్ణయాలు జరుగుతున్నాయి. పరిపాలన వికృత రూపం దాల్చి ప్రజాస్వామ్య ఫలితాలు ప్రజలకు అందకుండా చేస్తోంది. దీనికి పరిష్కారమైన వికేంద్రీకరణను అణచివేస్తున్నారు.

**4. చట్టబద్ధ పాలన:** ఎంతటి సంపన్నులైనా, ప్రజాప్రతినిధులైనా, ఉన్నతాధికారులైనా చట్టం ముందు సామాన్యుడితో సమానం కావాలి. చట్టం ఎవరికైనా ఒకటే కావాలి. కానీ ప్రస్తుతం డబ్బు, అధికారం, ఉన్నవాడికో న్యాయం, లేనివాడికో న్యాయం నడుస్తోంది.

**5. స్వయందిద్దుబాటు:** రాజ్య వ్యవస్థలో స్వయందిద్దుబాటుకి, స్వయంపరివర్తనకి తగిన వ్యవస్థ ఉండాలి. మన పాలనా వ్యవస్థ భయంకరమైన ఉపద్రవాలు వచ్చినప్పుడు తాత్కాలికంగా స్పందించటం తప్ప, ముందుచూపుని, స్వయంపరివర్తనా శక్తిని కోల్పోయింది.

మొత్తం మీద ప్రజాస్వామ్య ఫలితాలను ప్రజలకు అందించాల్సిన వ్యవస్థలు భారత్‌లో పూర్తిస్థాయిలో పనిచెయ్యటం లేదు. ఈ ఐదు కోణాల్లో సంస్కరణలతో ప్రజలను ప్రభువులుగా చేసి పాలకులను సేవకులుగా మార్చి.. జన రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థను నిర్మించటమే లోక్‌సత్తా లక్ష్యం.

కొలిచి, ధృవపరిచిన పాత్రలలో పెట్రోలు, డీజిల్ నూనెను నింపమని పౌరులు కోరటం ఒక వినూత్న పద్ధతి. శాంతియుతంగా, చట్టబద్ధంగా కార్యకర్తలు, పౌరులు ఇలా

కోరగానే మీటర్లలో మోసం బయటపడిపోయింది. కళ్లెదురుగా తూనికలలో మోసం రుజువవటంతో ఆయిల్ కంపెనీలు దేశమంతటా పెట్రోలు బంకులలో మీటర్లని సరిచేసి మోసాన్ని 90శాతం వరకు అరికట్టాయి. మన వినియోగ దారులకి ఇన్నేళ్లలో లక్షల కోట్ల రూపాయలు మిగిలాయి. అతి సులభంగా, శాంతియుతంగా, చట్టబద్ధం గా, ఆర్భాటాలు లేకుండా, వినూత్న పద్ధతులలో పెనుమార్పులు ఎలా సాధించవచ్చో లోక్‌సత్తా ఆచరణలో రుజువుచేసింది. అలాగే విశ్వసనీయ మయిన రీతిలో, ప్రజల భాగస్వామ్యంతో, పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నేరచరితని లోక్‌సత్తా బయటపెట్టటంతో, అది చివరికి ప్రతి అభ్యర్థీ తన వివరాలను తానే బయటపెట్టే చట్టానికి దారితీసింది. కోటికిపైగా సంతకాల సేకరణతో స్థానిక ప్రభుత్వాల సాధికారతే నిజమయిన ప్రజాస్వామ్యమనే చైతన్యాన్ని సమాజంలో పెంచింది. అవినీతి కుంభకోణంలో మునిగిపోయిన 2–జీ స్పెక్ట్రం లైసెన్సుల రద్దు కోసం సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేసి, అన్ని సహజవనరుల కేటాయింపులు బహిరంగ వేలం ద్వారాను, పోటీద్వారాను మాత్రమే జరగాలని వాదించి గెలిచింది. దాని పర్యవసానంగా 2–జీ స్పెక్ట్రం లైసెన్సుల వేలంపాటలో ప్రభుత్వానికి లక్షకోట్ల రూపాయిలకు పైగా అదనపు ఆదాయం వచ్చింది. అలాగే బొగ్గు గనుల వేలంపాటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి కొన్ని లక్షల కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. ఇలా నూతన ప్రక్రియలని సృష్టించి దీర్ఘకాల మార్పుకి, నిజమయిన సంస్కరణలకి లోక్‌సత్తా శ్రీకారం చుట్టింది.

మనదేశంలో ఉద్యమాలంటే.. అయితే ప్రభుత్వాలని, పార్టీలని తిట్టిపోయటం, లేదా తాత్కాలికంగా జనాకర్షణలని ఎరచూపించి అన్నీ ఉచితంగా ప్రభుత్వం అందించాలని ప్రజలని సమీకరించటం ఆనవాయితీ అయ్యాయి. లోక్‌సత్తా ఉద్యమం ఈ సంప్రదాయానికి భిన్నంగా వాస్తవాలు, సాక్ష్యాలు ఆధారంగా, హేతుబద్ధమయిన వాదనలతో శాస్త్రీయ పరిష్కారాలని, దీర్ఘకాలిక సంస్కరణలని ప్రతిపాదించింది. ప్రజాస్వామ్యంలో పౌరులు పౌరుల్లాగా ప్రవర్తించాలిగానీ పాలితులుగా కాదంటూ కొత్త ధోరణులతో ద్వేషరహితంగా సామరస్య వాతావరణంలో మంచి బహిరంగ

చర్చను సమాజం ముందు పెట్టటంలో లోక్‌సత్తా గొప్ప విజయం సాధించింది. పార్టీల పట్ల పక్షపాత ధోరణి చూపకుండా, ఎన్నికైనవాళ్లంతా ద్రోహులు అన్న నిరాశనిరసన భావాల్ని ప్రదర్శించకుండా రాజ్యాంగ పద్ధతుల ద్వారా, సామరస్యంగా పరిష్కారాల కోసం విశేష కృషి చేయబట్టే ఈ దేశ చరిత్రలో మరే ఉద్యమమూ సాధించనన్ని ఫలితాలను లోక్‌సత్తా సాధించింది. ఎన్నో సందర్భాలలో అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించి ఎన్నో గణనీయమయిన మార్పులని సులువుగా సాధించింది. ఉదాహరణకి తెహల్కా కుంభకోణం నేపథ్యంలో అన్ని పార్టీలనీ ఒప్పించి నిజాయతీ రాజకీయానికి, ఎన్నికల ప్రచారానికి కావలసిన నిధులని నిజాయతీగా, దాతలకి పన్ను రాయితీలతో సేకరించే సమగ్ర చట్టాన్ని లోక్‌సత్తా సాధించింది. అమాయక ప్రజల ఓట్లు కొనుగోలు, కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలని రెచ్చగొట్టే ఓటుబ్యాంకు రాజకీయాలు, ప్రజాధనంతో మౌలిక సదుపాయాలని, ఉమ్మడి సేవలని అందించకుండా తాత్కాలిక తాయిలాలతో ఆకర్షించే సంస్కృతి ఉన్న దేశంలో ఎన్నికల నిధుల సంస్కరణలు చాలవు. కానీ నిజాయతీ రాజకీయానికి నిజాయతీ పద్ధతులతో నిధులని సమకూర్చటం మన రాజకీయ ప్రక్షాళనలో ఒక కీలకమయిన ముందడుగు. ఇలా ప్రతి సమస్యకి వాస్తవాలు, తర్కం ఆధారంగా ఆచరణసాధ్యమయిన, జాతి భవిష్యత్తుని పదిలపరిచే దీర్ఘకాల పరిష్కారాలని సూచించటంలోను, దేశప్రజలలోను, రాజకీయ పార్టీలలోను ఏకాభిప్రాయసాధనలోను లోక్‌సత్తా చేసిన కృషి, సాధించిన విజయాలు నిరుపమానమయినవి.

ప్రజాస్వామ్య సమాజంలో రాజకీయం ప్రాధాన్యతని గుర్తించటంలోను, జనజీవనాన్ని ఆటంకపరచకుండా శాంతియుత ఉద్యమాలను రూపొందించటంలోను, హేతుబద్ధమయిన పరిష్కారాలను నిరంతరం జాతి ముందు పెట్టి ఒడుపుగా వాటిని సాధించేందుకు పోరాటం చేయటంలోను లోక్‌సత్తా ఎంతో ముందుచూపుని, వ్యూహపటిమని, ప్రజాస్వామ్య దృక్పథాన్ని ప్రదర్శించింది. ఈ పద్ధతులవల్లనే పార్లమెంటులో ఒక్క సభ్యుడు కూడా లేకుండా లోక్‌సత్తా స్వతంత్ర భారతంలో దేశచరిత్రలో మరే ఉద్యమమూ సాధించనన్ని విజయాలను సునాయాసంగా సాధించగలిగింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచంలో మరే పౌరసమాజ ఉద్యమమూ శాంతియుతంగా, అధికారం లేకుండా ఇన్ని విజయాలు సాధించలేదు, ఇన్ని లక్షల మందిని ఆలోచింపచేయలేదు.

**లోక్‌సత్తా సాధించిన విజయాలలో కీలకమయిన కొన్ని సంస్కరణలు:**

- ◆ పెట్రోలు బంకుల్లో తూనికల మోసాన్ని చాలావరకు అరికట్టటం
- ◆ ఓటర్ల జాబితాల ప్రక్షాళన
- ◆ అభ్యర్థుల నేరచరితని, ఇతర వివరాలని ప్రకటించే చట్టం (2003)
- ◆ పార్టీల విరాళాలలో పారదర్శకతని తెచ్చే చట్టం (2003)
- ◆ పరోక్ష పన్నుల (సెంట్రల్ ఎక్సయిజ్, కస్టమ్స్) సేకరణలో కీలక సవరణలు
- ◆ పార్టీ ఫిరాయింపు నిషేధాన్ని బలోపేతం చేసే రాజ్యాంగ సవరణ (91వ సవరణ)
- ◆ మంత్రివర్గ సభ్యుల సంఖ్యని కుదించే ఏర్పాట్లు
- ◆ పాలనా సమాచార హక్కు చట్టం (2005)
- ◆ జాతీయ ఆరోగ్య మిషన్ (2005)
- ◆ స్థానిక న్యాయాలయాల చట్టం (2009)
- ◆ ఆహారధాన్యాల ఎగుమతులపై నిషేధం ఎత్తివేత, వాణిజ్య ఆంక్షల తొలగింపు
- ◆ సహకార సంఘాల స్వయంప్రతిపత్తి (97వ రాజ్యాంగ సవరణ – 2012)
- ◆ 2 జీ – స్పెక్ట్రం లైసెన్సుల రద్దు – సహజ వనరుల వేలం పాట విధానం (2013)
- ◆ లోక్‌పాల్ చట్టం (2014)
- ◆ ఉన్నత న్యాయమూర్తుల నియామకం కోసం 99వ రాజ్యాంగ సవరణతో జాతీయ జ్యుడీషియల్ నియామకాల కమిషన్ (ఎన్‌జెఏసి – 2015)
- ◆ స్థానిక ప్రభుత్వాలకి నిధుల కేటాయింపులో గణనీయ పెంపు


**వివిధ దశలలో ఉండి త్వరలో అమలుకాబోతున్న సంస్కరణలు:**

- ◆ న్యాయవ్యవస్థలో ప్రమాణాలు, జవాబుదారీతనం కోసం చట్టం
- ◆ పౌరసేవలని హక్కుగా చేసే సర్వీసు గ్యారంటీ చట్టం

విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలు, చట్టబద్ధమైన పాలన, పోలీసు సంస్కరణలు, రాజకీయ, ఎన్నికల సంస్కరణలు – ఈ రంగాలలో మరిన్ని మౌలిక మార్పుల కోసం లోక్‌సత్తా కృషిని కొనసాగిస్తోంది.

ఆటనియమాలను మార్చటం ముఖ్యంగానీ ఆటగాళ్లను మార్చటం చాలదని

# లోక్‌సత్తా పార్టీ జెండా ఎజెండా!




**రంగు:** సముద్ర (ముదురు) నీలం

ఒదిగి వుండి, అన్ని రకాల ప్రవాహాలను తనలో ఇముడ్చుకుని,

స్వతంత్రంగా వ్యవహరించగల దక్షతకు చిహ్నం.

**నక్షత్రం:** సుదూరంగా, స్థిరంగా లక్ష్యసాధనకు మార్గదర్శకమైనది

**ఐదు కోణాలు:** ఉత్తమ ప్రజాస్వామ్యానికిగల ఐదు మౌలికాంశాలు

1) స్వేచ్ఛ 2) స్వయంపాలన 3) ప్రజల భాగస్వామ్యం 4) చట్టబద్ధ పాలన 5) స్వయందిద్దుబాటు

నక్షత్రంలోని ఐదు కోణాలు వీటికి ప్రాతినిధ్యం వహిస్తాయి.

**తెల్లని బింబం:** తెలుపు స్వచ్ఛతకి చిహ్నం.

అన్ని రంగుల మేలు కలయికకు చిహ్నం. కులం, మతం, ప్రాంతం, భాష తదితర భిన్నత్వంలో ఏకత్వానికి చిహ్నం.

తొలినుంచి లోక్‌సత్తా వాదిస్తూ వచ్చింది. అయితే పదేళ్ల లోక్‌సత్తా ప్రస్థానం తర్వాత మౌలికమయిన రాజకీయ సంస్కరణల్ని సాధించటం కోసం ప్రధాన పార్టీల మీద రాజకీయ ఒత్తిడి కూడా అవసరమన్న ఆలోచన కాలక్రమేణా బలపడింది. మారుతున్న సామాజిక, ఆర్థిక వ్యవస్థలు, పెరుగుతున్న పట్టణీకరణలో కనీసం పట్టణ ప్రాంతాలు, మధ్యతరగతివారు, యువతలో ఓ 20శాతంమంది నిలకడగా మన వ్యవస్థలో మార్పు కోసం ఓటు వేయటానికి సిద్ధపడితే దాని ప్రభావం మన రాజకీయ వ్యవస్థ మీద ఖచ్చితంగా ఉంటుందని లోక్‌సత్తా భావించింది. మన ఎన్నికల వ్యవస్థలో 15-20శాతం ఓట్లు వచ్చినంత మాత్రం చేత ఆ పార్టీలకు చట్టసభలో ప్రాతినిధ్యం లభించదు. కానీ ప్రజల్లో మార్పు కోరే వారి సంఖ్య పెరుగుతుందనే ఉద్దేశం ప్రతి పార్టీనీ ప్రభావితం చేస్తుంది, వాటి విధానాల్ని, ఆలోచనని, రీతిని ప్రభావితం చేస్తాయి. ప్రజలు మార్పును కోరుతున్నారన్న సాక్ష్యాలు ఓట్ల రూపంలో బలంగా కనపడ్డప్పుడు మాత్రమే ప్రధాన పార్టీలు స్పందించి మార్పును తీసుకున్నాయని ప్రపంచంలోని అన్ని ప్రజాస్వామ్యాల అనుభవం చెబుతోంది. అందుకే, మార్పుని కోరే ప్రజల ఓటుని

సంఘటితం చేసి మన రాజకీయ, పాలనా సంస్కరణలు వేగవంతం చేయటం కోసం ఓ వర్గంగానూ, ఒక నిజమైన నాగరిక ప్రజాస్వామ్యంలో పార్టీల తీరు, బహిరంగ చర్చ ప్రమాణాలు ఎలా ఉండాలో ఆచరణలో చూపెట్టాల్సిన అవసరముందన్న ఆలోచనతోనూ లోక్‌సత్తా పార్టీ ఏర్పడింది. అయితే, పార్టీకి ప్రజల మనసుల్లో ఆదరణ ఉన్నా మన ఎన్నికల వ్యవస్థ కారణంగా, మన సమాజంలో రాజకీయంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా లోక్‌సత్తాకు లభిస్తున్న ఓట్లు మనదేశంలో వేగంగా గణనీయ మార్పుల్ని సాధించటానికి కావలసిన వాటికంటే బాగా తక్కువ వచ్చాయి.

ఇదే సమయంలో గత 20 ఏళ్లలో దేశ రాజకీయాలలో, రాజ్యవ్యవస్థలో కొన్ని మంచి మార్పులు వచ్చాయి, వస్తున్నాయి. కానీ అవి ఈదేశం సుస్థిర అభివృద్ధికి, అందరికీ ఎదిగే అవకాశాలకు భరోసా ఇచ్చేందుకు చాలవు. కొన్ని రంగాలలో సంక్షోభం మరింత పెరుగుతూ వస్తోంది. ఎన్నికలలో అక్రమ ఖర్చు ఈ రెండు దశాబ్దాలలో పది నుంచి ఇరవై రెట్లు పెరిగింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలలో ఎన్నికల ఖర్చు విపరీతంగా పెరిగిపోయి, రాజకీయం పూర్తిగా వ్యాపారంగా మారిపోయింది. దాంతో ప్రభుత్వాలు మారినా అధికారాన్ని స్వంత లాభం కోసం దుర్వినియోగం చేయటం, రాజకీయంలో అనారోగ్యకరమయిన పోటీవల్ల ఓట్లు కొనుగోలు చేయటం, పదవులని కేవలం అక్రమార్జన కోసం మార్గాలుగా భావించటం మరింతగా పెరిగిపోయాయి. ఓటుకి, ఎన్నికయ్యే ప్రభుత్వానికి, ప్రజలకంతే నిజమయిన ఫలితాలకి మధ్య సంబంధం తెగిపోవటంతో కుల, మతాల సమీకరణ, ప్రజల దీర్ఘకాల ప్రయోజనాలని తాకట్టుపెట్టి తాత్కాలిక తాయిలాలు ఆశచూపటం సర్వసాధారణమయిపోయాయి.

1980ల దశకం దాకా దేశంలో కేంద్రీకరణ పెరిగిపోయి కేంద్ర ప్రభుత్వ పెత్తనంలో రాష్ట్రాలు నలిగిపోయాయి. అయితే 1990ల నుంచి వచ్చిన రాజకీయ, ఆర్థిక మార్పుల వల్ల ఫెడరలిజం బలపడి రాష్ట్రాలకి అధికారాలు, వనరులు పెరిగాయి. అదేసమయంలో రాజ్యనిర్వహణలో రాష్ట్రాలకున్న వెసులుబాటు తగ్గిపోతున్నది. రాష్ట్రాలకి రాజ్యాంగం కేటాయించిన అంశాలలో కూడా కేంద్ర చట్టాలలో, లోపభూయిష్టంగా చేసిన రాజ్యాంగ సవరణలు రాష్ట్రాలకి వెసులుబాటు లేకుండా చేస్తున్నాయి. ఉదాహరణకి మంచి ఉద్దేశాలతోనే 73, 74 రాజ్యాంగ సవరణలు, విద్యాహక్కు చట్టం, భూసేకరణ చట్టం, ఆహార భద్రతా చట్టం వంటివి వచ్చాయి. కానీ దేశంలో ఉన్న భిన్నత్వాన్ని, వైవిధ్యాన్ని

పరిగణలోకి తీసుకోకుండా అన్ని రాష్ట్రాలకి, ప్రాంతాలకి ఒకే మూసని వర్తించే ప్రయత్నం వల్ల చాలా చిక్కులు ఎదురవుతున్నాయి. ప్రజలకి ఫలితాలు అందకుండా పోతున్నాయి. నిజానికి మనదేశంలో ప్రజలు ఎన్నికలలో తీర్పునిచ్చేది రాష్ట్ర ప్రభుత్వాలపైన. పార్లమెంటు నుంచి పంచాయతీ ఎన్నికల దాకా ప్రజలు కేవలం రాష్ట్ర ప్రభుత్వం పనితీరుని బట్టి, ఆ ప్రభుత్వం మీద తమకున్న అభిప్రాయాలని బట్టి ఓటు వేస్తున్నారు.

జవాబుదారీతనం రాష్ట్రాలకే ప్రధానంగా ఉన్నప్పుడు, ప్రజలకు సేవలందించటానికి పరిపాలన మొత్తాన్ని పునర్వ్యవస్థీకరించే వెసులుబాటు కూడా రాష్ట్రాలకి కూడా ఉండటం అవసరం. దేశ ఐక్యతని కాపాడుకోవటం కోసం కేంద్రానికి ఉన్న సర్వాధికారాలని కొనసాగిస్తూనే, రాష్ట్రాలలో ప్రభుత్వ విధానాన్ని, స్థానిక ప్రభుత్వాన్ని, పాలనాయంత్రాంగాన్ని ప్రజల మద్దతుతో సంస్కరించే వెసులుబాటు రాష్ట్రాలకి ఉండటం అవసరం.

విద్య, ఆరోగ్యం దేశమంతటా అధ్వాన్నస్థితిలో ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ కొంతమేరకు పెరుగుతున్నా, ఆ సంపద సృష్టిలో బీదవర్గాలకి, సరయిన విద్య, ఆరోగ్యం అందని సామాజిక వర్గాలకి తగిన వాటా అందటం లేదు. ఆధునికయుగంలో పుట్టుకతో వచ్చిన అంతరాలని తొలగించాలంటే, కులంతో, కుటుంబ బీదరికంతో, తల్లిదండ్రుల చదువుతో నిమిత్తం లేకుండా, పుట్టిన ప్రతి బిడ్డకి మంచి ప్రమాణాల విద్య అందే ఏర్పాట్లు, ప్రతి కుటుంబానికి జేబులో డబ్బు ఖర్చు లేకుండా మంచి ఆరోగ్యం అందే ఏర్పాట్లు ఉన్నప్పుడే సమాన అవకాశాలు అన్ని వర్గాలకు అందుతాయి. అలా జరగకపోతే అసమానతలు పెరిగిపోవటంతోపాటు నూటికి 80మంది ప్రజలకి సంపద సృష్టిలో భాగస్వామ్యంగాని, ఉపాధి అవకాశాలుగాని ఉండవు. ఈ పరిస్థితి దేశ ఆర్థిక భవిష్యత్తుకి, సామాజిక శాంతికి ప్రమాదంగా పరిణమిస్తుంది.

దేశంలో కోట్లాదిమంది యువత, మధ్యతరగతి, ఆలోచించేవారు, స్థానికంగా సమస్యలని పరిష్కరించే నేర్పరితనం ఉన్నవారు, ప్రజలని సంఘటితం చేసే శక్తి, విశ్వసనీయత కలవారు ఉన్నారు. కానీ మన కేంద్రీకరించిన పాలన వారిని సమస్యల పరిష్కారంలో భాగం చేయటం లేదు. పట్టణాలలో ఆస్తిపన్ను, ఇతర పన్నులు కట్టినా ఏ సేవలు సరిగ్గా అందక ప్రజలలో ఓ వంక అసహనం, మరోవంక మనం ఏమీ చేయలేమనే అసహాయత పెరుగుతున్నాయి. సమస్యల్ని పరిష్కరించేవారు కేవలం నిత్య ఆందోళనకారులుగానో, అర్జీలిచ్చి అర్థించేవారిగానో ఉండవలసి వస్తోంది. మంచి

సంకల్పంతో ప్రారంభించిన స్వచ్ఛ భారత్‌లాంటి కార్యక్రమాలు కూడా అనుకున్న మేరకు ఫలితాలు సాధించకపోవటానికి కారణం స్థానిక ప్రభుత్వాలకి, ప్రజలకి తగిన పాత్ర లేకుండా చేయటం.

ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇతర రాజకీయ, పాలనా, ఎన్నికల సంస్కరణలతోపాటు ఈ కీలకమయిన సంస్కరణలని వెంటనే సాధించటం దేశ భవిష్యత్తుకి అవసరం:

1. కేంద్రం అధికారాలకి, దేశ సమగ్రతకి భంగం లేకుండా రాష్ట్రాల పూర్తి స్వయం నిర్ణయాధికారాలనిచ్చి ప్రజలకి పూర్తిస్థాయిలో సేవలందించే వెసులుబాటునివ్వటం

2. ఉత్తమ ప్రమాణాల విద్యని ప్రతి బిడ్డకీ అందించటం, ప్రతి కుటుంబానికీ జేబులో ఖర్చు లేకుండా ఉత్తమ ప్రమాణాల ఆరోగ్యాన్నందించే వ్యవస్థని ఏర్పరచటం

3. స్థానిక ప్రభుత్వాలకి, పౌరులకి పూర్తి బాధ్యతలు, పన్నుల్లో వాటాని అందించి స్థానికంగా సమస్యల పరిష్కారంలో, విధానాల అమలులో వారిని పూర్తి భాగస్వాములని చేయటం.

వీటితోపాటు, ప్రజల్ని చీలుస్తూ సమాజాన్ని ఇంకా నష్టపరుస్తున్న శతాబ్దాల అమానుష కులవ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపరిచి కులరహిత సమాజం దిశగా నడిపించటం, పరిజ్ఞానంతో ప్రశ్నించే యువనాయకులను ఎక్కడికక్కడ తయారుచేసేందుకు పౌరసత్వ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించటం కార్యక్రమాల్ని కూడా సామాజిక సంస్కరణ కార్యక్రమాలుగా చేపట్టటం అవసరమని లోక్‌సత్తా మలిదశ (2.0) ఉద్యమం ప్రతిపాదించి అందుకోసం కృషి చేస్తోంది. ★

**Dr Jayaprakash Narayan (JP):**
**THE LEADER for PEOPLE POWER (Life & Mission)**

# ప్రపంచంలోనే అతి పెద్ద కలనుగన్న సాహసి, భారత్‌లో వ్యవస్థీకృత రాజకీయ, పాలనా సంస్కరణలకు నాంది జేపీ (జీవితం - మహాకార్యం)



**జ**నం జీవితాల్ని విప్లవాత్మకంగా మార్చే కొత్త రాజకీయానికి భారతదేశంలో పునాది వేసిన సమూల సంస్కర్త డాక్టర్ లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ (జేపీ).

స్వాతంత్ర్యపోరాట స్ఫూర్తి ఇంకా కొనసాగుతున్న రోజులవి... 1956, జనవరి 14న కృష్ణాజిల్లా విజయవాడ లో సెంట్ ఏన్స్ ఆసుపత్రిలో ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబంలో నాగభైరవ జయప్రకాష్ నారాయణ్ జన్మించారు. తల్లిదండ్రులు బాల కోటమ్మ, వెంకటేశ్వరరావు.

మహారాష్ట్రలోని నాగ్‌భేడ్‌లో జయప్రకాష్ అక్షరాలు దిద్దారు. కృష్ణా జిల్లా గొడవర్రు గ్రామంలో పాఠశాల చదువు పూర్తి చేశారు. అనంతరం విజయవాడ లయోలా కాలేజీలో చేరారు.

తర్వాత 1972లో గుంటూరు మెడికల్ కాలేజీలో జయప్రకాష్ నారాయణ్ జాయినయ్యారు. దేశ రాజకీయాల్నేగాక యువ జయప్రకాష్ జీవితాన్ని కూడా మలుపు తిప్పిన సంవత్సరాలవి. చాలామంది విద్యావంతులైన యాంగ్రీ యంగ్‌మెన్‌లాగే జయప్రకాష్ మనసు కూడా వ్యవస్థలోని దోపిడీ పట్ల ఉడికి పోయింది. అయితే మిగిలినవారిలోలాగా అది పైపైన ఉద్రేకంలా ఆయనలో చల్లారలేదు. ఎందుకీ అన్యాయం? దీనికి పరిష్కారం లేదా? ఇందుకోసమేనా మనం స్వాతంత్ర్యం తెచ్చుకున్నది? అని మథనపడుతుండేవారు. నిజాయితీ, నిర్భీతితో నిండివుండడంతో

ఆయన భావాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేవి, ఆలోచింపజేసేవి. దేశ సామాజిక, రాజకీయాంశాలపై జరిగే అంతర్ కళాశాలల చర్చా పోటీల్లో ఆయనే ఎప్పుడూ విజేత.

జయప్రకాష్ మనసులో ఉన్న తిరుగుబాటు భావాలు ఎమర్జెన్సీ సమయంలో (1975–1977) ఇంకా పదునెక్కాయి. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా విప్లవం నడిపి ఇందిరాగాంధీని గద్దెదించిన లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ పేరునే తల్లిదండ్రులు ఆయనకు పెట్టటం యాదృచ్ఛికం. జనతా ప్రభుత్వం అంత: కలహాలతో పతనమవుతున్న నేపథ్యంలో వ్యవస్థలో మార్పు కోసం ఏదోఒకటి చేయాలని బలంగా భావిస్తున్న క్రమంలో ఆయన సివిల్ సర్వీసెస్ వైపు దృష్టి మళ్లించారు. టాపర్‌గా 1980లో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్)లో చేరారు.

మంచిని మంచిగా, చెడును చెడుగా చూడగల నిష్పాక్షికత, ప్రజల విజ్ఞత పట్ల చెదరని విశ్వాసం జయప్రకాష్ నారాయణ్‌ను క్రమంగా సాహసోపేత మహాకార్యాల దిశగా ప్రేరేపించాయి, రోల్‌మోడల్‌గా నిలిపాయి, సంస్కర్తగా, జనరాజకీయవేత్తగా మలిచాయి.

## అసమాన సేవల ఐఏఎస్

తన పదహారేళ్ల ఐఏఎస్ కెరీర్‌లో జయప్రకాష్ నారాయణ్  నభూతో అనే రీతిలో అనేక విజయాల్ని చవిచూశారు.  జేపీగా ప్రజల్లో చిరపరిచితులయ్యారు.

జాయింట్ కలెక్టర్ నుంచి ముఖ్యమంత్రి, గవర్నర్ కార్యదర్శిదాకా అనేక హోదాల్లో అసమాన నాయకత్వ లక్షణాలతో పనిచేసిన జేపీ ఎక్కడ అడుగుపెట్టినా సంక్షేమం వెల్లివిరిసింది. ఏ పదవిలో ఉన్నా ఎప్పుడైనా సామాన్యులు తనని కలుసుకునే ఏర్పాటుచేసిన తొలి ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ్! ప్రకాశం, తూర్పు గోదావరి జిల్లాల్లో డాక్టర్ జేపీ సాధించిన ఘనత గురించి ఇప్పటికీ అక్కడి రైతులు, సామాన్య ప్రజలు గొప్పగా చెప్పుకుంటారు.

ప్రకాశం జిల్లాలో రైతుల్ని మైనర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల వైపు పెద్దఎత్తున మళ్లించటం ఆయన సాధించిన ఘనవిజయం. ఫలితంగా రెండున్నరేళ్లలో 453 మైనర్ ఇరిగేషన్ పథకాలు, 2800 ఉపరితల బోరుబావులు, 70 మళ్లింపు పథకాలు రూపు దిద్దుకున్నాయి. వీటిలో చాలావరకూ జేపీ హయాంలోనే పూర్త య్యాయి. వీటివల్ల సుమారు 2,00,000 ఎకరాలకు సాగునీటి సదుపాయం కలిగింది. లక్షకి పైగా రైతుకుటుంబాలు లాభపడ్డాయి. దీనికోసం ఖర్చయ్యింది ఎకరాకు రూ. 2,000

**ఈ ఏడు జాడ్యాలనూ నిర్మూలించి సమున్నత సమతా భారత్‌ని నిర్మిద్దాం**

1) పెరుగుతున్న అసమానతలు, యాచక ప్రవృత్తి, నిరుద్యోగం, పేదరికం 2) కులం, మతం, భాష, ప్రాంతం పేరుతో ప్రజల్ని నిరంతరం విభజించే ధోరణి 3) గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అగాధం పెరుగుతూ... గ్రామాలు ఖాళీ అవటానికి, పట్టణాలు, నగరాలు జనాభాతో కిక్కిరిసిపోవటానికి దారితీయటం 4) విశృంఖల అవినీతి 5) అధికారాన్ని విపరీతంగా కేంద్రీకరించి, ప్రజల్ని నిర్వీర్యుల్ని చేయటం 6) చట్టబద్ధ పాలన కొరవడటం 7) మద్యం, మత్తుపదార్థాల వినియోగం.. ఈ ఏడు జాడ్యాలనూ నిర్మూలిస్తేనే భారతదేశాన్ని ఉన్నతస్థానంలో నిలుపుకోగలం, అందరికీ ఎదిగే అవకాశాలను అందించగలం.

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

మాత్రమే. ఇందులో రైతులు సగం డబ్బు జేబులో నుంచి పెట్టుకోగా, మిగిలిన డబ్బును బ్యాంకులు రుణాలుగా ఇచ్చాయి. ఈ రుణాలలో ఒక్క రూపాయిని కూడా ఎగ్గొట్టకుండా రైతులు తిరిగి చెల్లించారు. యావత్ రాష్ట్రంలో అప్పటిదాకా ప్రభుత్వం ఈ స్కీములకు ఇచ్చిన సాయం కంటే అతి తక్కువ మొత్తంతోనే.. సర్కారు సాగులోకి తెచ్చిన భూమి కంటే ఎన్నో ఎక్కువ ఎకరాల్ని ప్రకాశం జిల్లాలో సాగులోకి తెచ్చారు. ఇన్నేళ్లయినా ఆనాటి పథకాలు ఇప్పటికీ విజయ వంతంగా నడుస్తున్నాయి. సర్ ఆర్థర్ కాటన్ తర్వాత అంత సాధారణ వ్యయంతో అంత పెద్దఎత్తున సాగునీటి సౌకర్యం కలిగించిన వ్యక్తి భారతదేశంలో ఇంకొకరు లేరు. 30ఏళ్ల తర్వాత 2017లో హైదరాబాద్ నుంచి ఎఫ్‌డీఆర్ అధ్యయన బృందం అక్కడికి వెళ్లినప్పుడు.. స్థానికులు ఎంతో ఆప్యాయంగా ఆతిథ్యమిచ్చి వివరాలు చెప్పారు. జేపీ కృషిని అక్కడి పెద్దలు అపురూపంగా పలుమార్లు ప్రస్తావించారు. మా గురించి జేపీ ఇంకా ఆలోచిస్తున్నారా? అనడిగారు.. రైతులకు తమ ప్రయోజనమేమిటో పూర్తిగా తెలియచెప్పి, వారిని అందులో భాగస్వాముల్ని చేయటం ద్వారానే జేపీ ఈ అద్భుతాన్ని సాధించారు. కమ్మ గ్రామాలు, రెడ్డి గ్రామాలు.. ఇలా తరతరాలుగా ముఠాతగాదాలు నడుస్తున్న ఊళ్లను కూడా ఒక ఉమ్మడి ప్రయోజనం దిశగా జేపీ ఏకం చేశారు.

అలాగే ఎన్నో వ్యయప్రయాసలకోర్చి జేపీ గోదావరి డెల్టాలో మురుగుకాల్వ వ్యవస్థను ప్రక్షాళన కార్యక్రమం చేపట్టారు. అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డిని ఒప్పించి మరీ ప్రపంచ బ్యాంకు నిధుల్ని సాధించారు. తర్వాత తుపాను పునర్నిర్మాణ పథకంగా ఇది పెద్దఎత్తున విజయవంతమైంది.


విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు ఉద్యోగాలిప్పించటం జేపీ కెరీర్‌లో మరో చెప్పుకోదగిన ప్రజాసంక్షేమ విజయం. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం వల్ల స్థలాలు కోల్పోయినవారికి ఆయన జీవన భద్రతతో కూడిన పునరావాసం కల్పించారు. ఇప్పుడంటే భూసేకరణ చట్టాలంటూ హడావుడి చేస్తున్నారుగానీ, అప్పట్లో ఆ ఊసే లేదు. అయినా జేపీ పట్టుదలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఇప్పటి లెక్కల ప్రకారం తక్కువే అయినా స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల భూములకు డబ్బులు ఇప్పించారు. ఇళ్లు ఏర్పాటు చేశారు. గోచీలు పెట్టుకునేవాళ్లకు ఉద్యోగాలేంటి అని యాజమాన్య స్థానాల్లో ఉన్నవారు తోసిపుచ్చినా.. రాత్రింబవళ్లు శ్రమించి, ప్రభుత్వంలో గుమస్తా దగ్గర్నుంచి ముఖ్యమంత్రి దాకా అందర్నీ స్వయంగా ఒప్పించి 8000మంది నిర్వాసిత యువతకు సంవత్సరకాలం ప్రత్యేక శిక్షణను జేపీ అందించారు. ప్లాంట్‌లో ఉద్యోగాలిప్పించారు. కేవలం ఆయన బాధ్యతాయుత కృషి, పట్టుదలలే వేల కుటుంబాలకు అక్కడ శాశ్వత జీవనోపాధినిచ్చింది.

కాకినాడ పోర్టు ప్రాంతం అభివృద్ధి, రుణ సహకార రంగ పునరుద్ధరణ, సభ్యులకే పూర్తి అధికారాన్నిచ్చే 1995నాటి 'మ్యాక్స్' సహకార చట్టం, హైదరాబాద్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్కు అభివృద్ధి, పోర్టు నగరాల అభివృద్ధి, విద్యుత్‌రంగ సంస్కరణకు కొత్త విధానాన్ని రూపొందించటం, ఎంటర్‌ప్రెన్యూర్‌లకు ఇండ స్ట్రియల్ ఎస్టేట్‌ల సారథ్యం, సాగునీటి యాజమాన్యంలో రైతు లను భాగస్వాములను చేయటం, ప్రభుత్వరంగ సంస్థల పునర్ని ర్మాణం, పాఠశాలల నిర్వహణలో తల్లిదండ్రుల సాధికారికతకు చట్టం చేయటం వంటివి తన ప్రభుత్వ సర్వీసులో జేపీ సాధించిన కొన్ని గణనీయ విజయాలు. జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్, రాష్ట్ర సహకార బ్యాంకు, పారిశ్రామిక మౌలికవసతుల సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా, గవర్నర్, ముఖ్యమంత్రికి కార్యదర్శిగా వివిధ హోదాల్లో ఆయన సేవలందించారు.

## పదవీ త్యాగం

కలెక్టర్‌గా ప్రకాశం, ఆ తర్వాత తూర్పు గోదావరి జిల్లాల్లో ఇలా పెద్ద విజయాలను సాధించినా, ప్రభుత్వంలో ఐఏఎస్‌గా అనేక ఉన్నత పదవులను నిర్వహించినా, పేరు తగ్గకుండానే కోట్ల సంపదను కూడబెట్టుకునే ఛాన్సున్నా, మరో 18 నెలలు పదవిలో కొనసాగితే పెన్షన్ వచ్చే అవకాశమున్నా.. అన్నీ వదులుకుని ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్ (ఎఫ్‌డీఆర్) సంస్థను (1996), లోక్‌సత్తా రాజకీయ ఉద్యమాన్ని (1997)

జేపీ ప్రారంభించారు. “ఒక అధికారిగా నిజాయతీగా, సమర్థతతో పనిచేస్తే ఇప్పుడున్న వ్యవస్థలో 20శాతం మాత్రమే ఫలితాలను సాధించగలం, కానీ వ్యవస్థ మారితే అదే నిజాయతీ, సమర్థతతో 80శాతం ఫలితాలను సాధించగలం” అనే అవగాహనతో జేపీ రాజకీయాల్లో మార్పు కోసం అసాధారణ సంకల్పంతో, దార్శనికతతో కృషిని ప్రారంభించారు.




ఐఏఎస్ అధికారానికి 1995-96లో జేపీ రాజీనామా చేయటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. వ్యవస్థలో మార్పు కోసం అంత పెద్ద ఉద్యోగాన్ని, సుఖమయ జీవితాన్ని వదిలేసి రావటమా అని సర్వత్రా చర్చ జరిగింది. ఈ కాలంలో కూడా ఇలాంటి త్యాగాలు ఉంటాయా అని విస్తుపోయారు. కొందరిలో అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి. అయితే ప్రపంచం లోనే అతి పెద్ద (ఆచరణాత్మక) కలనుగనే సాహసాన్ని జేపీ చేశారు. ఇలాంటి సందర్భం ఒకటి తన జీవితంలో ఎప్పుడోకప్పుడు తప్పదు అని జేపీ 1983లోనే అనుకున్నారని తెలుసుకున్నాక చాలామంది సంభ్రమాశ్చర్యాలు, అనుమానాలు ఆరాధనగా మారాయి. ‘ఐఏఎస్ నా లక్ష్యం కాదు. ఏ క్షణానైనా నా ఉద్యోగానికి రాజీనామా చేయవచ్చు’ అని పెళ్లికి ముందు జేపీ తనతో చెప్పారని, అందుకు సిద్ధపడే ఆయన్ను వివాహం చేసుకున్నానని ఆయన సతీమణి రాధ పలు సందర్భాల్లో చెప్పారు.

ప్రపంచ దేశాల అనుభవాలన్నిటినీ అధ్యయనం చేసి భారతదేశ పరిస్థితులకనుగుణంగా ఒక నూతన దార్శనికతను లోక్‌సత్తా ఉద్యమం ద్వారా జేపీ అందించారు. ఈ మహాకార్యం మరేదేశంలోనూ ఇంత సంక్లిష్టంగా ఉండదని తెలిసినా ఆ భారాన్ని తలకెత్తుకున్నారు. జేపీలాగా తన భావజాలాన్ని తానే రూపొందించుకుని, దాన్ని సాధించేందుకు స్వయంగా సుదీర్ఘకాలం క్షేత్రస్థాయిలో పూర్తిసమయం పనిచేసిన నాయకులు ప్రపంచ చరిత్రలోనే బహు అరుదు. ఇప్పుడంటే సాంకేతిక పరిజ్ఞానం

బాగా అందుబాటులోకి వచ్చి సమాచారం తేలిగ్గా అందుబాటులోకి వస్తోంది. కానీ లోక్‌సత్తాను ప్రారంభించే సమయంలో ఏ మాత్రం ప్రామాణిక సమాచారం కావాలన్నా ఎన్నో పుస్తకాలను తెప్పించుకోవాల్సి వచ్చేది. దేశవిదేశాల్లోని ఎంతోమందితో లేఖలు, సమావేశాల ద్వారా చర్చించాల్సి వచ్చేది. అప్పట్లో టెలిఫోన్ సదుపాయం కావాలన్నా రేషనే. వీటన్నిటికీ ఎంతో సమయాన్ని వెచ్చించాల్సి వచ్చేది. ఇలాంటి తరుణంలో కూడా జేపీ ఇప్పటికీ పెద్దగా మార్పులుచేర్పులు చేయాల్సిన అవసరం లేని భావజాలాన్ని ఈ దేశానికి అందించారంటే ఆ కష్టాన్ని అర్థం చేసుకోవచ్చు.

ఆర్భాటాలు లేకుండా దేశం నలుమూలలా జేపీ వేలాది సభలలో పాల్గని, తలెత్తుకుని బతికే కొత్త రాజకీయంపై, విధానాలపై ప్రజలలో చైతన్యాన్ని, అవగాహనను పెంచారు. మీడియాలో చర్చలు, వ్యాసాలు, స్పందనల ద్వారా కూడా వీలైనంత మేర తన భావాలను ప్రచారం చేసే ప్రయత్నం చేశారు. పుస్తకాలు, సాంకేతికతను కూడా ప్రచార మార్గాలుగా ఎంచుకున్నారు. అచిరకాలంలోనే లోక్‌సత్తా భారతదేశంలో ప్రజాస్వామ్య సంస్కరణల కోసం జరుగుతున్న అపూర్వ ప్రజాఉద్యమంగా రూపుదిద్దుకుంది. గద్దెనెక్కినవారి కంటే ఎక్కువగా, అత్యంత ప్రాధాన్యత గల అనేక రాష్ట్ర, జాతీయస్థాయి సంస్కరణల్ని (వీటి వివరాల్ని లోక్‌సత్తా విజయాలలో, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఆన్‌లైన్ సైట్లలో చదవొచ్చు) జేపీ సాధించారు.

మార్పు దిశగా మరింత వేగంగా మళ్లాల్సిన పరిస్థితులను సాంప్రదాయ పార్టీలకు కల్పిస్తూ కొత్తతరానికి కొత్త రాజకీయ వేదికగా ఉండటం కోసం గాంధీజయంతి రోజున అక్టోబర్ 2, 2006న లోక్‌సత్తా పార్టీని జేపీ స్థాపించారు. కేవల ఇతర పార్టీలకు ప్రత్యామ్నాయంగా కాకుండా, ఒక ప్రత్యామ్నాయ రాజకీయానికి వేదికగా లోక్‌సత్తా వ్యవహరించింది. స్వతంత్ర భారత రాజకీయాలలో సానుకూల దృక్పథం, ఆధునికత, ఉదార విలువలు, దీర్ఘకాలిక దృష్టి, పార్టీల ప్రజాస్వామికీకరణ, సమర్థత, నిబద్ధత కలిగిన సామాన్యులు రాజకీయాలలో భాగస్వాములవటం, పార్టీలకతీతంగా దేశం కోసం పనిచేయటం వంటివి వేళ్లూనుకోవటానికి లోక్‌సత్తా పార్టీ సూత్రప్రాయంగా గట్టి పునాది వేసింది.

ఒకరికి మేలు జరగాలంటే ఇంకొకరు నష్టపోవాల్సిందే అనే పాత, బూజుపట్టిన 'జీరో సమ్ గేమ్' రాజకీయాల స్థానంలో పరస్పర విరుద్ధమైనవైనా సరే అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేయటమే రాజకీయం లక్ష్యమని, పార్టీల కన్నా దేశ

ప్రయోజనాలు ముఖ్యమని లోక్‌సత్తా ప్రవేశపెట్టిన కొత్త రాజకీయ దృక్కోణం ఆచార్య కొలకలూరి ఇనాక్ ఓ ఉగాది సందర్భంగా చెప్పిన ఈ కవితను గుర్తుచేస్తుంది:

"... పంచవర్ష, పంచవర్ణ పతాకాలు
సోదరతా సూత్రంతో ఎగరకపోతే
మనిషి నిలిచే చోటెక్కడ?
మనుగడ మిగిలే రోజెప్పుడు?

మనకు తెలియటంలేదు కానీ,
మనం నిశ్శబ్దంగా చరిత్రను నిర్మిస్తున్నామనటం సత్యం.

వైరుధ్యాల సమన్వయ సాధనే సమర్థత.
సమర్థులే చరిత్రను నిర్మిస్తారు
భవిష్యత్తును శాసిస్తారు"

భారత ప్రభుత్వ జాతీయ సలహామండలిలో సభ్యునిగా కూడా జేపీ సేవలందించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే పాలనా సమాచార హక్కు (ఆర్.టి.ఐ) చట్టం, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్.ఆర్.హెచ్.ఎం), సహకార సంఘాల బలోపేతానికి 97వ రాజ్యాంగ సవరణ వంటివి సలహా మండలి సభ్యునిగానే జేపీ సాధించారు. భారతదేశ రెండవ పరిపాలనా సంస్కరణల సంఘం సభ్యునిగా కూడా దేశానికి జేపీ ఎనలేని సేవలందించారు. దేశ స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చేందుకు కావలసిన మౌలికమైన పాలనా సంస్కరణలను ఆయన ఈ సంఘంలో సభ్యునిగా రూపొందించారు.

2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు కూకట్‌పల్లి నుంచి జేపీ ఎన్నికయ్యారు. డబ్బు, మద్యం పంచకుండా, ప్రలోభాలు, విద్వేషాలు లేకుండా కొత్త రాజకీయ సంస్కృతితో ఎన్నికై అసెంబ్లీ గౌరవాన్ని పెంచి 'ఆదర్శ శాసనసభ్యునిగా' విస్తృత గుర్తింపును పొందారు. ప్రజాప్రతినిధిగా మైలురాళ్లలాంటి మార్పుల కోసం జేపీ పోరాడారు. పౌరులకు ప్రభుత్వ సేవలు ఒక హక్కుగా అందించేందుకు, అవినీతి నిరోధానికి బలమైన వ్యవస్థలకు, స్థానిక ప్రభుత్వాల సాధికారతకు, నాణ్యమైన విద్య,

ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలకు, న్యాయ సంస్కరణలకు, స్వేచ్ఛామార్కెట్‌తో వ్యవసాయ సంస్కరణలకు, నిరుపేదలకసామాజిక భద్రతకు జేపీ లోతైన కృషిని కొనసాగించారు. వ్యవస్థలో మార్పు కోసం ప్రతిష్ఠనంతా ఫణంగా పెట్టి ఎన్నికలలో ఓడినా ఫర్వాలేదు అని కొత్త రాజకీయాన్ని ఆచరణలో చూపారు. తెలంగాణ ఉద్యమం, రాజకీయ పార్టీల డ్రామాల నేపథ్యంలో రాష్ట్రంలో ఆనాడు పరిపాలన స్తంభించినా అత్యంత ఖరీదైన భూములున్న కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజల మధ్య కుల, మత, ప్రాంతాలకతీతంగా సామరస్యతను పెంచుతూ కమీషన్లు, స్కామ్‌లు లేకుండా రూ. 1600కోట్ల అభివృద్ధి పనులను జేపీ అమల్లోకి తెచ్చారు.

నాలుగు దశాబ్దాలకుపైగా లక్ష్యాల సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా పనిచేస్తున్న జేపీ... స్వచ్ఛమైన రాజకీయాలకు, సుపరిపాలనకు చెరగని చిరునామాగా, దిక్సూచిగా, యువతకు రోల్‌మోడల్‌గా ప్రవాస భారతీయుల్లో సైతం విశేష ప్రాచుర్యం పొందారు. ఎంత సాధించినా తాను ఒక నిష్కల్మష పల్లెటూరి పిల్లవాడిననే చెబుతారు. ప్రజల పట్ల ప్రేమ, హేతుబద్ధ విధానాల తర్వాతే ఎత్తుగడలుండాలని స్పష్టం చేస్తారు. “బేసిక్స్‌ని (మూలాల్ని), లక్ష్యాన్ని ఎన్నడూ మరువకపోవటం, లక్ష్యసాధన కోసం ప్రతిరోజూ పనిచేయటం ఆయన విజయరహస్యాలు”.

ఆటగాళ్లు కాదు ఆటనియమాలు మారాలి, మంచి రాజకీయాల్ని మించిన పవిత్ర వ్యాసంగం మనిషి జీవితంలో లేదు, నాణ్యమైన విద్యను రాజకీయానికి కేంద్రబిందువు చేయాలి వంటి లోక్‌సత్తా భావాల్ని ఇప్పుడిప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నుంచి పలువురు రాజకీయ నేతలు, పౌరసమాజ సంస్థలు, ఆలోచనాపరులు మాట్లాడుతున్నారు. సినిమాలలో కూడా వల్లిస్తున్నారు. లోక్‌సత్తా స్ఫూర్తితో కొత్త రాజకీయం పార్టీలు కూడా వస్తున్నాయి. ఇది దేశ భవిష్యత్తుకి అవసరమైన చాలా కీలక పరిణామం.

వెల కట్టలేని లోక్‌సత్తా కృషి వల్ల  ఇప్పటికే కొన్ని పదుల వేల కోట్లు ప్రత్యక్షంగా, లక్షల కోట్లు పరోక్షంగా ఈ దేశానికి ఆర్థిక లబ్ధి చేకూరినా, లక్షలమంది యువత థాట్‌లీడర్స్‌గా రూపుదిద్దుకున్నా తెలుగు రాష్ట్రాల్లో తెలిసినట్టుగా జేపీ ఉత్తరాదిన తెలియకపోవచ్చు. ప్రచారం పట్ల ఆసక్తి చూపకపోవడం, ఢిల్లీని కాకుండా, హైదరాబాద్‌ని ఆయన తన కార్యక్షేత్రంగా ఎంచుకోవటం కూడా ఇందుకు కారణాలు. కానీ కాస్త చదువుకుని ఈ దేశం గురించి ఏ కాస్త ఆలోచన ఉన్నవారికైనా ఈ సోషల్ మీడియా సాంకేతికయుగంలో జేపీ పరిచితులే. దేశ, విదేశాల్లో ప్రతి సమావేశాన్నీ,

ప్రతి పరిచయాన్నీ, వారిచ్చే ప్రతి వనరునూ భారతదేశంలో "నివారించదగ్గ బాధలను తొలగించే, శక్తిసామర్థ్యాలను వికసింపచేసుకుని వివక్ష లేకుండా ఎదిగే అవకాశం ప్రతి బిడ్డకూ అందించే" నూతన రాజకీయ వ్యవస్థ నిర్మాణం కోసమే జేపీ వినియోగిస్తున్నారు.

## త్యాగాలు అక్కర్లేదు... సమాజం కోసం

## కాసేపు సమయం ఇవ్వండి

## లేవండి... పాల్గొనండి... మార్చండి

జోతిబాపూలే, నారాయణ గురు, బాబాసాహెబ్ అంబేద్కర్, రామస్వామి నాయకర్ చేపట్టిన సామాజిక ఉద్యమాన్ని కొనసాగించటం, పుట్టుకతో వివక్షలేని సమాజాన్ని సృష్టించటం లోక్‌సత్తా మౌలికలక్ష్యం.

కులంతో, వృత్తితో, సంపదతో, హోదాతో, అధికారంతో మనిషికి ప్రత్యేక గౌరవాన్ని ఆపాదించటం సమాజానికి హానికర మని జేపీ బలంగా వాదిస్తారు. ఈ సంపూర్ణ ప్రజాస్వామిక విప్లవంలో తమ వంతు పాత్ర కోసం ప్రతి ఒక్కరూ లోక్‌సత్తాని ఒక వేదికగా ఉపయోగించుకోవాలని ఆయన కోరుతున్నారు.

"లోక్‌సత్తా భారతదేశంలో మౌలిక మార్పుకి నాంది పలికి అధికారంలో ఉన్నవారు కూడా సాధించలేని ఎన్నో విజయాల్ని సాధించినా అవి చాలవు. లోక్‌సత్తా సాధించిన చట్టాల్ని సక్రమంగా అమలుచేయించటంతోపాటు ఇంకా సాధించాల్సినవి ఉన్నాయి. ఆర్థికాభివృద్ధి, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, కోట్లాది యువతకు ఉద్యోగాలు ఇప్పుడు భారత్ ముందున్న పెనుసవాళ్లు. మరోపక్క మనదేశం ముందున్న అవకాశాలు క్రమంగా పరిమితమైపోతున్నాయి. కాబట్టి చైతన్యవంతులైన ప్రజల భాగస్వామ్యంతో లోక్‌సత్తా సంస్కరణల ఉద్యమాన్ని మరో దశకు వేగంగా తీసుకెళ్లటం అవసరం."

"మంచి రాజకీయంలో భాగస్వాములు కావటం అంటే, ప్రతి ఒక్కరూ ఎన్నికలలో పోటీ చేయాలనో, పార్టీ కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా పాల్గనాలనో కాదు. మనకున్న ఓటు హక్కు, భావప్రకటనా స్వేచ్ఛను ఉపయోగిస్తూ సభ్యులుగా, వలంటీర్లుగా కొంత సమయం పనిచేస్తూ, మన పరిధిలో మంచి రాజకీయం, పాలన కొనసాగేలా బాధ్యత తీసుకోవటం. అలా మన పరిధిలో మనం, ముఖ్యంగా యువత 'థాట్ లీడర్స్'గా

వ్యవహరిస్తే సత్తా గల పౌరులుగా మనం మంచి రాజకీయంలో భాగమైనట్టే.”


“ఇలా ప్రకృతి సూత్రాల ప్రాతిపదికన అన్ని వ్యవస్థలనూ సమన్వయం చేస్తూ ఏ తరంలోని సమస్యల్ని ఆ తరంలోనే పరిష్కరిస్తూ, మనం సుఖసంతోషాలతో సంతృప్తిగా బతికే సమగ్ర భావజాలాన్ని లోక్‌సత్తా అందించబట్టే.. లెఫ్ట్, రైట్, ఆస్తిక, నాస్తిక, హిందూ, ముస్లిం, క్రైస్తవ, ఈ కులం, ఆకకులం,  ఈ ప్రాంతం, ఆ ప్రాంతం, ఈ భాష, ఆ భాష అని తేడా లేకుండా అందరికీ తాము కలలుగంటున్న లక్ష్యాలు హేతుబద్ధంగా, ఆచరణాత్మకంగా సాధించే విధానాలు, కొత్త రాజకీయ సంస్కృతి ప్రతి అంశంలోనూ లోక్‌సత్తాలో కనిపిస్తుంటాయి.”

“ఒకరకంగా చెప్పాలంటే, కాలానుగుణంగా మార్చుకునే వీలున్న కాలాతీత భావజాలం లోక్‌సత్తా. అజరామరమైన లోక్‌సత్తా భావజాలం, విధానాలు, సంస్కృతి మనల్ని నిస్సందేహంగా చరిత్రకు సరైన వైపున నిలుపుతాయి. మీరు దేవుడ్ని నమ్మే వారైతే మీ ఇష్టదైవం ఉండే ఆలయాన్ని వందలమార్లు సందర్శించినదానికంటే కూడా లోక్‌సత్తా భావజాలాన్ని ఆచరణలో పెట్టేందుకు ఒక్కరోజు కృషి చేస్తే ఎంతో పుణ్యఫలాన్ని సాధించుకోగలుగుతారు.”

“మీరేమీ త్యాగాలు చేయనవసరం లేదు. స్వార్థాన్ని విడిచి పెట్టనక్కర్లేదు. కానీ మీ స్వార్థమేంటో స్పష్టంగా తెలుసుకోండి. మీ సంతోషమయ జీవితానికి, మీ బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు ఎలాంటి వ్యవస్థ కావాలో ఖచ్చితంగా నిర్ధారించుకోండి. అలాంటి మార్పుల కోసం మీ వంతు పాత్ర పోషించండి. లేవండి...పాల్గనండి... ఈ అవినీతి రాజకీయ, పాలనా వ్యవస్థల్ని శాశ్వతంగా మార్చేందుకు మీ వంతు కృషితో కలసిరండి” అని జేపీ ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా యువతకి పిలుపునిస్తున్నారు.

www.twitter.com/jp_loksatta, www.facebook.com/jploksatta సోషల్ మీడియా అకౌంట్లలో జయప్రకాష్ నారాయణ్‌ని అనుసరించవచ్చు, అభిప్రాయాలను పంచుకోవచ్చు, కార్యక్రమాలలో భాగస్వాములు కావొచ్చు. ★

# లోక్‌సత్తా 20+:
# 100 నిజాలు (విజయాలు) మాట్లాడుకుందాం




ఇరవయ్యేళ్ల లోక్‌సత్తా సాధించిన విజయాల గురించి రేఖామాత్రంగా చెప్పిన 100 నిజాలివి.

ఈ వంద నిజాల (విజయాల)కు నేపథ్యంగా ఉన్న అంశాల ద్వారా కాకుండా ఈ దేశాన్ని మార్చటానికి, అందరికీ ఎదిగే అవకాశాలు ఇవ్వటానికి మార్గాలున్న దాఖలాలు లేవు.

ఇజాల లక్ష్యమైన నిజాల చుట్టూ హేతుబద్ధ భావజాలం, విధానాలు, చట్టాలు, రాజ్యాంగ సవరణలు, రాజకీయ సంస్కృతి ద్వారా.. ఆర్థిక ప్రయోజనాలు, ఇతరత్రా రూపాల్లో వివిధ రంగాల్లో లోక్‌సత్తా సాధించిన సంస్కరణల విజయాలు ఇందులో ఉన్నాయి.

నివారించదగ్గ బాధలను తొలగించి, వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలను కల్పించి ఎవరి జీవితంలో వారిని హీరోలుగా నిలిపేందుకు, ఎవరికివారు తమ ప్రాంతాన్ని లిటిల్ రిపబ్లిక్కుగా మార్చుకునేలా చేసేందుకు లోక్‌సత్తా చేస్తున్న విశ్వప్రయత్నంలో ఇవి కొన్ని మైలురాళ్లు మాత్రమే. ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సుంది.

ఇందులో కొన్నిచోట్ల ఇతర రాజకీయ శక్తులపై విమర్శనాత్మకంగా ప్రశ్నలూ ఉన్నాయి. ఇవి కేవలం ఆత్మపరిశీలన దిశగా చర్చనీయాంశం చేయటం కోసమే తప్ప లోక్‌సత్తా ఆధిపత్యాన్నో, ప్రత్యేకతనో చాటుకోవటం కోసం కాదు. లోక్‌సత్తా మాత్రమే ఈ దేశంలో మార్పు తేగలదన్న భ్రమ ఏనాడూ లేదు. ఇది సమష్టి కృషి.

దేశ విదేశాల్లోని ఎన్నోతరాలు అందించిన ఆలోచనల్ని, విలువల్ని భారతదేశ పరిస్థితులకనుగుణంగా అన్వయించటమే లోక్‌సత్తా చారిత్రక కృషికి బీజం వేసింది. ఎవరినీ ఓడించాల్సిన అవసరం లేకుండా తాను గెలవగలిగే, ప్రజలను గెలిపించగలిగే సానుకూల భావజాలాన్ని, ఎజెండాను తయారుచేయటంలో లోక్‌సత్తాకు స్ఫూర్తినిచ్చిన మహనీయులందరికీ మనసారా నమస్కారాలు.

**తెలిగ్గా అర్థమయ్యేలా, తన వంతు బాధ్యతగా లోక్‌సత్తా సమాజం ముందుంచుతున్న ఈ నిజాల్ని విస్తృత ప్రజాప్రయోజనాల రీత్యా పెద్దఎత్తున షేర్ చేస్తూ ప్రజల్లో ఆలోచనను పెంచాలని అందరికీ విజ్ఞప్తి..**

**1) 'వ్యవస్థీకృత మార్పు' కృషిలో దేశంలోనే అతిపెద్ద సంస్థ, పార్టీ లోక్‌సత్తా**

వ్యక్తిగత నిజాయతీగల నేతలు మనదేశంలో అన్ని పార్టీల్లో, సంఘాల్లో ఉన్నారు. అనేకమంది నిజాయతీ కమ్యూనిస్టు నేతలు, ప్రజాసంఘాలు, ఆర్ఎస్ఎస్ వంటి దేశభక్తి సంస్థల నాయకుల గురించి మనకు బాగా తెలుసు. నమ్మిన విలువల కోసం వాళ్లు చేసిన త్యాగాలు అపారం. కానీ మంచి రాజకీయాల్లో వ్యక్తిగత నిజాయతీ కనీస లక్షణం మాత్రమే. అసలు కావలసింది వ్యవస్థీకృత నిజాయతీ! వ్యక్తిగత నిజాయతీతో పరిమితంగా కొంతకాలం మేలుచేయగలిగితే, వ్యవస్థీకృత నిజాయతీ వల్ల కోట్లాదిమందికి శాశ్వతంగా మేలుచేయగలం. వ్యవస్థగా మంచిని ప్రోత్సహించటం, చెడును నిరుత్సాహపరచటం చేసే రాజకీయం వల్లే ఈదేశానికి సుస్థిరాభివృద్ధి, ప్రజలకు సుఖసంతోషకర జీవితం సాధ్యమవుతాయి. వ్యవస్థల నిర్మాణంతో ఇలాంటి పరివర్తన రాజకీయాన్ని సాధించటానికి మనదేశంలో సమగ్ర విధానాలతో సంస్కరణల ప్రయత్నం లోక్‌సత్తాతోనే ప్రారంభమైంది. వ్యవస్థీకృత మార్పు కృషిలో లోక్‌సత్తాయే దేశంలో అతిపెద్ద సంస్థ, పార్టీ.

**2) అవకాశవాదానికి లొంగని సంస్కర్త**

'సార్, మీరు డబ్బు, మద్యం వంటి విషయాలలో నా నియోజకవర్గంవైపు చూడబాకండి. నాకు పూర్తి స్వేచ్ఛ ఇస్తే సీటు తీసుకొచ్చి మీ కాళ్ల దగ్గర పడేస్తా. లోక్‌సత్తా పార్టీకి ఎంత కావాలో అంత ఫండ్ ఇస్తా' అంటూ సూట్‌కేసులతో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ వద్దకు వచ్చిన నేతలున్నారు. 'మా వంశపారంపర్య రాజకీయ వారసుడికి జై అనండి, మీ సీటు గెలిపించే బాధ్యత మా భుజాల మీద వేసుకుంటాం' అని ఆ తర్వాత మరో ఎన్నికల్లో జేపీ దగ్గరకు కొందరొచ్చారు. 'మీరు ఎన్నికల్లో ఓడినా పర్లేదు, మీ పార్టీని మా పార్టీలో విలీనం చేసి మా నాయకుడి విధానాలనే అమలుచేస్తే కేంద్రమంత్రివర్గంలో రెండోస్థానమో, మూడోస్థానమో ఇస్తాం' అని ఆ తర్వాత ఇంకొందరు జేపీకి ప్రతిపాదించారు. 'ఇలా చేస్తే మీరు, నేను గెలిచి చేసేదేముంది? లోక్‌సత్తా ఎందుకింక? ఈ దేశాన్ని మార్చాలనే లక్ష్యంలో భాగంగా రాజీపడగలనుగానీ, ఆ లక్ష్యానికి సంబంధంలేకుండా రాజీపడటం నా వల్ల కాదు. నేను చేయాల్సింది పరివర్తన సాధించటం తప్ప మేనేజ్‌మెంట్ కాదు' అని జేపీ తోసిపుచ్చారు.. ఎవరు నిజమైన నాయకుడో, ఎలాంటి రాజకీయం మనకు కావాలో ఎప్పటికైనా తేల్చుకోవలసింది మనమే!

**3) పెట్రోలు బంకుల్లో ప్రజలకు రూ.2లక్షల కోట్లు ఆదా చేసిన లోక్‌సత్తా**

పెట్రోలు బంకుల్లో తూనికల మోసాల్ని అరికట్టేందుకు 1998లో లోక్‌సత్తా చేసిన

చిన్న, వినూత్న కార్యక్రమం వల్ల 10శాతం నష్టం తగ్గి ఇన్నేళ్లలో ప్రజలకు లక్షల కోట్లు ఆదా అయ్యాయి. ప్రజాచైతన్యం మందగించటంతో ఇటీవల మళ్లీ పెట్రోల్ బంకుల్లో దోపిడీపై వార్తలస్తుండటంతో మరో దశ కార్యక్రమానికి లోక్‌సత్తా చర్యలు చేపట్టింది.

**4) క్రిమినల్ అభ్యర్థుల జాతకాలను దేశంలోనే మొట్టమొదట బైటపెట్టింది లోక్‌సత్తాయే**

ఎన్నికల్లో నేరసంస్కృతిని నిర్మూలించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా దేశంలోనే మొట్టమొదటిసారిగా అభ్యర్థుల నేరచరిత్రలను 1999లో లోక్‌సత్తా బైటపెట్టింది. పొద్దున లేచిన దగ్గర్నుంచి ఒకరినొకరు దుమ్మెత్తిపోసుకుంటూ చాటుగా కలిసి అక్రమ వ్యాపారాలు చేసుకునే సాంప్రదాయ పార్టీల నేతలు పోలీసు వ్యవస్థను గుప్పెట్లో పెట్టుకోబట్టే నేరనేతలు పుట్టగొడుగుల్లా పెరిగారు. ఇది అబద్ధం అనే దమ్ము, ధైర్యం ఏ అధికార, ప్రతిపక్ష పార్టీకి, నాయకుడికి ఉన్నాయి?

**5) మంద ప్రచారాన్ని జన ప్రచారంగా మార్చే ప్రయత్నం**

ఎన్నికలలో డబ్బు, మద్యం వెదజల్లి ప్రజలను మందల్లా తరలించే సంస్కృతికి తెరదించి నాగరిక ప్రజాస్వామ్యాన్ని పెంచేందుకు టీవీల్లో ఎన్నికల చర్చా కార్యక్రమానికి లోక్‌సత్తాయే శ్రీకారం చుట్టింది. ఎన్నికల్లో హుందాగా, ప్రజల్లో ఆలోచన పెంచేలా ప్రచారం చేయటానికి వీలుగా ప్రతి పార్టీకీ ప్రభుత్వమే టీవీల్లో సమయం కేటాయించాలన్న నిబంధనను చట్టంలో చేర్పించగలిగాం. అమెరికాలో మహిళాసంఘాలు 1950లలో మొదలు పెట్టిన అధ్యక్ష అభ్యర్థుల టెలివిజన్ డిబేట్‌లు 1976 నాటికిగానీ సరిగ్గా మొదలవలేదు. సాంప్రదాయ పార్టీలు ఎన్ని అవరోధాలు సృష్టించినా లోక్‌సత్తా 1999లో మొదలు పెట్టిన టీవీ డిబేట్‌లు త్వరలోనే రాజకీయ సంస్కృతిలో భాగమవుతాయని ధీమాగా అనుకోవచ్చు.

**6) పేద, మధ్యతరగతి ఇళ్లు, స్థలాల రెగ్యులరైజేషన్**

స్వతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా సామాన్య ప్రజలకు ఇళ్లు కట్టించటం చేతగాని ప్రభుత్వాలు 2001లో హైదరాబాద్ కూకట్‌పల్లిలో పేద, మధ్యతరగతి నుంచి బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్‌ల పేరుతో డబ్బు వసూలు చేసి ఆ తర్వాత మాట మారిస్తే లోక్‌సత్తా వారి తరపున ప్రభుత్వంపై పోరాడి క్రమబద్ధీకరణను సాధించింది. పాలకులు, ప్రభుత్వోద్యోగుల అవినీతికి ప్రజలు బలిపశువులా అని 2008లో కూడా ఇళ్లు, స్థలాల క్రమబద్ధీకరణ స్కీముల సమయంలో పోరాటం చేసి ప్రజలకు న్యాయం జరిగేలా చేసింది.

**7) సిటిజన్ ఛార్టర్స్‌తో స్వరాజ్యం**

ప్రజాస్వామ్యంలో ప్రజలే హీరోలు అని మాటల్లో కాకుండా ఆచరణలో సాధించేందుకు 1998లో దేశంలోనే తొలిసారిగా స్వరాజ్యం పేరుతో పౌరహక్కులన్నిటినీ కలిపి పుస్తకంగా

లోక్‌సత్తా ఆవిష్కరించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు ఏ రకమైన సేవలున్నాయి, వాటిని ఎలా పొందాలి తదితర అంశాలున్న ఈ పుస్తకం మనదేశంలో సిటిజన్ ఛార్టర్స్ అమలు దిశగా ఒక సమగ్ర ప్రయత్నం. లక్షలాది కాపీల్ని నామమాత్రపు ధరకు ఇచ్చి అవినీతి సేవల వ్యవస్థపై సామాన్యులకు ఓ అస్త్రాన్ని అందించాం.

### 8) ప్రభుత్వ కార్యాలయాల్లో పరిహారం పొందినవారికి లోక్‌సత్తా నజరానా

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికీ ఒక టైం పెట్టి, ఆ గడువులోగా పూర్తికాకపోతే దరఖాస్తు చేసిన ప్రజలకు రోజూ పరిహారం చెల్లించేలా లోక్‌సత్తా రూపొందించిన స్వరాజ్యం సిటిజన్ ఛార్టర్స్‌ని తొలిసారిగా 2001లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, తణుకు, కుత్బుల్లాపూర్ మునిసిపాలిటీల్లో అమలుచేశారు. ఈ సిటిజన్ ఛార్టర్స్‌తో సకాలంలో సేవలందించని ప్రభుత్వాధికారుల నుంచి పరిహారం పొందిన పౌరులకు లోక్‌సత్తా స్వయంగా ప్రోత్సాహక నజరానాలు అందించింది. ఓట్లు, సీట్లను అడ్డంపెట్టుకుని ఈ అవినీతి నిర్మూలనకు, ప్రజాచైతన్యానికి అడ్డుకొట్టిన సాంప్రదాయ పార్టీలు తమ ప్రజాద్రోహానికి ఏం సమాధానం చెబుతాయి?

### 9) సర్కారీ కార్యాలయాల్లో హక్కులాగా సేవలందించేందుకు 'సర్వీస్ గ్యారంటీ' చట్టం

ఓట్ల కోసం ప్రభుత్వాధికారులు చేయాల్సిన పనుల్ని తామే చేస్తున్నట్టు నటిస్తున్న రాజకీయ పార్టీలు, అవినీతి ప్రభుత్వోద్యోగులు సిటిజన్ ఛార్టర్స్‌ని అడ్డుకునేందుకు ఎంత ప్రయత్నిస్తున్నా లోక్‌సత్తా తన కృషిని కొనసాగిస్తూనే ఉంది. నిర్ణీత గడువులోగా గవర్నమెంట్ ఆఫీసులో ప్రజలకు సేవలను అందించకపోతే రోజుకు కనీసం రూ. 250 జరిమానా చెల్లించేలా 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని రూపొందించి పార్లమెంటు దాకా తీసుకెళ్లింది. దీన్ని దేశవ్యాప్తంగా, ఈలోగా ఏ రాష్ట్రంలో వీలుంటే అక్కడ అమలయ్యేలా చేసేందుకు లోక్‌సత్తా పోరాడుతోంది.

### 10) తక్కువ ప్రభుత్వం-ఎక్కువ పాలన

ఈ నినాదాన్ని చాలామంది రాజకీయ నాయకులు, పాలకులు చెబుతూన్నా ఆచరణలోకి తెచ్చేందుకు గట్టిగా ప్రయత్నించింది మాత్రం లోక్‌సత్తా. ప్రలోభాలకు మార్గంగా మారిన జంబో మంత్రివర్గం స్థానంలో 2003లో మంత్రివర్గ నియంత్రణ చట్టాన్ని లోక్‌సత్తా సాధించింది. తొలుత అడ్డుకున్న పార్టీలు కూడా సహకరించటం వల్ల చట్టసభ సభ్యుల్లో ఆరోవంతు మాత్రమే కేబినెట్ ఉండేలా రాజ్యాంగ సవరణ వచ్చింది.

### 11) ఎన్నికల్లో వివరాలు చెప్పించాం

ఎన్నికల్లో మా ఇష్టమొచ్చినట్టు పోటీ చేయటం మా జన్మహక్కు, మా వివరాలు

చెప్పాల్సిన అవసరం లేదు అని కాలర్లు ఎగరేస్తున్న పెత్తందారీ నేతల మెడలు వంచి ప్రతి అభ్యర్థి తన వ్యక్తిగత, కేసుల, ఆస్తుల వివరాలను ఎన్నికల ప్రమాణపత్రంతో చెప్పే చట్టాన్ని 2001లో లోక్‌సత్తాయే సాధించింది. 1999లో నేరచరిత్రుల వివరాలను వెల్లడించటానికి కొనసాగింపుగా లోక్‌సత్తా ఈ చట్టాన్ని సాధించటానికి కేంద్ర కేబినెట్ బిల్లును కూడా తిప్పిపంపి అప్పటి రాష్ట్రపతి డా॥ ఏపీజే అబ్దుల్ కలాం సహకరించారు. అయినా మొండికేసిన పాలకుల్ని చివరకు న్యాయపోరాటంలో ఓడించి ఈ ఎన్నికల సంస్కరణని లోక్‌సత్తా సాధించింది.

## 12) నల్లడబ్బు లేకుండా పార్టీలకు విరాళాలు

2003లో తెహల్కా కుంభకోణాన్ని అవకాశంగా మలచుకుని అన్ని పార్టీలనూ ఒప్పించి నిజాయతీ రాజకీయానికి నిజాయతీ డబ్బు అందేలా చేయటానికి పార్టీల విరాళాల చట్టాన్ని లోక్‌సత్తా సాధించింది. రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఈ చట్టం వల్లే లోక్‌సత్తా పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ రాగలిగాయి. కానీ అరుణ్ జైట్లీ సహా అనేకమంది స్వయంగా ఒప్పుకున్నట్టు ఇప్పటికీ లోక్‌సత్తా, ఆప్ తప్ప ఏ పార్టీ ఈ చట్టాన్ని పూర్తిగా అమలు చేయకుండా, నల్లడబ్బు మీదే ఆధారపడుతున్నాయి.

## 13) ఫిరాయింపులను కట్టడి చేసేందుకు 91వ రాజ్యాంగ సవరణ

ఫిరాయింపులకు అంతకుముందున్న చట్టాన్ని బలోపేతం చేసి కనీసం మూడింట రెండొంతుల మంది ఉంటేనే చట్టసభలో చీలిక వర్గంగా గుర్తించాలనే నిబంధనతో 91వ రాజ్యాంగ సవరణను తీసుకురావటంలో లోక్‌సత్తా కీలక పాత్ర పోషించింది. అయితే, మనదేశ పరిస్థితుల్లో అనర్హత వేటు వేసే అధికారం స్పీకర్ చేతుల్లో కాకుండా ఎన్నికల సంఘం చేతుల్లో ఉంచాలన్న లోక్‌సత్తా ప్రతిపాదనను మాత్రం ఈ సవరణలో చేర్చలేదు. చివరకు అదే 91వ రాజ్యాంగ సవరణను నీరుగారుస్తోంది. ఈ సవరణను మార్చేందుకు లోక్‌సత్తా ప్రయత్నిస్తున్నా, నిస్సిగ్గుగా ఫిరాయింపుల్ని ప్రోత్సహిస్తున్న అధికార పార్టీలను ఎదుర్కోవటానికి ప్రజాబలం సరిపోవటం లేదు.

## 14) పరోక్ష పన్నులు తేలిక చేశాం

సబ్బు బిళ్ల దగ్గర్నుంచి ప్రజలకు భారంగా, అవినీతిమయంగా మారిన సెంట్రల్ ఎక్సయిజ్, కస్టమ్స్ తదితర పరోక్ష పన్నుల విధానాన్ని సరళతరం చేసేందుకు పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వాధికారులు, పౌరసమాజ ప్రముఖులతో లోక్‌సత్తా హైదరాబాద్, ముంబయిలో విస్తృత సదస్సులు నిర్వహించి విలువైన సూచనల్ని రూపొందించింది. దీనివల్ల పన్నుల సేకరణలో కీలక సవరణలు వచ్చి ఆర్థిక వ్యవస్థ

ప్రజానుకూలంగా బలపడింది. అధికారంలో లేకపోతే దేశానికి మేలు చేసే జీఎస్‌టీ వంటి బిల్లుల్ని కూడా దుర్మార్గంగా అడ్డుకునే ఈదేశంలో ఏ అధికారం లేకుండా లోక్‌సత్తా హేతుబద్ధ విధానాలతో, దేశభక్తితో సాధించిన విజయమిది.

### 15) స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం కోటి సంతకాల సేకరణ

వేల ఏళ్ల భారతీయ సంస్కృతిలో, ఆధునిక ప్రజాస్వామ్యంలో అడుగడుగునా కనిపించే స్థానిక స్వయంపాలన హక్కును ప్రజలకు అందించేందుకు లోక్‌సత్తా 2003లో తెలుగునాట 1 కోటీ 8లక్షల సంతకాలను సేకరించి దేశంలోనే రికార్డు సృష్టించింది. సంతకాల సేకరణ అనంతరం లోక్‌సత్తా నిర్వహించిన మహాసభ చేసిన తీర్మానాలపై దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసిన అప్పటి చంద్రబాబు ప్రభుత్వం, ఆనాటి ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఇద్దరూ మాట తప్పి చివరకు స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, నిధులను ఎగ్గొట్టారు. అయినా లోక్‌సత్తా స్థానిక ప్రభుత్వాల సాధికారత సంఘాన్ని కూడా ఏర్పాటు చేసి లక్ష్యం కోసం దేశవ్యాప్త ఉ ద్యమాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా కొనసాగిస్తోంది.

### 16) లోక్‌సత్తా వల్లే స్థానిక నిధులు రూ.2,87,000 కోట్లకు పెరిగాయ్

మాటలెక్కువ విషయం తక్కువతో 73, 74వ రాజ్యాంగ సవరణలు విఫలమైనందున స్థానిక ప్రభుత్వాలకు కేంద్రం నుంచి నేరుగా నిధులిచ్చేలా చేసేందుకు లోక్‌సత్తా చేసిన అలుపెరగని పోరాటం వల్ల 14వ ఆర్థిక సంఘం ఆ నిధుల్ని ఐదంకెల నుంచి ఆరంకెలకు పెంచింది. ఇప్పుడు స్థానిక ప్రభుత్వాలకు రూ.2,87,000కోట్లు విడుదలవుతున్నాయి. కేంద్రం నుంచి రాష్ట్రాలకు పెరిగిన నిధుల్లో కనీసం 33శాతం స్థానిక ప్రభుత్వాలకే కేటాయించాలని, అందుకోసం ఇప్పుడిస్తున్న నిధుల్ని కనీసం మూడు రెట్లు పెంచాలని, రాష్ట్రాల విచక్షణ ద్వారా కాకుండా నేరుగా, విధిగా నిధుల్ని మూడో అంచె ప్రభుత్వాలకు ఇవ్వాలనే డిమాండ్లతో లోక్‌సత్తా 2.0 మలిదశ ఉద్యమంలో పోరాడుతున్నాం.

### 17) సమాచార హక్కు చట్టం

యజమానులైన ప్రజలముందు సేవకులైన పాలకులకు ఎటువంటి రహస్యాలూ ఉండకూడదని అరుణారాయ్ వంటి వారితో కలిసి లోక్‌సత్తా 2005లో పాలనా సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టాన్ని సాధించింది. ఈ చట్టంలోని ప్రతి అక్షరాన్నీ, ఫుల్‌స్టాప్, కామా సహా హైదరాబాద్ లోక్‌సత్తా కార్యాలయంలో వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ రాశారు. 2 జీ స్పెక్ట్రం వంటి అనేక కుంభకోణాలు ఈ చట్టం వల్ల వెలికిచూశాయి. అవినీతి వ్యతిరేక ఉద్యమాలను బలోపేతం చేసిన యువ యోధులు ఈ ఆర్‌టీఐ తరం వారే. అభివృద్ధి చెందిన చాలా దేశాల్లో శతాబ్దాల క్రితమే ఈ చట్టం ఉందని బాధపడాలో, ఇప్పటికైనా భారత్ సాధించిందని గర్వపడాలో తెలీని పరిస్థితి.

## 18) లోక్‌పాల్ రథయాత్ర

అవినీతి అంతానికి నినాదాలతోనే కాదు, విధానాలతో 1997 నుంచీ పోరాడుతున్న రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా. అందులో భాగంగా కేంద్రంలో అవినీతి నిరోధక కమిషన్, రాష్ట్రాల్లో బలమైన లోకాయుక్త, జిల్లాల్లో అంబుడ్స్‌మన్‌లను ప్రతిపాదించింది. నేర దర్యాప్తు సంస్థలైన ఏసీబీలు, సీబీఐకి జవాబుదారీతనమున్న స్వతంత్ర ప్రతిపత్తిని డిమాండ్ చేసింది. ఇవేవీ లేకుండా సర్వరోగ నివారిణి అంటూ లోక్‌పాల్ ఉద్యమాన్ని ప్రారంభించినా ఆ ఉద్యమానికి లోక్‌సత్తా మద్దతు తెలిపింది. అయితే గుడ్డిగా ప్రజలు ఆ చట్టానికి మద్దతివ్వటం ముమ్ముందు ప్రమాదం కాబట్టి అవగాహన పెంచేందుకు లోక్‌పాల్ రథయాత్ర పేరుతో తెలుగు నాట, దేశంలోని పలుప్రాంతాల్లోనూ జయప్రకాష్ నారాయణ్ విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

## 19) సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి 97వ రాజ్యాంగ సవరణ

స్వతంత్ర భారత్‌లో గొప్ప రాజ్యాంగ సవరణల్లో ఒకటిగా పరిగణించదగ్గ 97వ సవరణను లోక్‌సత్తా 2012లో సాధించింది. దీనివల్ల ప్రజలు ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాజ్యాంగం ఇచ్చిన హక్కులతో సొంతంగా సంఘాలుగా ఏర్పడి తమ ఆర్థిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహించుకోగలిగే అవకాశం ఏర్పడింది. 1995లో డా॥ వర్గీస్ కురియన్ స్ఫూర్తితో, డా॥ జేపీ చొరవతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘాల) చట్టం ఈ సవరణకు మూలం. 97వ రాజ్యాంగ సవరణలో కేంద్రప్రభుత్వం అనవసరంగా జప్పించిన కొన్ని పదాలను లసుగులుగా ఉపయోగించుకుని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంఘాల హక్కులకు తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్నా సహకార సంఘాల స్వతంత్ర ప్రతిపత్తికైతే గ్యారంటీని లోక్‌సత్తా సాధించింది. ప్రజల్లో కాస్త చైతన్యం పెరిగితే చాలు, సహకార వ్యవస్థను పాలకులు తాకనైనా లేరు.

## 20) పాడిరంగంలో మ్యాక్స్ చట్టం రద్దును తిప్పికొట్టాం

పాలఉత్పత్తి రంగంలో సహకార సంస్థలు, రైతులు లాభపడటానికి కారణమైన మ్యాక్స్ చట్టాన్ని రద్దు చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం, వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం చేసిన ప్రయత్నాల్ని న్యాయపోరాటంతో లోక్‌సత్తా అడ్డుకుంది. చిత్తూరు, కడప డెయిరీలను నాశనం చేసి సొంత డెయిరీలను ఏర్పాటు చేసుకున్న, ప్రోత్సహించిన ఆ నాయకుల బాటలోనే తెలంగాణ ప్రభుత్వం 2016లో జీవో 28ని జారీ చేసినా లోక్‌సత్తా ప్రయత్నంతో పక్కనపెట్టింది. ఈ జీవోను అమలుచేస్తామని తెలంగాణ ప్రభుత్వం బరితెగిస్తే, దీనిపై కూడా న్యాయపోరాటం చేసి సహకార సంఘాల స్వతంత్రప్రతిపత్తిని పరిరక్షిస్తామని లోక్‌సత్తా తేల్చిచెబుతోంది.

**21) 2జీ లైసెన్సుల రద్దు- సహజ వనరుల కేటాయింపు వల్ల రూ.3లక్షల కోట్ల ఆదాయం**

స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద కుంభకోణంగా 2010లో బైటపడ్డ 2జీ స్పెక్ట్రం లైసెన్సుల కేటాయింపుపై క్షేత్రస్థాయిలో పోస్టుకార్డులు, రూ.1 మనియార్డర్ల ఉద్యమం చేయటంతోపాటు దేశంలోని సుప్రసిద్ధులను ఒకచోట చేర్చి లోక్‌సత్తా చేసిన న్యాయపోరాటం వల్ల ఆ లైసెన్సుల్ని 2012లో సుప్రీంకోర్టు రద్దు చేసింది. దాంతోపాటు లోక్‌సత్తా కోరినట్టు సహజ వనరుల కేటాయింపును విధిగా వేలం పాటల ద్వారా పారదర్శకంగా చేయాలని ఆదేశించటం, నరేంద్ర మోదీ ప్రభుత్వం వేగంగా స్పందించటం వల్ల స్పెక్ట్రం, బొగ్గు వంటి వనరుల వేలం ద్వారా ఈదేశానికి ఇప్పటివరకూ రూ.3లక్షల కోట్ల అంచనా ఆదాయం (స్పెక్ట్రం వేలం కొనసాగుతూనే ఉంది) సమకూరింది. ఒక్క పార్లమెంటు సభ్యుడు కూడా లేకుండానే లోక్‌సత్తా ఇవన్నీ సాధించింది. పేరు ఎవరికొస్తుంది అని పట్టించుకోకపోతే మన ద్వారా ప్రకృతి/దైవం అద్భుతాలను చేయిస్తుందనటానికి ఇదో ఉదాహరణ. బంద్‌లు, రాస్తారోకోలు, రైల్‌రోకోలతో ఉద్యమాలంటూ మీడియాలో పతాకశీర్షికల్లో ఉండే పార్టీలు, నేతలు, సంస్థల వల్ల ఈ దేశానికి మేలు జరిగిందా? లోక్‌సత్తా ఆధునిక ప్రజాస్వామ్య రాజకీయ సంస్కృతి వల్ల మేలు జరిగిందా?.. ఛాలెంజ్ చేసే ఉదాహరణ ఇది. ఇంకోపక్క, ఇలా వెంటనే ఫలితాలు కనిపించని లోక్‌సత్తా తెచ్చిన సంస్కరణల ద్వారా దేశ ప్రజలకు సమకూరే ఆదాయాన్ని కూడా లెక్కేస్తే వెలకట్టలేం.

**22) ఓబుళాపురం గనుల నుంచే మార్పు మొదలయ్యేది**

గాలి జనార్ధనరెడ్డికి కేటాయించిన ఓబుళాపురం ఇనప గనుల్లో దోపిడీ ఏమీ లేదని 2008లో అక్కడికెళ్లి వచ్చిన అఖిలపక్ష నేతలు బ్రేవ్‌మని తేల్చారు. 2009లో జేపీ శాసనసభ్యుడయ్యాక ఇదే చర్చ వచ్చినప్పుడు బహిరంగ వేలం ద్వారా గనుల కేటాయింపు చేయాలని చెప్పినా నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వినలేదు. ఆరోజు వారు నిజాయతీగా, ప్రజల పట్ల ఏమాత్రం ప్రేమతో వ్యవహరించి ఉన్నా 2జీ తీర్పు కంటే ముందే తెలుగు ప్రజలకు సహజ వనరుల ద్వారా బోలెడు ఆదాయం సమకూరి ఉండేది, కోర్టులకెళ్లాల్సిన పనిలేకుండానే దేశానికి తెలుగు ప్రాంతం మార్గం చూపిఉండేది.

**23) 'లీడర్' సినిమాకు స్ఫూర్తినిచ్చిన అవినీతి నిరోధక చట్ట సవరణకూ అడ్డంకొట్టిన వైఎస్, చంద్రబాబు**

లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ కూకట్‌పల్లి శాసనసభ్యునిగా ప్రమాణస్వీకారం చేసిన పదిరోజుల్లోనే రాష్ట్రంలో అవినీతి అంతానికి బలమైన చట్టాన్ని

2009 జూన్‌లో అసెంబ్లీ ముందుంచారు. ఒకరి అవినీతిపై ఇంకొకరు తీవ్ర ఆరోపణలు చేసుకుని 2008లో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి మరీ అవినీతిపై చర్చించిన వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు నిజంగా రాజకీయ అవినీతిని అంతం చేయాలంటే ఈ చట్ట సవరణ కీలక ఆయుధమవుతుందని జేపీ అసెంబ్లీలోను, బైట పదేపదే విజ్ఞప్తి చేసినా వారు విననట్టు నటించారు. ప్రత్యేక కోర్టుల ఏర్పాటు, స్వతంత్ర ప్రాసిక్యూషన్, ఏసీబీకి స్వయంప్రత్తినిచ్చి బలమైన లోకాయుక్త పరిధిలోకి తేవటం, అవినీతిపరుల ఆస్తుల జప్తు వంటి కీలక సవరణలు లోక్‌సత్తా బిల్లులో ఉన్నాయి. ఇది మాస్ మీడియానూ ప్రభావితం చేసిన బిల్లు. ఈ బిల్లుతోనే భల్లాలదేవుడి తొలి చిత్రం 'లీడర్' వచ్చింది. ఈ బిల్లులోని ప్రత్యేక కోర్టులు అనే ఒక అంశాన్ని మాత్రం చేర్చి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌లాంటివారిని బెదిరించటానికి 2016లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బలహీన అవినీతి నిరోధక చట్ట సవరణ చేసి పైకి మాత్రం ఆర్భాటాలు చేస్తోంది.

## 24) లోక్‌సత్తా పార్టీ 'అవినీతి వ్యతిరేక కమిషన్'

అవినీతి అంతానికి జాతీయ స్థాయిలో అవినీతి వ్యతిరేక కమిషన్/లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయాలని 1997 నుంచి పోరాడుతున్న లోక్‌సత్తా ఆ క్రమలోనే 2007 అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం డిసెంబర్ 9న పార్టీ తరపున అవినీతి వ్యతిరేక కమిషన్‌ని ఏర్పాటు చేసింది. మాజీ లోకాయుక్త జస్టిస్ రామానుజన్‌ను కమిషన్ సారథిగా నియమించి ప్రజల నుంచి ఫిర్యాదులకు ప్రత్యేక నంబర్‌ను కేటాయించింది. భూ దందాల నుంచి అనేక కేసులు రావటం మొదలైనా కమిషన్ బాధ్యులు వెనుకంజ వేయటంతో అది పరిమిత ఫలితాలనే సాధించింది. సమాజంలో వనరులు, ఆలోచన ఉన్నవారు ముందుకురాకుండా అన్నిటినీ లోక్‌సత్తా మార్చాక మేం వస్తామంటే, మార్పు ఆలస్యమవుతుంది.

## 25) లోక్‌పాల్ రూపకల్పన

అవినీతి నిరోధక కమిషన్ పేరుతోనో, లోక్‌పాల్ పేరుతోనో జాతీయ స్థాయిలో అవినీతి నిరోధక వ్యవస్థ ఏర్పాటుకు 1997 నుంచి ప్రయత్నిస్తున్న లోక్‌సత్తాకు కర్ణాటక లోక్‌సత్తా 'సాకు' ఉద్యమం, విదేశాల్లోని పీపుల్ ఫర్ లోక్‌సత్తా 'దండి పాదయాత్ర' కార్యక్రమాల నుంచి రూపుదిద్దుకున్న ఇండియా ఎగనెస్ట్ కరప్షన్ ఉద్యమం లోక్‌పాల్ నిర్మాణానికి ఒక అవకాశంగా మారింది. లోక్‌పాల్‌పై క్షేత్రస్థాయిల్లో ప్రజల్లో అవగాహన పెంచుతూనే మరోవైపు జన లోక్‌పాల్‌లోని లోపాల్ని తొలగించి లోక్‌పాల్ బిల్లును జయప్రకాష్ నారాయణ్ కేంద్రానికి అందించారు. ప్రస్తుతం వచ్చిన లోక్‌పాల్ చట్టంలోని 80శాతం అంశాలు జేపీ రూపొందించినవే. అయితే ఆర్‌టీఐలోలా కేంద్రంలో బలమైన లోక్‌పాల్‌లా రాష్ట్రాల్లోనూ బలమైన లోకాయుక్తలను అదే చట్టంతో అందించాలని లోక్‌సత్తా చేసిన ప్రయత్నానికి ఆంధ్రప్రదేశ్ సహా కొన్ని రాష్ట్రాలు సహకరించకపోటంతో బలమైన లోకాయుక్త కోసం ఇంకా పోరాటాన్ని కొనసాగించాల్సి వస్తోంది.

**26) సీబీఐ, ఏసీబీలకు స్వయంప్రతిపత్తి**

లోక్‌సత్తా చొరవతో వచ్చిన 91వ రాజ్యాంగ సవరణ వల్ల అధికార పార్టీలో చీలికలు ఆగాయిగానీ ప్రతిపక్షాలు ఖాళీ అవటం మొదలైంది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనికి నాంది పలకగా, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పేటెంట్ పంచుకున్నట్టు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఓ ఎంఎల్‌సీని కొనుగోలు చేస్తూ రూ.5కోట్లతో రెడ్‌హ్యాండెడ్‌గా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, నేతల రాజకీయ జీవితం మనం కలవరించే సింగపూర్, అమెరికా లాంటి దేశాల్లోనైతే వెంటనే ముగిసిపోయేదే. కానీ నీకు హైదరాబాద్, నాకు అమరావతి అని రాజీపడి ఆ ఇద్దరు ముఖ్యమంత్రులూ ఏసీబీ, పోలీసుల నోళ్లు మూయించారు. ఈ నీ ఏసీబీ, నీ పోలీసు, నా ఏసీబీ, నా పోలీసు రాజకీయం లేకుండటం కోసమే అవినీతి రాజకీయ ప్రక్షాళన చేసేందుకే లోక్‌సత్తా సీబీఐ, ఏసీబీలకు జవాబుదారీతనంతో కూడిన స్వయంప్రతిపత్తి ఉండాలని పలు సంస్కరణల్లో భాగంగా చెబుతూ ప్రజలను చైతన్యపరుస్తోంది.

**27) ఆంక్షల్ని తొలగించిన రైతు సత్యాగ్రహ యాత్రతో తెలంగాణ, ఏపీ రైతులకు రూ.3600 కోట్ల ఆదాయం**

రైతులు వ్యవసాయోత్పత్తులను పక్క జిల్లాలో కూడా అమ్మకూడదని తెలుగు నాట ఆంక్షలు విధించి రైతుల్ని ప్రభుత్వమే అమానుషంగా మోసం చేస్తూ దోపిడీని ప్రోత్సహిస్తుంటే ఆంక్షలకు వ్యతిరేకంగా జయప్రకాష్ నారాయణ్ ఆధ్వర్యంలో లోక్‌సత్తా 2012 ఫిబ్రవరిలో చేసిన రైతు సత్యాగ్రహ యాత్రతో ప్రభుత్వం దిగివచ్చింది. దమ్ముంటే అరెస్టు చేయండన్నా చేయలేక వెనక్కి తగ్గింది. కర్నూలు నుంచి కర్ణాటక వరకు, నిజామాబాద్ నుంచి నాందేడ్ వరకు చేసిన ఈ యాత్ర వల్ల వ్యవసాయోత్పత్తుల అమ్మకంపై ఆంక్షలు తొలిగి తెలుగునాట రైతులకు కేవలం ఒక్క బీపీటీ ధాన్యంలోనే ఆ సీజన్‌లో రూ.3600 కోట్ల అదనపు ఆదాయం లభించింది.

**28) ఆహారధాన్యాల ఎగుమతులపై ఆంక్షల తొలగింపు**

స్వేచ్ఛావాణిజ్యం గురించి కథలుకథలుగా గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు రైతులకు మాత్రం ఆ వాణిజ్యాన్ని అమలుచేయటం లేదు. కారు తయారుచేసేవాళ్లు ప్రపంచంలో ఎక్కడైనా అమ్ముకోవచ్చుగానీ, రైతులు తాము పండించిన పంటలను మాత్రం డిమాండ్ ఉన్నచోట అమ్ముకోకూడదట. ఈ పాలకుల పాపాన్ని బైటపెట్టి ఆహారభద్రత పోను మిగిలిన ధాన్యాల్ని స్వేచ్ఛగా ఎగుమతి చేసేలా లోక్‌సత్తా చేసిన పోరాటంతో 2010లో పెద్దఎత్తున ఎగుమతులు భారత్ నుంచి మొదలయ్యాయి. క్రమంగా భారత వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు 39 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

2016-17లోనే రూ. 1,38,000కోట్ల ఆహారధాన్యాల ఎగుమతులు జరిగాయి. ఆహారధాన్యాల ఎగుమతుల్లోనే భారత్‌కు 100బిలియన్ డాలర్ల సామర్థ్యం ఉందని అంచనా. ప్రపంచంలో ఎక్కడ లాభముంటే అక్కడ రైతులు అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తామని 1992లో పార్లమెంటుకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కి.. పారిశ్రామికవేత్తలకో న్యాయం, రైతులకో న్యాయం తరహాలో ఇష్టమొచ్చినట్టు అమలుచేస్తున్న ఎగుమతుల విధానాన్ని లోక్‌సత్తా సుస్థిరపరిచింది. ఎగుమతులతో రైతులకు ఆదాయాన్ని పెంచటంతోపాటు పప్పులు, వంటనూనెలు వంటి వాటిపై దిగుమతి సుంకాలు విధించి మన రైతులకు ప్రోత్సాహకాలిచ్చేలా కూడా లోక్‌సత్తా పోరాడుతోంది.

### 29) రైతు ఐక్యతా ఉద్యమం

పాలకులు రైతులకు రైతే రాజు, రైతే వెన్నెముక వంటి బిరుదులిచ్చి, వారిలో విభేదాలను వారిలో సృష్టించి ఓట్లు గుంజుతుంటే, లోక్‌సత్తా రైతుకు ఆదాయాన్ని పెంచటం లక్ష్యంగా రైతు ఐక్యతా ఉద్యమాన్ని 2010లో ప్రారంభించింది. కులం, మతం, ప్రాంతం, భాష, పార్టీ, పంట తేడాలేకుండా రైతులందరినీ హేతుబద్ధ విధానాలతో ఏకం చేసే ప్రయత్నం చేసింది. రైతులకు సరైన పెట్టుబడి సౌకర్యం, ధరలు తగ్గినప్పుడు నిల్వ ఉంచుకునేందుకు గిడ్డంగులు వంటి మౌలిక వసతులు దగ్గర్నుంచీ రైతు బిడ్డకు నాణ్యమైన విద్య, వైద్యం, అవినీతి లేని సేవలకు సర్వీస్ గ్యారంటీ చట్టంతోపాటు స్వేచ్ఛావాణిజ్యావకాశం వరకూ పలు సంస్కరణలతో నూతన వ్యవసాయ విధానాన్ని లోక్‌సత్తా ప్రతిపాదించింది. వీటిని కరపత్రాలుగా, చిన్నచిన్న పుస్తకాలుగా రైతుల్లోకి, వినియోగదారుల్లోకి పెద్దఎత్తున తీసుకెళ్లింది. రైతుల ఓట్లను పొందుతున్న ఏ పార్టీ అయినా ఇవిగాక ఏ పరిష్కారాలు రైతులకు మేలు చేస్తాయో చెప్పగలవా?

### 30) కొత్త రాజకీయ సంస్కృతితో రాజకీయాలకు ప్రజాదరణ తెచ్చాం

రాజకీయాలలోకి వస్తే చెప్పుతో కొట్టండి అన్న జన లోక్‌పాల్ ఉద్యమ నేతల్లో అనేకమంది మాట మార్చి రాజకీయాల్లోకి చేరారుగానీ ఆ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన లోక్‌సత్తా ఏనాడూ రాజకీయాలను ద్వేషించలేదు. మంచి రాజకీయాన్ని మించిన పవిత్ర వ్యాసంగం లేదు లాంటి మాటలు లోక్‌సత్తా పేటెంట్లు. రాజకీయం లేకుండా ప్రజాస్వామ్యం మనుగడ ఎలా సాధ్యంకాదో ప్రజలకు వివరిస్తూ, ఓటు, భావప్రకటనా స్వేచ్ఛ ఉన్న సమాజంలో రాస్తారోకోలు, విధ్వంసాలు, ఆటంకాలు వంటి పద్ధతులు స్వీయవినాశనకరమని తెలియచేస్తూ హేతుబద్ధ విధానాలు, బహిరంగ చర్చ ప్రమాణాలు, ప్రజల హక్కులను గౌరవిస్తూ ఆందోళనలు వంటి పద్ధతుల ద్వారా కొత్త రాజకీయ సంస్కృతిని లోక్‌సత్తా ప్రవేశపెట్టింది. రాజకీయాలను ద్వేషిస్తున్న యువత, మధ్యతరగతి తిరిగి రాజకీయాలవైపు ఆకర్షితులవ్వటానికి లోక్‌సత్తా చేసిన అలుపెరగని కృషే కారణం.

ఆమ్ ఆద్మీ పార్టీ లోక్‌సత్తా మంచి రాజకీయం నినాదంతోనే వచ్చినా ఓట్లు కొనకుండా ఎన్నికల్లో గెలవటం మినహా విధానాలలో, రాజకీయ సంస్కృతిలో వాళ్లకి, సాంప్రదాయ రాజకీయ పార్టీలకు పెద్ద తేడా లేదు.

### 31) యువతకే పెద్దపీట

దేశ జనాభాలో 70శాతానికిపైగా యువతే, భవిష్యత్తులో 90శాతం కాలం వారిదే అని కబుర్లే తప్ప పార్టీల్లో, ప్రభుత్వంలో వారికి సారథ్యం ఇవ్వటం మాత్రంలేని ఈదేశంలో యువతకు నాయకత్వాన్ని, యువత చుట్టూ రాజకీయాన్ని ప్రారంభించింది లోక్‌సత్తా. ఎవరో నాయకుడు, నాయకురాలు, సంపన్నుల కొడుకో, కూతురో, బంధువో కాబట్టి అని కాకుండా ప్రతిభ, సామర్థ్యం, నిబద్ధత ఉంటే సామాన్య యువత రాజకీయాలలో ఎదిగేందుకు వేదికగా లోక్‌సత్తా ఉద్యమం, పార్టీ ఏర్పడ్డాయి. లోక్‌సత్తా విధానాలలో కీలకమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు యువతను ఆత్మగౌరవం గల పౌరులుగా తీర్చిదిద్దేవే. ఎన్నికల్లో లోక్‌సత్తా వచ్చాకే తెలుగునాట సామాన్య యువతకు రాజకీయాలలో తేలికగా ఎదిగే అవకాశాలు లభించాయి.

### 32) యువ థాట్‌లీడర్స్‌ని తయారుచేసే స్కూల్ ఆఫ్ డెమోక్రసీ

పక్షపాత, ఎన్నికల రాజకీయాల్ని మాత్రమే బోధించే పార్టీల శిక్షణా తరగతులకు భిన్నంగా ప్రజాస్వామ్య సంస్కరణలను బోధించే పాఠశాలను లోక్‌సత్తా స్థాపించి లక్షలాది యువతకు శిక్షణను అందించింది. ఈ సంస్కరణలను వివరించాక వాటి సాధనకు లోక్‌సత్తా రూపొందించిన నూతన రాజకీయ సంస్కృతి విధానాలను బోధిస్తారు. లోక్‌సత్తా నేతలతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గని దిశానిర్దేశం చేస్తుంటారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారం, కొత్త రాజకీయంపై యువతకు అవగాహన కలిగించేందుకు లోక్‌సత్తా ప్రజాస్వామ్య పాఠశాల ద్వారా ఇచ్చిన శిక్షణ ద్వారా దాదాపు 2లక్షలమంది యువ థాట్ లీడర్స్ రూపుదిద్దుకున్నారు. ఓట్లు, సీట్లు పొందిన ఏ పార్టీ అయినా ఇలా ఆలోచన గల నేతలను తయారుచేసే సాహసం చేస్తాయా?

### 33) వంశపారంపర్య రాజకీయాలకు ప్రత్యామ్నాయ వేదికగా లోక్‌సత్తా

ఎటువంటి ప్రజాసేవ లేకుండా కేవలం నేతల కుటుంబసభ్యులు కాబట్టి రాజకీయాలలో ఎదిగే వంశపారంపర్య రాజకీయాలకు వ్యతిరేకంగా లోక్‌సత్తా రాజీలేని పోరాటం చేస్తోంది. సామాన్య యువత, కార్యకర్తల పౌరుషాన్ని ప్రశ్నించే పోరాటమిది. కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకంగానే 2008లో ఖైరతాబాద్‌లో కాంగ్రెస్‌పై, విజయనగరం జిల్లా తెర్లాంలో తెలుగుదేశంపై ఉప ఎన్నికల్లో లోక్‌సత్తా సామాన్య యువతను నిలబెట్టి ప్రత్యక్ష పోరాటం చేసింది. ఢిల్లీ నుంచి అమరావతి దాకా వంశపారంపర్య రాజకీయాలు చేస్తున్న నేతలు, పార్టీలు తమ అప్రజాస్వామిక పాత రాజకీయానికి కనీసం సిగ్గుపడతారా?

## 34) దేశవిదేశాల్లో భావాల వ్యాప్తి

లోక్‌సత్తా ప్రారంభం తెలుగు నేల మీదే అయినప్పటికీ భావాలు దేశవ్యాప్త పరిష్కారాలు. అంతర్జాతీయంగా కూడా వ్యవస్థాపకుడు జేపీ ఎవరో తెలియకుండానే లోక్‌సత్తాకు అభిమానులు ఏర్పడ్డారు. పలు దేశాల్లో బృందాలుగా, 'పీపుల్ ఫర్ లోక్‌సత్తా' సంస్థగా సంఘటితమయ్యారు. బలమైన భావాలే మార్పునకు బీజాలు కాబట్టి ఆ అమృత బీజాల్ని నాటటానికి ఆధునిక సమాచార సాధనాల్ని వినియోగించుకోవటంతోపాటు దేశవ్యాప్తంగా అసంఖ్యాక పర్యటనలు చేసి అనేక ప్రాంతాలలోని విద్యాలయాలలో, సంస్థలలో, కార్యక్రమాల ద్వారా జేపీ తన భావాల్ని వివిధ వర్గాల ప్రజలతో, ముఖ్యంగా విద్యార్థులు, యువతతో పంచుకున్నారు. మార్పు మహోద్యమంలో ఎన్నారైలను భాగస్వాములను చేసేందుకు విదేశాలలోనూ సభలను నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలలో నిర్వహించిన వేలాది సభలకు ఇవి అదనం.

## 35) విధానాలను ఫిరాయించుకుండా అన్ని పార్టీలతో అంటకాగిన లోక్‌సత్తా

లోక్‌సత్తా కాంగ్రెస్ ఏజెంటని, తెలుగుదేశంతో కలిసి పనిచేస్తుందని, బీజేపీతో అంటకాగుతుందని, కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసిందని ఇలా రకరకాల విమర్శలు. ఇంతమందితో కలిసి పనిచేయటమంటే లోక్‌సత్తా కచ్చితంగా ఈదేశం కోసమే పనిచేస్తుందని వేరే రుజువులక్కర్లేదు. దేశ ప్రయోజనాల కోసమే యూపీయే-1 ప్రభుత్వ హయాంలోని జాతీయ సలహామండలి (ఎన్ఏసీ)లో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పనిచేశారు. అందులో పనిచేయటాన్ని అవకాశంగా వినియోగించుకునే ఆయన జాతీయ ఆరోగ్య మిషన్, స్థానిక న్యాయాలయాల చట్టం, ఉపాధి హామీ, సహకార సంఘాల స్వయంప్రతిపత్తి వంటి కీలక చట్టాల్ని అందించారు. రెండో పరిపాలనా సంస్కరణల సంఘంలో (ఏఆర్సీ)లో పనిచేసి ఆధునిక భారత్‌కు కావలసిన అనేక పాలనా సంస్కరణల్ని అందించారు. యూపీయే-2 గెలుపు వెనక ఈ కృషి ఎంతో పనిచేసింది. జెండా తప్ప ఎజెండా లేకుండా గెలిచి పార్టీలు ఫిరాయించినవారా లోక్‌సత్తాను విమర్శించేది?

## 36) ఇళ్ల స్థలం, పెన్షను కూడా లేకుండా

ఒక ఐఏఎస్ అధికారిగా రూ.1200 నెల జీతంతో మొదలై 24 గంటలూ ప్రజలు సమస్యలపై ఎప్పుడైనా కలవొచ్చనే బోర్డుతో ఏసీ కూడా లేని ఆఫీసుల్లో పనిచేసి స్వతంత్ర భారత్‌లో ఏ కలెక్టర్ సాధించనన్ని విజయాల్ని నమోదు చేసిన జయప్రకాష్ నారాయణ్ లోక్‌సత్తాను స్థాపించటం కోసం ఆ పదవిని పెన్షన్ కూడా లేకుండా వదులుకున్నారు. ఇతర ఐఏఎస్‌లు తీసుకున్నట్టు ఇళ్ల స్థలాన్ని కూడా తీసుకోలేదు. ఎన్ఏసీలో ఉన్నప్పుడు జేపీకి కేబినెట్ హోదా ఉన్నట్టు ఆయన కుటుంబసభ్యులకు కూడా తెలీదు. అధికారం,

ఆడంబరాల పాలకులు ఈ కనీస నైతిక ప్రమాణాలను చేరుకోవటానికి మనం ఇంకెంతకాలం ఎదురుచూడాలి?

**37) సాటిలేని మార్పు స్థాయి**

లోక్‌సత్తా చేపట్టిన రాజకీయ సంస్కరణలు ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో గతంలో ఏదోకమేర చోటుచేసుకుని ఉండవచ్చు. కానీ ఐరోపా కంటే విశాలమైన, సంక్లిష్టభిన్నత్వమున్న భారత్‌లాంటి దేశంలో ఆ మార్పును సాధించటం ఇంతకుముందెన్నడూ జరగలేదు. చైనా కంటే కూడా భారత్‌లో మార్పు తేవటం కష్టసాధ్యమని సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ కూడా అనేవారు. అందుకే స్కేల్ ఆఫ్ ఛేంజ్‌లో లోక్‌సత్తా కృషి ప్రపంచంలోనే సాటిలేనిది. చరిత్ర క్రమం తెలిస్తే యువత రెట్టించిన ఉత్సాహంతో లోక్‌సత్తా లక్ష్యాల కోసం పనిచేయగలుగుతారు.

**38) సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాల ప్రక్షాళనకు ఎన్‌జేఏసీ**

ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ లేని రీతిలో మనదేశంలో జడ్జీలను జడ్జీలే నియమించుకునే అప్రజాస్వామిక వ్యవస్థను ప్రక్షాళన చేసి నియామకాల్లో పారదర్శకతను పెంచేందుకు లోక్‌సత్తా మచ్చలేని సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కలిసి జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని 2015లో సాధించింది. 14 ఏళ్ల లోక్‌సత్తా కృషితో రూపొందిన బిల్లుని పార్టీ శత్రుత్వాల మధ్య కూడా పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించినా, గతానికి భిన్నంగా తక్కువ సమయంలోనే సగానికిపైగా రాష్ట్రాల శాసనసభలు ధృవీకరించినా సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగసభలా వ్యవహరించి ఇది రాజ్యాంగ విరుద్ధమని చెప్పే సాహసాన్ని మోదీ ప్రభుత్వం, పార్లమెంటు చేయలేకపోయాయి. ఎమర్జెన్సీ సమయంలో, నీట్ వంటి కేసుల్లో తాను ఇచ్చిన తీర్పులు తప్పు అని అంగీకరించిన సుప్రీంకోర్టు ఎన్‌జేఏసీ విషయంలో కూడా ఇచ్చిన తీర్పును సవరించుకుంటుందని ఘంటాపథంగా లోక్‌సత్తా ప్రకటిస్తోంది.

**39) తప్పు చేసిన న్యాయమూర్తులపై విచారణ**

న్యాయసంస్కరణల్లో భాగంగా ఎన్‌జేఏసీతోపాటు న్యాయమూర్తులపై ఆరోపణలను విచారించేందుకు జ్యుడీషియల్ అకౌంటబిలిటీ చట్టాన్ని కూడా లోక్‌సత్తా ప్రతిపాదించింది. అందరికీ సమాన న్యాయం అందించే న్యాయవ్యవస్థ సక్రమంగా లేకుండా ఎటువంటి ప్రజాస్వామ్యాన్ని ఈ పాలకులు అమలు చేస్తున్నారు?

**40) ఐఏఎస్‌లా ఐజేఎస్ కోసం**

న్యాయసంస్కరణలలో భాగంగా ఎన్‌జేఏసీ, జ్యుడీషియల్ అకౌంటబిలిటీ చట్టంతోపాటు సమర్థులైన యువత న్యాయమూర్తులుగా వచ్చేందుకు ఐఏఎస్, ఐపీఎస్‌ల

తరహాలో ఇండియన్ జ్యుడీషియల్ సర్వీసు (ఐజేఎస్)ని కూడా లోక్‌సత్తా ప్రతిపాదించింది. వీటికి తోడు కింది కోర్టులలో న్యాయమూర్తుల సంఖ్యను పెంచటం, న్యాయ విచారణ పద్ధతుల్ని సులభతరం చేయటం, స్థానిక న్యాయస్థానాలను బలోపేతం చేయటం, నేరపరిశోధనలో పోలీసు యంత్రాంగాన్ని సంస్కరించటం వంటివి చేస్తేనే మనం నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నట్టు.

## 41) ముగ్గురు హీరోల లక్ష్యాల కోసం జేపీ

తన జీవితంలోని ముగ్గురు హీరోలు– వర్గీస్ కురియన్, డాక్టర్ రజనీకాంత్ అరోలీ, శరద్ జోషీల లక్ష్యాల సాధనకు జయప్రకాష్ నారాయణ్ సహకారరంగం, వైద్యం, వ్యవసాయరంగాలలో పెనుమార్పులకు కృషి చేశారు. ఇందులో సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి గ్యారంటీనిచ్చే 97వ రాజ్యాంగ సవరణను శ్వేతవిప్లవ పితామహుడు కురియన్ కన్నుమూసిన కొద్దిరోజులలోనే సాధించి నివాళిగా అందించారు. వైద్యంలో జాతీయ ఆరోగ్య మిషన్‌ని, వ్యవసాయంలో ఆంక్షల తొలగింపు, ఎగుమతులపై నిషేధం ఎత్తివేత వంటి మార్పుల్ని సాధించినా ఇంకా ఈ రంగాలలో చాలా చేయాల్సి ఉంది. మనం ఎన్నుకుంటున్న నేతల రోల్‌మోడల్స్ ఎవరు? వారి ఆశయాల సాధనకు ఈ ఎన్నికైన నేతలు ఏం చేస్తున్నారు?

## 42) ఓట్ల కోసం ఇష్టమొచ్చిన వాగ్దానాలు ఏనాడూ చేయలా

ఎన్నికలలో ఎలాగోలా గెలవటం కోసం ప్రజలకు నష్టం చేసే హామీలను, ఉచితాల ప్రలోభాలను లోక్‌సత్తా ఎన్నడూ ప్రకటించలేదు. లోక్‌సత్తా స్ఫూర్తితో వచ్చి ఢిల్లీలో గెలిచిన ఆమ్ ఆద్మీ పార్టీ ఉచిత మంచినీరు, విద్యుత్తు టారిఫ్‌ల మాఫీ వంటి హామీలనిచ్చిందిగానీ లోక్‌సత్తా నోట ఏనాడూ అలాంటి మోసపూరిత మాటలు రాలేదు. రైతుల రుణమాఫీకి ఓట్లు పడతాయని తెలిసినా 2008లో యూపీయే ప్రభుత్వం మాఫీ చేసినప్పుడు, 2014లో తెలుగుదేశం, టీఆర్ఎస్, కాంగ్రెస్ హామీ ఇచ్చినప్పుడు కూడా లోక్‌సత్తా వ్యతిరేకించింది. రైతుల జీవితాలను బాగుచేసే విధానాలను ప్రకటించి అందుకోసం నిధుల్ని వినియోగిస్తామనే లోక్‌సత్తా ప్రజలకు తెలిపింది.

## 43) జాతీయ ఆరోగ్య మిషన్

ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వం చేయాల్సిన కచ్చితమైన పనుల్లో అందరికీ నాణ్యమైన వైద్యం, విద్య అందించటం కీలకమని తొలి నుంచీ పోరాడుతున్న లోక్‌సత్తా ఇందులో భాగంగా 2006లో జాతీయ ఆరోగ్య మిషన్‌ను సాధించింది. అయితే ఈ మొత్తం విధానాన్ని అమలుచేయకుండా రెండు ముక్కలు చేసి జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌గా మార్చి కొంతమేర అమలుచేశారు. జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్‌ని ఇప్పుడిప్పుడు అమలు చేస్తున్నారు. కానీ ఇది కేవలం లోక్‌సత్తా ఆశించిన వైద్య, ఆరోగ్య లక్ష్యంలో

పదిశాతం మాత్రమే. అందుకే లోక్‌సత్తా 2.0లో భాగంగా 'అందరికీ ఆరోగ్యం' కోసం విధానాన్ని రూపొందించి కేంద్రప్రభుత్వానికి అందించింది.

## 44) లోక్‌సత్తా విధానంతో అందరికీ ఆరోగ్యంతో పాటు 1కోటి ఉద్యోగాలు

జాతీయాదాయంలో కేవలం 2శాతంతో అందరికీ ఆరోగ్యాన్ని అందించటంతోపాటు 1 కోటి ఉద్యోగాలను అందించే విధానాన్ని రూపొందించిన లోక్‌సత్తా ఇటీవల దానిపై నీతి ఆయోగ్‌కి ప్రజెంటేషన్ ఇచ్చింది. పార్లమెంటరీ ప్యానల్‌కు కూడా వివరాల్ని తెలియచేసింది. దీంట్లో భాగంగా గ్రామాలకు వైద్యసేవలందించే ఫ్యామిలీ డాక్టర్లు, పట్టణాల్లో ప్రయివేటు నర్సింగ్ హోంలతో కలిసిపనిచేసే కమ్యూనిటీ ఆసుపత్రులు, పెద్ద జబ్బులకు వైద్యం చేసే బోధనాసుపత్రుల వ్యవస్థ ఉంటుంది. ప్రజలకు నాణ్యమైన సేవలందించే కొద్దీ వైద్యులకు ఆదాయం పెరుగుతుంది. ప్రపంచ దేశాల వైద్యవ్యవస్థలన్నిటినీ అధ్యయనం చేసి రూపొందించిన లోక్‌సత్తా విధానంతో 1కోటి ఉద్యోగాలు కూడా మనదేశంలో వస్తాయి. అన్నీ అందిస్తున్నా ప్రజలను అనారోగ్యం, అప్పుల పాలు చేస్తున్న పాలకులు ఇంకెప్పుడు మారతారు? వారిని మార్చగలిగేలా మనం ఎప్పుడు ఓటు వేయగలుగుతాం?

## 45) విద్యను రాజకీయానికి కేంద్రబిందువు చేయటం

విద్య గురించి మన సమాజంలో ఎప్పటినుంచో చర్చ ఉన్నా దాన్ని రాజకీయానికి కేంద్రబిందువు చేయటం లోక్‌సత్తాతోనే మొదలైంది. సోషలిస్టు వాదులు సహా మనదేశంలో ఏ పార్టీ వారూ విద్యను, వైద్యాన్ని రాజకీయానికి కేంద్రబిందువుగా భావించలేదు. దాని ఫలితంగానే ఏటా కోట్ల మంది పేదరికాన్ని, పుట్టుకతో వివక్షను ఎదుర్కొంటున్నారు. విశ్లేషణ, తర్కం, సృజనాత్మకతను పెంచే నాణ్యమైన పాఠశాల విద్యను అందరికీ ఉచితంగా అందించటంతోపాటు పైచదువులు చదవాలనుకునేవారికి పేదరికం అవరోధం కాకుండా ఏర్పాట్లను అందించే విధానాల కోసం లోక్‌సత్తా కృషి చేస్తోంది. విద్యాహక్కు చట్టంలోని లోపాలు, విద్యాప్రమాణాలను పెంచటంపై దేశంలోని ఉదారవాద భావజాలురతో చర్చించి ఇటీవల జాతీయ విద్యావిధానంపై కూడా లోక్‌సత్తా తన సూచనల్ని అందచేసింది.

## 46) స్థానిక న్యాయాలయాల చట్టాన్ని అందించిన లోక్‌సత్తా

పూర్తిగా లోక్‌సత్తా చొరవ వల్లే 2009లో ఈదేశంలో స్థానిక న్యాయాలయాల చట్టం వచ్చింది. మహిళల భద్రతకు, ప్రజాస్వామ్యానికి మూలమైన న్యాయాన్ని తేలిగ్గా తక్కువ ఖర్చుతో అందరికీ అందించటానికి ఎంతో ఉపయోగపడే ఈ స్థానిక కోర్టుల అమలుకు కేంద్రం ముందుకొచ్చినా హైకోర్టులే అడ్డంకులు సృష్టించటం, ఓట్లు పడవు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవటం శాపంగా మారాయి. మహిళలపై

అత్యాచారాల దాకా నేరాలు రాకుండా వేధింపుల దశలోనే నిరోధించేందుకు ఈ కోర్టులు ఉపయోగపడతాయి. కేసులు వారంలోగా పరిష్కారమవుతాయి. రూ.2లక్షల లోపు సివిల్ కేసులు కూడా నెలల వ్యవధిలో పరిష్కారమవుతాయి. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయవాదులకు డిమాండ్ తగ్గుతుందనే భయంతో ఈ స్థానిక కోర్టుల్ని అడ్డుకోవటంపై మాట్లాడకుండా కేసులు పెరిగిపోయాయి అని జడ్జీలు, పాలకులు కన్నీరు కార్చి ఏం లాభం?

## 47) అసెంబ్లీలో ఒకే ఒక్కడు

పార్టీ తరపున గెలిచింది ఒక్కడే అయినా, రాష్ట్రంలో రాజకీయమంతా గందరగోళంగా ఉండి అసెంబ్లీయే స్తంభిస్తున్నా ప్రజల తరపున, దేశ ప్రయోజనాల కోసం గళం విప్పిన ఒకే ఒక్కడు జయప్రకాష్ నారాయణ్. చర్చ, ప్రసంగాలతోపాటు వాకౌట్లు వంటి ధోరణులు లేని నిరసన పద్ధతులతో అసెంబ్లీ గౌరవాన్ని పెంచారు జేపీ. చట్టసభలలో ఇంత ఒత్తిడి, రాజకీయ ప్రకంపనల మధ్య సమర్థవంతంగా పనిచేసిన దాఖలాలు స్వతంత్ర భారతదేశ రాష్ట్రాల్లోగానీ, పార్లమెంటులోగానీ కనిపించవు. 'వన్ మ్యాన్ విత్ కన్విక్షన్ ఈజ్ ఎ మెజారిటీ'.

## 48) చట్టబద్ధ పాలన

ఆధునిక ప్రభుత్వాలు చేయాల్సిన మొట్టమొదటి పని చట్టబద్ధ పాలన అని తప్పు చేసిన వారు ఎంత పలుకుబడి కలవారైనా, రాజకీయంగా ఎంత నష్టం వచ్చినా లోక్‌సత్తాకనిర్ద్వంద్వంగా ఆచరణలో చూపింది. ఎక్కడో ఢిల్లీలో తమ పార్టీ అధినేత్రిపై ఏవో ఆరోపణలు చేశారని 2010లో హైదరాబాద్‌లో అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య రోడ్డు మీద బైఠాయించినప్పుడు అక్కడి సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎందుకు అరెస్టు చేయలేదు? అని జేపీ ప్రశ్నించారు. అసెంబ్లీలో తన మీద దాడి చేసిన టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, తెలంగాణ ఉద్యమకారుల పట్ల ఉదారంగా వ్యవహరించిన జేపీ ప్రజలపై హింస, ఆస్తుల ధ్వంసం, స్వేచ్ఛకు భంగం కలిగించటం వంటి కేసుల్లో కఠినంగా వ్యవహరించాల్సిందేనని అసెంబ్లీలో సైతం స్పష్టంచేశారు. చట్టబద్ధ పాలన ముందు అందరూ సమానమే అంటూ న్యాయ, పోలీసు సంస్కరణల కోసం పోరాడుతున్న లోక్‌సత్తాకు, సొంత రాజకీయ ప్రయోజనాల కోసం రోజూ చట్టాన్ని తుంగలో తొక్కే పార్టీలకు మధ్య తేడాని ఎప్పటికి గుర్తిస్తాం?

## 49) కూకట్‌పల్లికి 500కిపైగా అధికారిక పర్యటనలు

నగరంలో అందుబాటులో ఉండేందుకే కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఎంచుకున్న జయప్రకాష్ నారాయణ్ 2009 నుంచి ఐదేళ్ల కాలంలో 500కిపైగా సార్లు కూకట్‌పల్లిలో పర్యటించారు. నియోజకవర్గ సమస్యలను తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక విభాగాలుగా

చేసి, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, రోడ్లు, మౌలిక వసతులు, ప్రజాసమస్యలు, ఉపాధి నైపుణ్యాలు వంటి విభాగాల్లో లోక్‌సత్తా వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేసి ఆదర్శప్రాయ కృషి చేశారు. కేవలం రాజకీయ అజ్ఞానం, దురాలోచనతో జేపీ కూకట్‌పల్లికి ఏమీ చేయలేదని పథకం ప్రకారం దుష్ప్రచారం చేసి 2014లో జంప్ జిలానీల్ని గెలిపించినవారంతా ఇప్పుడు చెప్పండి–కూకట్‌పల్లికి జేపీ ఏమీ చేయలేదా?

## 50) రాజకీయ సంక్షోభం మధ్య కూడా రూ.1600 కోట్ల పనులు

రాష్ట్రంలో పాలన లేదు, నియోజకవర్గంలో ఆంధ్ర–తెలంగాణ గొడవలు. అయినా పార్టీలకతీతంగా అందరినీ కలుపుతూ కూకట్‌పల్లి శాసనసభ్యుడిగా జయప్రకాష్ నారాయణ్ రూ.1600 కోట్ల రూపాయల అభివృద్ధి పనులను చేసి చూపించారు. ఒక్క ప్రాజెక్టులో కూడా కమీషన్ ఇవ్వకుండా పని చేశామని కాంట్రాక్టర్లు స్వయంగా చెప్పుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికార పార్టీలోకి జంప్ చేస్తున్నామని మనం గెలిపించిన నేతల చేతే పువ్వులు పెట్టించుకునే ముందు ఒక్కసారి ఏకైక ఎమ్మెల్యేగా, రాజకీయ సంక్షోభం మధ్య కూడా కూకట్‌పల్లిలో జేపీ చేసిన కృషిని గుర్తుకు తెచ్చుకోండి.

## 51) వార్డు మేనిఫెస్టోల విడుదల

నిజమైన స్మార్ట్ నగరాల, పట్టణాల నిర్మాణ ఎజెండాతో 2014 మునిసిపల్ ఎన్నికలలో, 2009, 2015 గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికలలో లోక్‌సత్తా పోటీ చేసింది. మేయర్‌ను ప్రత్యక్షంగా ఎన్నుకోవటం, వార్డు స్థాయికి అధికారాలను వికేంద్రీకరించటం, వార్డుల్లో ప్రజలకు తలసరి రూ.1000 కేటాయించటం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేకుండా సర్వీస్ గ్యారంటీ చట్టం, మద్యనియంత్రణ వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగింది. వివిధ వార్డులకఅభివృద్ధికి లోక్‌సత్తా ప్రత్యేక మేనిఫెస్టోలను విడుదల చేయటం ఇప్పటికీ దేశవ్యాప్తంగా వినూత్న కార్యక్రమంగానే ఉంది. ఇతర దేశాలకు వెళ్లి మేయర్లతో సమావేశమయ్యే మన ముఖ్యమంత్రులు, మంత్రులు ఇప్పటికీ ఈ వికేంద్రీకరణ ఎజెండా దరిదాపుల్లోకి రావటానికి ప్రయత్నించటం లేదు. కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీల పథకం కూడా ఈ అంశాలు లేకుండా పైపై పూతలతో జనాన్ని భ్రమపెట్టే ప్రయత్నం చేస్తోంది. ఎంతకాలమో చూద్దాం!

## 52) పోలీసు సంస్కరణలు

చట్టబద్ధ పాలన ఆధునిక ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి మొదటి మెట్టుగా భావించే లోక్‌సత్తా ఆ క్రమంలో నేరపరిశోధనలో రాజకీయ జోక్యం లేకుండా, సాధారణ శాంతి భద్రతలను చూసే ఇతర పోలీసు విభాగం నుంచి వేరు చేయటం, జవాబుదారీతనంతో నేరపరిశోధనావిభాగానికి స్వయంప్రతిపత్తి, రోగ్ పోలీసింగ్ తయారవకుండా నిరంతర పర్యవేక్షణ, ప్రతి జిల్లాకూ ఫోరెన్సిక్ ల్యాబ్ ఏర్పాటు, 33శాతం మహిళా సిబ్బంది

నియామకం, స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాసిక్యూషన్ తదితర సంస్కరణల కోసం సుదీర్ఘంగా కృషి చేస్తోంది. నీ పోలీసు, నా పోలీసు అని ఓటుకు కోట్లు వంటి కేసుల్ని తారుమారు చేస్తున్న తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల లాంటి వారెందరినో అధిగమించే ప్రజా బాహుబలం కలిసొస్తేనే ఈ లక్ష్యాన్ని లోక్‌సత్తా సాధించగలుగుతుంది.

### 53) జనం + క్రియాశీల పరిజ్ఞానం= లోక్‌సత్తా ప్రయత్నం

ఇతర పార్టీలు అనుచరుల్ని, భావోద్రేకాలతో, ప్రలోభాలతో గుడ్డిగా ఓటు వేసే ఓటర్లను మాత్రమే కోరుకుంటుంటే, లోక్‌సత్తా ప్రజలను ఈదేశానికి నిజమైన సార్వభౌములుగా, నాయకులుగా గుర్తిస్తుంది. ప్రజల విజ్ఞతను విశ్వసిస్తూ ప్రజల్లో అవగాహనను పెంచేందుకు తగిన పరిజ్ఞానాన్ని అందించేందుకు నిరంతరం ప్రయత్నిస్తుంటుంది. అందుకే మందలను కోరుకునే పార్టీలకు భిన్నంగా జనం+క్రియాశీల పరిజ్ఞానమున్న దేశనిర్మాణం లోక్‌సత్తా లక్ష్యం. క్రియాశీల పరిజ్ఞానమున్న ప్రజలే ఈదేశ భవిష్యత్తుకు నిజమైన గ్యారంటీ. కాదనగలరా? ఔనంటే, ఎందుకు ప్రజాద్రోహ రాజకీయాలను కొనసాస్తున్నారు?

### 54) కులవ్యవస్థపై యుద్ధం

శతాబ్దాలపాటు అమానుషమైన వివక్షను వ్యవస్థీకృతం చేసిన కులంపై లోక్‌సత్తాది రాజీలేని పోరాటం. రాజకీయ చైతన్యవంతులమని చెప్పుకుంటూ కులం, ప్రాంతం పేరుతో ఓట్లు వేస్తున్నాం, మనకు సిగ్గుందా? అని అడిగిన దమ్మున్న ఏకైక పార్టీ లోక్‌సత్తా. కులవివక్షపై పోరును కేవలం దండోరాకే పరిమితం చేయకుండా వివక్ష నిర్మూలనకు నిజమైన సాధనాలు– నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను ప్రతి బిడ్డకూ అందించటాన్ని తన కీలక విధానాలుగా లోక్‌సత్తా అమలుచేస్తోంది. తమ స్వార్థం కోసం కులాల కురుక్షేత్రంలో ప్రజల్ని సమిధల్ని చేస్తున్న రాజకీయ, సామాజిక శక్తుల పీచమణచటం లోక్‌సత్తా విధానాలతోనే సాధ్యం.

### 55) ప్రతి ముగ్గురులో ఒకరు బీసీ – మహిళలకు 50శాతం ప్రాతినిధ్యం – ప్రత్యామ్నాయ మహిళా రిజర్వేషన్ బిల్లు రూపకల్పన

కుల రాజకీయాలు చేసే పార్టీలకు భిన్నంగా లోక్‌సత్తా నూతన ప్రజాస్వామ్య సంస్కృతితో 2009లో చేసిన ఎన్నికల టికెట్ల కేటాయింపులో ప్రతి ముగ్గురు అభ్యర్థులలో ఒక వెనకబడిన వర్గానికి (బీసీ) చెందినవారు. అణగారిన కులాల సంఘాల నేతలను పిలిపించి ప్రజల పట్ల ప్రేమ ఉన్న సమర్థ నాయకులను నాకివ్వండి, వారి కోసం అదనంగా ప్రచారం చేసి మరీ గెలిపించే ప్రయత్నం చేస్తాను అని చెప్పిన నేత జేపీ! అలాగే పార్టీ పదవుల్లో కూడా ప్రజాస్వామ్యయుతంగానే మహిళలకు 50శాతం, బలహీనవర్గాలకు దామాషా ప్రకారం అవకాశం కల్పించిన పార్టీ లోక్‌సత్తా. మహిళా

నాయకులు అత్యధికంగా లోక్‌సత్తా కమిటీల్లోనే కనిపిస్తారు. చట్టసభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లును ఆచరణాత్మకంగా మార్చి యోగేంద్ర యాదవ్, మధు కిష్వర్ వంటి వారితో కలిసి ప్రత్యామ్నాయ మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సత్తా రూపొందించింది. ఆ చట్టం అమల్లోకి రావటం కంటే ముందే.. మహిళలకు రాజకీయ పార్టీలు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేయటమే కాకుండా, తన వంతుగా పోటీకి ముందుకొచ్చిన మహిళలందరికీ ఎన్నికల్లో టికెట్లనిచ్చింది లోక్‌సత్తా.. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో ఈ ప్రజాస్వామిక సంస్కృతి లేకుండా అణగారిన కులాలను ఉద్ధరిస్తామని చెబుతున్న సాంప్రదాయ పార్టీల వారిని ఇంకెంతకాలం నమ్ముతాం?

### 56) ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై తొలి ప్రచారం జేపీదే

ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రకారం కేటాయించిన నిధుల్ని వేరే కార్యక్రమాలకు మళ్లించటం, దుర్వినియోగం చేయకుండా 2013లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆమోదించిన సబ్‌ప్లాన్ అమలును మొట్టమొదట ప్రారంభించింది జేపీయే. సబ్‌ప్లాన్ గురించి చిన్నచిన్న కరపత్రాలను రూపొందించి కూకట్‌పల్లి నియోజకవర్గం బస్తీల్లోని ఎస్సీ, ఎస్టీ వర్గాలవారితో కమిటీలు వేసి ప్రచారం చేయించటంతోపాటు ఆ నిధుల్ని అనవసర కార్యక్రమాలకు వృధా చేయకుండా విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు వంటి వాటికి మళ్లించే ప్రయత్నం చేశారు. రాజకీయ సంక్షోభం, ఎన్నికలు పేరుతో ప్రభుత్వం, అన్ని పార్టీలూ సబ్‌ప్లాన్‌ని పక్కనపడేసినా వీలున్నంత మేర జేపీ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కూకట్‌పల్లిలో అమలుకు ప్రయత్నించారు. రాష్ట్ర విభజన జరిగి కొత్త ప్రభుత్వాలు ఏర్పడినా ఇప్పటికీ ఆ సబ్‌ప్లాన్ గురించి పాలకులు పట్టించుకోవటం లేదు.

### 57) ద్వేషరహిత భాష, విధానాలు

ఒకరు గెలవాలంటే మరొకరు ఓడిపోవాలనే జీరో సమ్ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే కొత్త రాజకీయాన్ని లోక్‌సత్తా ప్రవేశపెట్టింది. ఒకరి ప్రయోజనాలు మరికొందరికి విరుద్ధమైనవైనా సరే లోక్‌సత్తా సమన్వయం చేయగలిగే భాష, విధానాలు లోక్‌సత్తాలో కనిపిస్తాయి. అందుకే ప్రపంచీకరణ సంక్షోభంలో లోక్‌సత్తా మరింత పెద్ద పరిష్కారంగా కనిపిస్తోంది.

### 58) ఢిల్లీ మాత్రమే ఈ దేశానికి కేంద్రబిందువు కాకూడదనే..

ప్రపంచ తొలి పదిమంది మేధావులలో ఒకరుగా విజ్ఞులు భావించే జేపీ సివిల్ సర్వీసు అధికారిగానే కొత్త భావాల్ని, ఆధునిక పరిష్కారాల్ని ప్రతిపాదించేవారు. అధికారాన్ని వికేంద్రీకరించి జిల్లా యూనిట్‌గా జిల్లా ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని

రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే ఆయనకు జేపీ సూచించారు. పూర్తి స్థాయి రాజకీయ సంస్కరణోద్యమానికి లోక్‌సత్తాను ఏర్పాటు చేసే సమయానికి కూడా ఆ భాష, విధానాలు ఈదేశానికి చాలా వింతగా, కొత్తగా ఉండేవి. ఆ సమయంలో ఢిల్లీ నుంచి పనిచేస్తే మీకు చాలా పేరు వస్తుంది, జాతీయస్థాయిలో వేగంగా ఎదగగలుగుతారు అని చాలామంది ప్రముఖులు జేపీకి సలహా ఇచ్చినా మనదేశం ఢిల్లీ కేంద్రంగా మాత్రమే పనిచేయకూడదనే భావనతో హైదరాబాద్‌ను తన కార్యక్షేత్రంగా జేపీ ఎంచుకున్నారు. భారత్‌కి ఢిల్లీ ఎంతో, హైదరాబాద్ కూడా అంతేనని అప్పటికీ, ఇప్పటికీ జేపీ చెప్పే మాట.

## 59) ఎన్నికల్లో గెలవటంలో వాళ్లు నెంబర్‌వన్, మార్పు తేవటంలో లోక్‌సత్తా నెంబర్‌వన్

ఎలాగోలా గెలిచినా ఎన్నికలలో గెలుపు గెలుపేనని ఇంకా అంగీకరిస్తున్నాం కాబట్టి, ఎన్నికలలో గెలిచిన వారంతా విజేతలు అనుకున్నా.. వాళ్లు కేవలం ఎన్నికల్లో గెలవటంలోనే నెంబర్‌వన్‌గా ఉన్నారు, ఈదేశంలో మార్పు తేవటంలో లోక్‌సత్తాయే నెంబర్‌వన్‌గా కొనసాగుతోంది.

## 60) విద్యుత్ సంస్కరణల్ని చేసి చూపిన లోక్‌సత్తా

విద్యుత్‌రంగంలో ప్రధాన సమస్యలుగా ఉన్న అవినీతి, పంపిణీ నష్టాల్ని అరికట్టటం ఎలాగో లోక్‌సత్తా స్వయంగా చేసి చూపింది. 2004లో పశ్చిమ గోదావరి జిల్లా కళ్లచెర్వు గ్రామంలో పైలట్ ప్రాజెక్టు ద్వారా విద్యుత్తు పంపిణీ నష్టాల్ని 30 శాతం నుంచి 16శాతానికి లోక్‌సత్తా తగ్గించింది. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో అవినీతి లేకుండా రైతులకు వెంటనే సరఫరా జరిగేలా చేసింది. విద్యుత్ రంగంలో వికేంద్రీకరణ చేపడితే పంపిణీలో నష్టాలు తగ్గి భారీగా ప్రజాధనం ఆదాకావటంతోపాటు అవినీతి తగ్గుతుందని, ప్రతి గ్రామంలో ఇద్దరకు ఉద్యోగాలు కూడా వస్తాయని, వ్యవసాయ ఫీడర్లను వేరు చేస్తే గ్రామాలకు 24గంటలూ విద్యుత్తు అంది ఉపాధి పెరుగుతుందని లోక్‌సత్తా అప్పటి ప్రభుత్వాలకు నివేదిక ఇచ్చింది. బీజేపీ అగ్రనేత అరుణ్‌జైట్లీ స్వయంగా లోక్‌సత్తా కార్యాలయానికి వచ్చి ఈ వివరాలను తెలుసుకున్నారు. ఆ తర్వాత గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోదీ అవే విద్యుత్ సంస్కరణల్ని అమలు చేయటం, ఆయన ప్రధాని కావటంలో ఆ విజయగాథలు కూడా కీలకపాత్ర పోషించటం తెలిసిందే.

## 61) ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని తెలిసినా ప్రజాప్రయోజనాల వైపే మొగ్గు

ప్రజాస్వామ్యంలో నాయకుడంటే ప్రజలు కోరుకున్నది చేయటం మాత్రమే కాదు, ప్రజలు తిరస్కరిస్తున్నా వారికి మంచిదైన పనిని చేయటం అని లోక్‌సత్తా భావిస్తుంది. అందుకు కొల్లేరు పోరాటాలు, రాష్ట్ర విభజన ఉద్యమాలు మచ్చుకు ఉదాహరణలు. కొల్లేరులో పర్యావరణం ముసుగులో ప్రజల పొట్టగొట్టే చర్యలకు ప్రభుత్వం, ప్రధాన

మీడియా పొల్పడినప్పుడు, ప్రజలూ కలిసిరానప్పుడు కూడా 2006లో కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి ముందు స్థానికులకు ఉపాధి కల్పించాలనే జేపీ వాదించారు. తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో పలుమార్లు తనను అడ్డుకున్నా, దుర్భాషలాడినా, రాజకీయంగా తీవ్ర నష్టం జరుగుతున్నా రాష్ట్ర విభజన విషయంలో సామరస్యంగా పరిష్కారానికే జేపీ కట్టుబడి వ్యవహరించారు.

## 62) సురాజ్యం పార్టీలకతీతం

దేశ ప్రయోజనాల పరిధిలో పార్టీలు రకరకాల విధానాలు, భావాలతో ప్రజలను ఆకట్టుకోవచ్చు. కానీ ఎన్నికలలో ఎలాగోలా గెలవటానికి దేశ ప్రయోజనాలకే నష్టంకలిగించే రీతిలో పార్టీలు శత్రుత్వభావంతో పనిచేయటం చివరికి ప్రమాదకర దేశ విచ్ఛిన్నానికి దారితీస్తుంది. అందుకే దేశ ప్రయోజనాలకు సంబంధించిన కొన్ని అంశాలలో ఉమ్మడి ఎజెండా కోసం లోక్‌సత్తా 2012లో సురాజ్య ఉద్యమాన్ని ప్రారంభించింది. అవినీతి కట్టడికి బలమైన లోకాయుక్తతోపాటు ప్రభుత్వ సేవల్ని హక్కుగా అందించే సిటిజన్ ఛార్టర్లు, జనం చేతికి అధికారాన్నిచ్చేలా రాష్ట్రబడ్జెట్‌లో 10శాతం స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్షంగా కేటాయింపు, ప్రతి ఒక్కరికీ ఎదిగే అవకాశాల కోసం అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటం తదితర అంశాల ఎజెండాతో సాగిన సురాజ్య ఉద్యమం ప్రజల్లో కళారూపాలు, కార్యక్రమాలతో చైతన్యం తేవటంతోపాటు పార్టీలను కూడా కలిపింది. దేశ ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన 'పార్టీల మధ్య ఏకాభిప్రాయ సాధన'లో లోక్‌సత్తా నిరుపమాన కృషి చేసింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలను సమన్వయం చేస్తూ రాజ్యరహిత వ్యవస్థను కలలుగంటున్నవారిని, రామరాజ్యాన్ని నిర్మించాలనుకునేవారిని సైతం కలపగలిగే భావజాలం, వేదికగా వ్యవహరించింది. అందుకే మైలురాళ్ల లాంటి అనేక చట్టాలను, రాజ్యాంగ సవరణల్ని పార్లమెంటులో ఒక్క సీటు కూడా లేకుండా, ప్రభుత్వంలో ఎటువంటి అధికారమూ లేకుండా సాధించింది. డిసెంబర్ 2012లో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద జేపీ చేసిన సురాజ్య దీక్షకు అన్ని పార్టీల అగ్రనేతలూ హాజరై మద్దతు తెలిపారు. కానీ వారిలో ఓట్లు, సీట్లు పొందినవారు ఇప్పటికీ ఆ ఎజెండాను ఆచరించలేకపోతున్నారు.

## 63) బ్లాక్‌మెయిల్ నిరాహారదీక్షలు చేయలేదు

నిరాహారదీక్ష బ్రిటీషు పాలననాటి అవశేషమేనని, ఇక మీదట రాజ్యాంగ పద్ధతుల్లో స్వదేశీ నేతల మీద పోరాడాలని రాజ్యాంగ రచన సమయంలో డా॥అంబేద్కర్ ప్రకటించారు. కానీ స్వతంత్రం వచ్చి ఇన్ని దశాబ్దాలయినా నిరాహారదీక్షను ఒక అసాధారణ నిరసన కార్యక్రమంగా, బ్లాక్‌మెయిలింగ్ ఎత్తుగడగా ఇప్పటికీ చాలామంది అనుసరిస్తున్నారు. లోక్‌సత్తా జేపీ 2012లో మూడు రోజుల సురాజ్య నిరాహార దీక్ష

చేసినప్పుడు అది ప్రభుత్వాన్నో మరొకరినో బ్లాక్‌మెయిల్ చేయటం కోసం కాదని, కేవలం ప్రజలలో ఆ ఎజెండాపై చైతన్యం తేవటం, పార్టీలను ఆ ఎజెండా కోసం పక్షపాత రాజకీయాలకతీతంగా కలపటం కోసమేనని స్పష్టంగా ప్రకటించారు. రాజ్యాంగం ఇచ్చిన భావప్రకటనా స్వేచ్ఛ, ఓటును మార్పునకు సాధనాలుగా వినియోగించుకోవాలని తన దీక్ష ద్వారా చాటిచెప్పారు.

## 64) కమ్యూనిస్టులు కలలుగన్న రాజ్యరహిత వ్యవస్థ లోక్‌సత్తా రాజకీయం

ప్రపంచాన్ని పరిశీలించటానికి మార్క్సిస్టు గతితార్కిక భౌతికవాదం ఎంతో విలువైనది. ఆ పరిణామ క్రమాన్ని మారుతున్న పరిణామాలు, మానవ మనస్తత్వం నేపథ్యంలో సక్రమంగా వివరించలేకపోయినా చివరికి ప్రభుత్వం లేని రాజ్యవ్యవస్థ ఏర్పడుతుందని ఎక్కువమంది మార్క్సిస్టులు కలలుగంటుంటారు. తాను పైకి కనిపించకుండా ప్రజలందరూ కలిసిమెలిసి సుఖసంతోషాలతో బతికేలా చేసేదే అత్యుత్తమ ప్రభుత్వం అని లోక్‌సత్తా చెబుతుంది. లోక్‌సత్తా రాజకీయంలో ప్రభుత్వం నామమాత్రమే, సాంకేతికమే. అందుకే కమ్యూనిస్టులు, క్యాపిటలిస్టులలోని లోపాల్ని పరిహరించి వారు కలలుగంటున్న రాజ్యరహిత, స్వేచ్ఛాయుత సమాజాన్ని నిర్మించటం లోక్‌సత్తా రాజకీయంతోనే సాధ్యం.

## 65) పార్టీలో ప్రజాస్వామ్యానికి అంతర్గత ఎన్నికలు

ఓ డేవిడ్ కామెరాన్‌లా, ఓ బరాక్ ఒబామాలా ప్రతిభ ఉంటే చకచకా ఏ పదవికైనా ఎదిగే అవకాశాలు మన రాజకీయ పార్టీల్లో ఉంటే లోక్‌సత్తా ఏర్పడాల్సిన అవసరం పెద్దగా ఉండేది కాదేమో. కానీ మనదేశంలో పార్టీలు సొంత ఎస్టేట్‌లుగా మారి, పార్టీల కోసం దేశభవిష్యత్తును నాశనం చేస్తుంటే లోక్‌సత్తా రావాల్సి వచ్చింది. లోక్‌సత్తాను ప్రజల ఆస్తిగా నిర్మించటానికి పార్టీలో ఎవరైనా ఏ స్థాయికైనా ఎదగటానికి వీలుగా అంతర్గత ఎన్నికల్ని నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 2008లో పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ స్వయంగా పోటీ చేసి, ప్రత్యర్థి అభ్యర్థులు పోటీ చేయటాన్ని కూడా ప్రోత్సహించారు. ఆ ఎన్నికల్లో జేపీ ఎన్నికైనా, తాను పోటీచేయటం కేవలం మార్గం చూపటానికేనని 2010లో మళ్లీ పోటీచేయటానికి తిరస్కరించారు. తాను బరిలో ఉంటే పార్టీలో నాయకత్వం ఎదగటం కష్టమని ఇతరులను ప్రోత్సహించారు. ఇప్పటికీ ఈ ప్రజాస్వామ్యానికి దరిదాపుల్లోకి ఓట్లు, సీట్లు పొందుతున్న ఏ పార్టీ రాలేకపోయాయి.

## 66) 2లక్షల ఎకరాలకు సాగునీరు

లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ మంచి రాజకీయం తరపున ఎన్నికలలో గెలవలేకపోవటానికి ఆయన వ్యక్తిగత సమర్థతకు ముడిపెట్టేవారు ఒక్కసారి ఆయన బ్యూరోక్రసీ చట్రాన్ని ఛేదించి సాధించిన విజయాల్ని, 2017లో ఫ్రాన్స్‌లో లోక్‌సత్తా

తరహాలో మే(క్రాన్ సాధించిన విజయాల్ని చూడాలి. ఎకరాకు కేవలం రూ.2000తో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించే మైనర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల వైపు ప్రకాశం జిల్లాలో రైతుల్ని పెద్దఎత్తున మళ్లించారు. దీనివల్ల రెండున్నరేళ్లలో 453 మైనర్ ఇరిగేషన్ పథకాలు, 2800 ఉపరితల బోరుబావులు, 70 మళ్లింపు పథకాలు రూపు దిద్దుకున్నాయి. ఇన్నేళ్లయినా ఆనాటి పథకాలు ఇప్పటికీ విజయ వంతంగా నడుస్తున్నాయి. దాంతోపాటు, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి గోదావరి డెల్టాలో మురుగుకాల్వ వ్యవస్థను ప్రక్షాళన, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు ఉద్యోగాలిప్పించి పరిహారం చెల్లింపులో ప్రజలకు లాభం చేకూర్చే భూ సేకరణ విధానానికి నాందిపలకటం, కాకినాడ పోర్టు ప్రాంతం అభివృద్ధి, రుణ సహకార రంగ పునరుద్ధరణ, సభ్యులకే పూర్తి అధికారాన్నిచ్చే 1995నాటి 'మ్యాక్స్' సహకార చట్టం, హైదరాబాద్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్కు అభివృద్ధి, పోర్టు నగరాల అభివృద్ధి, విద్యుత్‌రంగ సంస్కరణకు కొత్త విధానాన్ని రూపొందించటం, ఎంటర్‌ప్రెన్యూర్‌లకు ఇండ స్ట్రియల్ ఎస్టేట్‌ల సారథ్యం, సాగునీటి యాజమాన్యంలో రైతులను భాగస్వాములను చేయటం, ప్రభుత్వరంగ సంస్థల పునర్ని ర్మాణం, పాఠశాలల నిర్వహణలో తల్లిదండ్రుల సాధికారికతకు చట్టం చేయటం.. ఇలా స్వతంత్ర భారతదేశంలో ఏ కలెక్టర్ సాధించనన్ని విజయాల్ని సాధించిన జేపీ తన సామర్థ్యాన్ని మళ్లీ నిరూపించుకోనక్కర్లేదు. అలాగే లోక్‌సత్తా తరహాలోనే ఉదారవాద ప్రజాస్వామిక వాదనలతో 'ద రిపబ్లిక్ ఎన్ మార్చ్' (ఎల్ఆర్ఈఎం) పార్టీని స్థాపించి.. లోక్‌సత్తా తరహాలోనే ఓటు బ్యాంకులు, పటిష్ట సంస్థాగత నిర్మాణం లేకున్నా మే(క్రాన్ ఫ్రాన్స్ అధ్యక్షుడు కాగలిగారు. రిపబ్లిక్ ఎన్ మార్చ్ విధానాలు నచ్చి కేవలం 14 నెలల్లో ఆ పార్టీని కూడా ప్రజలు గెలిపించారు. కానీ లోక్‌సత్తా నచ్చింది, జేపీని మెచ్చాం అంటూ మనమెందుకు ఓట్లు వేయలేదు? మా ఓట్లు లోక్‌సత్తా లాగేసుకుంది అంటూ ఏదో ఒక పార్టీ ఆరోపణలు చేస్తే లోక్‌సత్తాను ఓడించటం ఏం ప్రజాస్వామ్యం? ఏ పార్టీ, ఏ అభ్యర్థి అన్నది ముఖ్యం కాదు.. మంచి చేసే పార్టీకే, అభ్యర్థికే ఓటు వేస్తాం అన్న ఫ్రాన్స్ ప్రజల్లాగా ఆలోచించటం మానేసి లోక్‌సత్తా మీద ఎదురు ఆరోపణలు చేయటం తగదు. జేపీకి సర్టిఫికెట్లివ్వటం ఆపి, మంచి రాజకీయం కోసం దీర్ఘకాలిక పోరాటాన్ని వేగవంతం చేయటం ఎలా అని ఆలోచిస్తే మేలు.

### 67) చరిత్రకు సరైన పక్షాన ఉన్నాం

వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను కల్పించటం, నివారించదగ్గ బాధలను తొలగించటం లోక్‌సత్తా లక్ష్యం. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా నిరూపితమైన ఆధునిక హేతుబద్ధ విధానాలతో ప్రజలను చైతన్యపరుస్తూ భాగస్వాముల్ని చేస్తూ పోరాడుతోంది. లక్ష్యం, వేదిక, మార్గం అన్నీ సక్రమంగా ఉండటం తప్ప మార్పునకు

వేరే మార్గం లేదు. అవి ఎన్నికలైనా, మరోటైనా ఇదే మార్పు తెచ్చే సరైన పంథా. అందుకే గెలుపోటములతో సంబంధం లేకుండా చరిత్రకు సరైన పక్షాన ఉన్నామని సగర్వంగా ప్రకటించే ఏకైక పార్టీ లోక్‌సత్తా.

### 68) రాజకీయ అవినీతికి కళ్లెం వేసే దామాషా ఎన్నికల పద్ధతి కోసం..

ఒక్క ఓటుతో గెలుపోటములు తారుమారయ్యే ఎన్నికల వ్యవస్థ, ఓటును సద్వినియోగం చేసుకోవనివ్వని అవిద్య, పేదరికం, వివక్ష, కులం, మతం, ప్రాంతం వంటి భావోద్వేగాలు, అవినీతి ప్రభుత్వోద్యోగులు మనదేశంలో ఎన్నికలలో డబ్బు ప్రవాహాన్ని పెంచుతున్నాయని, రాజకీయ అవినీతిని మూలమని, దీనికి విరుగుడుగా దామాషా ఎన్నికల పద్ధతిని లోక్‌సత్తా ప్రతిపాదించింది. ఓట్ల శాతాన్ని బట్టి సీట్లు ఇచ్చేలా మన పరిస్థితులకు తగ్గ దామాషా ఎన్నికల పద్ధతి కోసం లోక్‌సత్తా చేసిన ప్రయత్నాలు 2004లో కమ్యూనిస్టులు కలిసిరాకపోవటం వల్ల తృటిలో విఫలమయ్యాయి. ఇప్పుడు వారూ కలిసివస్తున్నారు. అందరినీ కలిపి దామాషా ఎన్నికల వ్యవస్థను, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి ఇతర ఎన్నికల సంస్కరణలను తీసుకురావటానికి వీలున్న ప్రతి అవకాశాన్నీ లోక్‌సత్తా వినియోగించుకుంటోంది.

### 69) లోక్‌సత్తా పేటెంట్ పదాలు

ఒక నూతన భావజాలాన్ని తయారుచేసి తానే వేదికను నిర్మించి తానే ప్రచారం చేసిన నాయకులు ప్రపంచ చరిత్రలో చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటివారిలో లోక్‌సత్తా జేపీ ఒకరు. బర్మాలో ఆంగ్‌సాన్ సూచీలాంటి గొప్ప ప్రజాస్వామ్యయోధురాలికి కూడా వెనకన కొంత కుటుంబ నేపథ్యం కలిసివచ్చింది. జేపీ బహుముఖ సామర్థ్యంతో లోక్‌సత్తా రాజకీయ ఉద్యమాన్ని నిర్మించారు. అందులోని ప్రతి అక్షరాన్నీ స్వయంగా రాసుకున్నారు. అనేక కొత్త భావజాల పదాల్ని, వాక్యాల్ని రూపొందించారు, వాడుకలోకి తెచ్చారు. ప్రజలే ప్రభువులు–పాలకులు సేవకులే, కొత్త తరానికి కొత్త రాజకీయం, వ్యక్తిసుఖాన్ని సమాజహితాన్ని సంధానం చేయటం, మంచిరాజకీయాన్ని మించిన పవిత్ర వ్యాసంగం లేదు, చెడ్డ రాజకీయానికి విరుగుడు మరింత మంచి రాజకీయమే వంటివి లోక్‌సత్తా పేటెంట్ స్థాయిలో ప్రాచుర్యం పొందాయి.

### 70) రాజకీయాల నిర్వచనాన్ని మార్చిన లోక్‌సత్తా

రాజకీయమంటే ఎన్నికలలో పోటీ మాత్రమే అనుకునే నిర్వచనాన్ని లోక్‌సత్తా మార్చింది. మహాత్మాగాంధీ చెప్పినట్టు, మనం చేసే ప్రతి పనీ రాజకీయంతోనే ముడిపడి ఉంటుందికాబట్టి, ప్రతి సామాజిక కార్యక్రమమూ రాజకీయమేనన్నది లోక్‌సత్తా విధానం. అందుకే చాలా తేలిగ్గా అన్ని సంస్థలతో, పార్టీలతో ఎజెండా ప్రాతిపదికన కలిసి పనిచేయగలుగుతుంది. అన్నిటికంటే వేగంగా మార్పును ప్రత్యక్ష రాజకీయాల ద్వారానే

సాధించగలం కాబట్టి రాజకీయ పార్టీగా కూడా లోక్‌సత్తా రూపుదిద్దుకుంది. ప్రత్యక్ష రాజకీయాలలో కూడా ఎన్నికలలో ఆశించిన 15–20శాతం ఓట్లు రావటం లేదు కాబట్టి ఎన్నికలకతీతంగా ప్రభావం చూపించే పార్టీగా కొనసాగుతోంది. పరోక్ష రాజకీయాలు, ప్రత్యక్ష రాజకీయాలు, ఎన్నికలు లేని ప్రత్యక్ష రాజకీయాలు.. ఇలా రాజకీయాల్ని వేగంగా లక్ష్యాన్ని సాధించే క్రమంలో లోక్‌సత్తా పునర్‌నిర్వచించింది.

### 71) మద్యనియంత్రణోద్యమం

మద్యాన్ని నిషేధించే ఆకర్షణీయ ప్రచారోద్యమంతో అధికారంలోకి రావటం తేలికగానీ అది ప్రజలకు చివరికి నష్టమే చేస్తుందని గుర్తించిన లోక్‌సత్తా తెలుగునాట కఠిన మద్యనియంత్రణోద్యమానికి 2007లో శ్రీకారం చుట్టింది. బెల్టుషాపులనూ, ప్రజలు డిమాండ్ చేసిన చోట అధికారిక మద్యం షాపులనూ తొలగించాలంటూ జేపీ గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గ్రామం దళితవాడ నుంచి చేపట్టిన మూడు రోజుల పాదయాత్ర ఉద్యమానికి ఎంతో ఊపునిచ్చింది. బెల్టుషాపులు లేవని మొదట బుకాయించిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆయన సొంత నియోజకవర్గం పులివెందులలో బెల్టు దుకాణాలను చూపించాక ఒప్పుకోక తప్పలేదు. సిటిజన్ అరెస్టుల ద్వారా బెల్టుషాపుల నిర్వాహకులపై పోరాటం, మద్యనియంత్రణకు పరిమిత మద్యం దుకాణాల ఏర్పాటు, గ్రామాలలో మహిళల కమిటీలకే మద్య నియంత్రణాధికారాలు వంటి డిమాండ్లతో రాజకీయ పోరాటం చేసినా ప్రజల్లో చైతన్యం వచ్చిందిగానీ ఎన్నికల్లో మద్యం పంచిన పార్టీలే గెలవటంతో ఇంకా ఆ లక్ష్యం కోసం పోరాటం సాగుతూనే ఉంది.

### 72) ఆదాయవ్యయ వివరాలను ప్రజలముందుంచిన తొలిపార్టీ లోక్‌సత్తా

పార్టీల విరాళాలకు పన్ను మినహాయింపు చట్టాన్ని 2003లో లోక్‌సత్తా సాధించినా ఇంకా రాజకీయ పార్టీలు దొంగ లెక్కలే చెబుతున్నాయన్నది వాస్తవం. ఇలాంటి పరిస్థితుల్లో 2006లో రాజకీయ పార్టీగా వచ్చిన లోక్‌సత్తా తన ఆదాయవ్యయ వివరాలను ఆడిట్ చేయించి 2007 నుంచి వెబ్‌సైట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రజల ముందుంచింది. ఇలా విరాళాలు, ఖర్చుల వివరాలను అందించిన తొలి పార్టీ భారత్‌లో లోక్‌సత్తాయే. ఆ తర్వాత ఏటా వరసగా లోక్‌సత్తా అందిస్తూండటంతో ఇటీవల అన్ని పార్టీలూ అనుసరిస్తున్నాయి. అయితే ఇప్పటికీ ఆ పార్టీలు హుండీ విరాళాల్ని, నల్లడబ్బును తీసుకుంటూ లెక్కలేని ధన రాజకీయం చేస్తున్నాయని వారి ఎన్నికల ఖర్చును చూస్తే చిన్న పిల్లలకు కూడా అర్థమవుతుంది.

### 73) రిజర్వేషన్లపై విధానమున్న ఏకైక ఉద్యమం, పార్టీ లోక్‌సత్తా

రిజర్వేషన్లను కొనసాగించాలనో, తొలగించాలనో, వాటిని ఉపయోగించుకుని రాజకీయ లబ్ధి పొందాలనో తప్ప వాటిపై చర్చ చేసి ప్రజల మధ్య చిచ్చును ఆర్పే

ప్రయత్నాన్ని ఈదేశంలోని ఏ రాజకీయ ఉద్యమం, పార్టీ చేయటం లేదు. కాపు రిజర్వేషన్లు కావచ్చు, గుజ్జర్లు–మీనాల వివాదం కావచ్చు, పాటీదార్ల ఉద్యమం కావచ్చు, దళిత క్రైస్తవులకు కోటా కావచ్చు.. రిజర్వేషన్లపై నిర్దిష్టమైన సంస్కరణలను లిఖితపూర్వకంగా ప్రకటించిన ఏకైక ఉద్యమం, పార్టీ లోక్‌సత్తా. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్ల కొడుకులకు రిజర్వేషన్లు ఇవ్వకూడదని, పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పోటీ పరీక్షల్లో అదనంగా కొన్ని మార్కుల్ని కలపాలని, ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించాలని రిజర్వేషన్ల సంక్షోభానికి పరిష్కారాలుగా లోక్‌సత్తా ప్రతిపాదించింది. అదనపు మార్కులు కలపటానికి కొన్ని గీటురాళ్లను సూచించి వీటిపై చర్చను ఆహ్వానించింది. ఉష్ట్రపక్షుల్లా తలదాచుకున్న ఈ కులరాజకీయాల పార్టీలకు ఇప్పటికీ రిజర్వేషన్ల చిచ్చును పరిష్కరించే సత్తా లేదు.

## 74) ఉచితాలపై సకాలంలో స్పందించింది లోక్‌సత్తాయే

ఆహారానికి అవసరమైన బియ్యం వంటి వాటిని ఉచితంగా ఇస్తామనే ఎన్నికల హామీలను చర్చించవచ్చని, కానీ కలర్ టీవీలు, మిక్సీలు, గ్రైండర్లు వంటి వాటి ప్రజలకు మేలు జరగకపోగా ప్రలోభాలతో ఓట్లు వేసే అవకాశముందని, విద్య, ఆరోగ్యం వంటి కనీసావసరాలకు నిధులు తగ్గుతాయని, తక్షణం చర్య తీసుకోవాలని కోరుతూ 2008లో కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెస్ హామీలపై, 2009లో తెలుగుదేశం హామీలపై ఎన్నికల సంఘానికి జేపీ లేఖలు రాశారు. ఆనాడు ఎన్నికల సంఘం స్పందించి ఉంటే 2016లో తమిళనాడులో పార్టీలు ఇష్టమొచ్చినట్టు హామీలిచ్చేవి కావు. ప్రజలను మత్తులోకి నెట్టే పనులు కాకుండా వారి జీవితాల్ని బాగు చేసే రాజకీయం ఎజెండాగా మారేది.

## 75) బహిరంగ సభలకు జనాలను తరలించని రాజకీయ సంస్కృతి

గర్జనలు, గాండ్రింపుల పేరుతో ప్రజలను డబ్బులిచ్చి, ఇతరత్రా ప్రలోభపరిచి గొర్రెల్లా సభలకు తరలించి గొప్ప సభలుగా మీడియాలో ఖ్యాతి పొందే ప్రయత్నాన్ని లోక్‌సత్తా ఏనాడూ చేయలేదు. ప్రజలకు సమాచారమిచ్చి, వారు తేలిగ్గా రాగలిగేలా, మిగిలిన ప్రజలకు అంతరాయం లేకుండా ఉండేలా చిన్నచిన్న గుంపులతో సభలను నిర్వహించటం లోక్‌సత్తా సంస్కృతి. సమాచార ప్రసార మాధ్యమాలు విస్తృతంగా పెరిగిన తరుణంలో సభలకు ప్రజలు పెద్దసంఖ్యలో రావాలని ఆశించటం కూడా సమంజసం కాదు కాబట్టి ఎక్కడ ప్రజలు సౌకర్యవంతంగా గుమిగూడగలిగితే అక్కడ మాట్లాడటం లోక్‌సత్తా నాగరిక ప్రజాస్వామ్యం. కొన్ని సందర్భాలలో ప్రజలను సమీకరించటానికి వారికి ఆహారపదార్థాలేకాకుండా అదనపు సౌకర్యాలు కల్పించారని పార్టీ నేతలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు జేపీ స్వయంగా వారిని కోప్పడ్డారు. వారి మీద అదనపు ఆర్థికభారం పడకుండా కార్యక్రమాలను కుదించుకుని సామాజిక మీడియా మీద ఎక్కువ

ఆధారపడటం వంటి ప్రత్యామ్నాయాలను అనుసరిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రభావం చూపగలమనుకున్న కార్యక్రమాలకే హాజరవుతున్నారు. ఎవరిది గొప్ప ప్రజాస్వామిక నాయకత్వమో ఇకనైనా చర్చిద్దామా?

### 76) ఆరోగ్యశ్రీ డొల్లతనాన్ని బైటపెట్టిన లోక్‌సత్తా

లోక్‌సత్తా మేనిఫెస్టోలోని అందరికీ ఆరోగ్యం, విద్య విధానాల నుంచి వైఎస్ రాజశేఖర రెడ్డి తెలివిగా ఆరోగ్యశ్రీని, ఫీజు రీఇంబర్స్‌మెంట్ పథకాలను తయారుచేశారు. ప్రజలకు మంచి ఎవరు చేసినా సంతోషమేగానీ, ఇదే గొప్ప ఆరోగ్యపథకం, ఇదే గొప్ప విద్య అని చెప్పి ప్రజలను మభ్యపెట్టటం మాత్రం క్షమార్హం కాదు. అందుకే కొందరికి, కొన్ని జబ్బులకు, అది కూడా జబ్బు ముదిరాక కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయిస్తూ అదే ప్రజారోగ్యపథకమంటే ప్రజలు ఎలా అనారోగ్యానికి బలవుతున్నారో, ఆరోగ్యశ్రీ కార్పొరేట్ ఆసుపత్రులకు కాసుల పథకంగా ఎలా మారిందో లోక్‌సత్తా గణాంకాలతో సహా వెల్లడించింది. ఆరోగ్యశ్రీకి వ్యతిరేకంగా మాట్లాడటమంటే ప్రజాద్రోహమని వైఎస్ బహిరంగంగా ప్రకటించినా, ఇతర పార్టీలు కూడా ఆ పథకానికి ప్రజాదరణను చూసి మౌనం వహించినా లోక్‌సత్తా తన విమర్శలను ఆపలేదు. చివరికి ఆరోగ్యశ్రీ వచ్చినా ఆంధ్రప్రదేశ్ అనారోగ్యప్రదేశ్‌గానే ఉందని, ఫీజు రీఇంబర్స్‌మెంట్ రాజకీయ నాయకుల కాలేజీలకు నిధుల్ని తప్ప విద్యార్థులకు మంచి ఉద్యోగాలను ఇవ్వలేకపోయిందని రాజకీయ వ్యవస్థ, పౌరసమాజం, ప్రజలు కూడా అంగీకరిస్తున్నారు.

### 77) జిల్లా ప్రభుత్వాల ఆవిష్కరణ

జిల్లా ప్రభుత్వాల ఏర్పాటుకు ఐఏఎస్ అధికారిగా ఉన్నప్పటి నుంచీ ప్రయత్నిస్తున్న జేపీ లోక్‌సత్తా పార్టీని ఏర్పాటుచేశాక 2009లో జిల్లా ప్రభుత్వాలను లాంఛనంగా ఆవిష్కరించారు. కలకత్తా కమిషనర్‌గా అసాధారణ ప్రభావంతో స్థానిక ప్రభుత్వాల సాధికారతకు సంకేతంగా నిలిచిన సుభాష్ చంద్రబోస్ జన్మదినోత్సవం జనవరి 23ని జిల్లా ప్రభుత్వాల దినోత్సవంగా ప్రకటించారు. కూకట్‌పల్లిలో జిల్లా ప్రభుత్వాలను ప్రకటిస్తూ తెలుగునాట అన్ని జిల్లాల పతాకాలను కూడా ఆవిష్కరించారు. స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు ఇచ్చి, తలసరి రూ.1000 – 2000 కేటాయింపుతో వాటిని జిల్లా ప్రభుత్వాల పరిధిలోకి తేవటం, పాలనకు, రాజకీయానికి అంతిమంగా జిల్లాను యూనిట్‌గా చేయటం జిల్లా ప్రభుత్వాల ఏర్పాటు లక్ష్యం. మహాఅయితే కొత్త జిల్లాలను ఏర్పాటు చేయటమేతప్ప జిల్లా ప్రభుత్వాల ఏర్పాటుకు మాత్రం సాంప్రదాయ పాలకులకు ఇంకా చేతులు రావటం లేదు.

### 78) కృష్ణా కరకట్టలబలోపేతానికి నిధులు తేగలిగాం

2009లో కృష్ణా నదికి 25లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు వరద నష్టం

నివారణ చర్యల్లోనే కాకుండా సహాయపునరావాస చర్యల్లో కూడా లోక్‌సత్తా పాలుపంచుకుంది. బాధితులకు ఆహారపదార్థాలు, మందులు, దుస్తులు, మంచినీరు వంటి తక్షణావసరాల్ని అందించటంతోపాటు వరద ధాటికి దెబ్బతిన్న తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్రలోని నాలుగు గ్రామాలను (కేశవరం, దొడ్డిపాడు, దక్షిణ చిరువోలులంక, వెంకట్రాజుపాలెం) దత్తత తీసుకుని అక్కడ పాఠశాలను పునర్నిర్మించటం, రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు, చిన్న ఎత్తిపోతల పథకం ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మద్యనియంత్రణ వంటి కార్యక్రమాలను చేశారు. వరద నష్టంపై ప్రధానమంత్రిని కలిసి, కేవలం 10-11 క్యూసెక్కుల వరదను మాత్రమే తట్టుకునే అవకాశమున్న కృష్ణా కరకట్టల మరమ్మతుకు నిధులను జేపీ సాధించారు. పంట సీజన్లకు ముందుగానో ఆలస్యంగానో వస్తున్న వాతావరణ మార్పులపై అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

### 79) ఓపెన్ ప్రైమరీలు

రాజకీయ పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థినే ఎన్నుకోవాల్సిన అవసరం లేకుండా ఆ పార్టీలోనే మెరుగైన ఎన్నుకునే అవకాశాన్ని కల్పించేందుకు పరిణతి చెందిన ప్రజాస్వామిక దేశాలలో ఉన్న ఓపెన్ ప్రైమరీ పద్ధతిని లోక్‌సత్తా సూత్రప్రాయంగా కొన్ని ఎన్నికలలో అమలుచేసింది. పశ్చిమ గోదావరి జిల్లా ఉంగుటూరు జడ్పీ ఎన్నికలో, పటాన్‌చెరు అసెంబ్లీ స్థానంలో ఓపెన్ ప్రైమరీ ద్వారా లోక్‌సత్తా అభ్యర్థుల ఎంపిక జరిగింది. కానీ సాధారణ ఎన్నికల్లోనే ప్రజాబలం తగినంత లేకపోవటం వల్ల ఓపెన్ ప్రైమరీ ప్రయత్నం నుంచి లోక్‌సత్తా వెనక్కి తగ్గాల్సి వచ్చింది.

### 80) మేయర్ ఎన్నికలో పాల్గొనని జేపీ

పంచాయతీలు, మునిసిపాలిటీలలో ఎన్నికైన ప్రభుత్వాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలాగా స్వతంత్ర ప్రతిపత్తి ఉండాలన్న లోక్‌సత్తా విధానానికనుగుణంగా 2009లో మేయర్ ఎన్నిక ఓటింగ్‌లో పార్టీ కూకట్‌పల్లి శాసనసభ్యునిగా జేపీ పాల్గనలేదు. మేయర్ ఎంపికలో కార్పొరేటర్‌లకు తప్ప శాసనసభ్యులకు ఎటువంటి పాత్రా ఉండదని స్పష్టం చేయటంతోపాటు మేయర్‌లకు ప్రత్యక్ష ఎన్నిక జరగాలని డిమాండ్ చేశారు. విదేశాల్లోనే మేయర్లను నెత్తికెత్తుకోవటం తప్ప మనదేశంలో మేయర్లను ఉత్సవ విగ్రహంలాగా చూసే పార్టీలే ఎన్నికవుతుండటంతో లోక్‌సత్తా చెబుతున్న మార్పులు వాయిదాపడుతున్నాయి.

### 81) 14 ఎఫ్‌ని తొలగించాం

రాష్ట్ర విభజనకు ఆజ్యం పోసిన హైదరాబాద్ ఫ్రీజోన్ వివాదాన్ని పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నం ప్రారంభించిన లోక్‌సత్తా 14 (ఎఫ్) క్లాజును తొలగించేలా

చేయగలిగింది. 14 ఎఫ్‌ని తొలగిస్తే రాజకీయాల నుంచి విరమిస్తాం, సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేద్దాం, 14 ఎఫ్‌ని తొలగించటం తెలంగాణ పట్ల పక్షపాతం వంటి పసలేని వాదనలు, ఆరోపణలచ్చినా ప్రజల్లో ఆందోళనలను చల్చార్చి విజ్ఞతతో కూడిన పరిష్కారం కోసం జేపీ ఆ బృహత్కార్యాన్ని కేంద్రంలో ఎటువంటి అధికారమూ లేకుండానే సాధించారు. జేపీ కృషితో హైదరాబాద్ పోలీసు రిక్రూట్‌మెంట్ జోనల్ పరిధిలోకి వచ్చేలా 1975 రాష్ట్రపతి ఉత్తర్వులోని 14 ఎఫ్‌ని తొలగించారు.

**82) తెలంగాణపై అన్ని ప్రాంతాల్లో ఒకే మాట**

రాష్ట్ర విభజనకు 2009లో తెలంగాణ ఉద్యమం మొదలయ్యాక అసాధారణ రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నా ఏరోజూ లోక్‌సత్తా మాట మార్చలేదు. అధికార, ప్రతిపక్ష పార్టీల్లాగా ప్రాంతానికో మాట చెప్పలేదు. నది ఇవతల, నది ఆవల ఒకే మాట, ఒకే విధానం చెప్పింది. పార్టీలో గందరగోళం చెలరేగినా ఇరు ప్రాంతాల నాయకులనూ కలిపి కమిటీలు వేసి పరిష్కరించుకోమనే జేపీ చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలు కూడా ఇదే రీతిలో నిబద్ధతతో వ్యవహరించినా, రాష్ట్రం ఏర్పాటు మౌలికమైన విషయమంటూ భావజాల వైఫల్యాన్ని ప్రదర్శించాయి. కానీ లోక్‌సత్తా నిబద్ధతతోపాటు రాష్ట్రం ఏర్పాటు ఉపద్రవమూ కాదు, సర్వరోగ నివారిణీ కాదు అని భావజాల ప్రామాణికతను కూడా ప్రదర్శించింది.

**83) ఆంధ్రప్రదేశ్‌కు ఏం కావాలో అడిగింది లోక్‌సత్తాయే**

రాష్ట్రం విడిపోవాలనే వైఖరి తీసుకుని ఎన్నికల్లో ఓట్లు, సీట్లు పొందిన పార్టీలు ప్రాంతాలవారీగా చీలిపోయి అధ్యక్షులు పలాయనం చిత్తగించినా, ఆదాయమున్న హైదరాబాద్‌తో తెలంగాణ విడిపోతే ఆంధ్రప్రదేశ్‌కు ఏం కావాలో అసెంబ్లీలో అడిగినది, ప్రాంతాలకతీతంగా మాట్లాడింది జేపీ ఒక్కరే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికీ కష్టంగానీ, రాయలసీమకు ప్రత్యేక హోదా ఇవ్వటం సాధ్యమని, ఈ హోదా వస్తే మహారాష్ట్ర నుంచి కన్యాకుమారి వరకు పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జేపీ ప్రతిపాదించారు. దాంతోపాటు వెనకబడిన ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు కూడా ప్రత్యేక పన్ను రాయితీలిచ్చి పారిశ్రామికాభివృద్ధితో యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు వచ్చేలా చేయాలని జేపీ కోరారు. హైదరాబాద్ అండ లేదు కాబట్టి, ఈ ప్రాంత ప్రజల అభిప్రాయాలతో సంబంధం లేకుండా రాష్ట్రాన్ని కేంద్రమే విడదీసింది కాబట్టి రాష్ట్రం రెవిన్యూలోటును కోలుకునేంత వరకూ కేంద్రమే భర్తీ చేయాలన్నారు. నాయకుడంటే ప్రజల ఆకాంక్షలను గౌరవించటంతోపాటు గాలిమరలా కాకుండా దిక్సూచిలా వ్యవహరించాలని ఆచరణలో చూపారు.

**84) ప్రత్యేక హోదా సాధనకు తెలుగు భవిత కార్యక్రమం**

రాష్ట్రం విడిపోయినా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల్ని నెరవేర్చకపోతుండటంతో

2015లో తెలుగు భవిత పేరుతో రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో, హైదరాబాద్‌లో జేపీ దీక్షలు, రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహించారు. రాష్ట్ర విభజన సమస్యను రాష్ట్రంలోనే, అసెంబ్లీ ద్వారానే పరిష్కరించుకుని కేంద్రానికి అమలు బాధ్యతను మాత్రమే అప్పచెప్పి ఉంటే ఈ పరిస్థితి తప్పేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు పలాయనం చిత్తగించి ఆడిన నాటకంలో ప్రజలు, కార్యకర్తలు సమిధలయ్యారని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రెవిన్యూలోటును పూర్తిగా కేంద్రమే భర్తీ చేయాలని, రాష్ట్రానికి కార్పొరేట్, సెంట్రల్ ఎక్సయిజ్, పన్ను రాయితీలున్న ప్రత్యేక హోదా ఇవ్వాలని, పోలవరాన్ని నాలుగేళ్లలో పూర్తి చేసి మిగులు జలాల మీద ఆధారపడిన రాయలసీమ, తెలంగాణ ప్రాజెక్టులకు మిగులు జలాలివ్వాలని, విభజన చట్టంలో ప్రకటించిన జాతీయ సంస్థల్ని వేగంగా ఏర్పాటు చేయటం తెలుగు భవిత డిమాండ్లు. ఏపీకి ఒక రాష్ట్రంగా ప్రత్యేక హోదా ఇవ్వలేకపోతే జిల్లాను వెనకబాటుతనానికి యూనిట్‌గా పరిగణించి వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలని జేపీ ప్రతిపాదించారు. ఇలా దేశవ్యాప్తంగా 100 వెనకబడిన జిల్లాలకు ప్రత్యేకహోదా రాయితీలిచ్చే ప్రతిపాదనను తెలుగు రాష్ట్రాలు ముందుకు తీసుకెళ్తే, ఇతర రాష్ట్రాలూ అంగీకరిస్తాయన్నారు. కానీ రాష్ట్ర రెవిన్యూ లోటు ఎంతో ప్రకటించకుండానే రహస్యంగా వ్యవహరించిన చంద్రబాబు ప్రభుత్వం, కేవలం రాజకీయ లాభాలే చూసుకుంటున్న ప్రతిపక్ష పార్టీ కలిసిరాకపోవటం, తెలంగాణ ప్రభుత్వం కూడా ఉత్తర తెలంగాణ హోదాపై ఆసక్తి చూపకపోవటంతో ఆచరణసాధ్యమైన ఆ పరిష్కారం అమలుకు నోచుకోలేదు. 100 వెనకబడిన జిల్లాలకు ప్రత్యేకహోదా ప్రతిపాదనను జేపీ నీతి ఆయోగ్‌కు కూడా అందించారు. ఇటీవల నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను చేపట్టాలని నిర్ణయించిందిగానీ, లోక్‌సత్తా చెప్పినట్టు వికేంద్రీకరణపై ఇంకా దృష్టి సారించలేదు.

## 85) ఎఫ్‌డీఐలపై అబద్ధాలు చెప్పనిది లోక్‌సత్తాయే

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)లను పెద్దఎత్తున రావటం భారత్‌లో వ్యవసాయం, పరిశ్రమలకు కావలసిన మౌలిక వసతులకు అవసరమని, దీనివల్ల రిటైల్ గొలుసు దుకాణాలు పెరిగి రైతులకు ఎంతో లాభం చేకూరుతుందని, ఉపాధి పెరుగుతుంది తప్ప తగ్గదని మొదటి నుంచీ సమర్థించింది లోక్‌సత్తాయే. ఎఫ్‌డీఐలను వ్యతిరేకించిన పార్టీ అధికారంలోకి రాగానే రక్షణ సహా పలు కీలకరంగాల్లో 100శాతం ఎఫ్‌డీఐలను ఆహ్వానించగా, ఇంకొన్ని పార్టీలు తమ ఎంపీల చేత రాజ్యసభలో ఎఫ్‌డీఐలకనుకూలంగా ఓట్లు వేయించాయి. వీళ్లా దేశ ప్రయోజనాల కోసం మౌలిక సంస్కరణలను తెచ్చేది?

## 86) జన్యుమార్పిడి పంటలపైనా మాటమార్చని రాజకీయం

ఎవరో కొందరు అగ్రస్థాయివారు తినే ఆహారం వేరు, కోట్లాది సామాన్య ప్రజలు తినే ఆహారం వేరు అనే రోజుల నుంచి అందరికీ పౌష్టికాహారం దిశగా వెళ్లాల్సిన రోజులొచ్చినా ఇంకా పాత బూజుపట్టిన భావాలను వదిలించుకోలేనివారు జన్యుమార్పిడి పంటలను వ్యతిరేకిస్తుంటే, ఓట్ల కోసం సాంప్రదాయ పార్టీలు వారిని సమర్థిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 29 దేశాలలో 16 కోట్ల హెక్టార్లలో జన్యుమార్పిడి పంటల్ని పండిస్తున్నా, భారత్ సహా 59 దేశాలలో వాటిని వినియోగిస్తున్నారని లెక్కలు కనిపిస్తున్నా జన్యుమార్పిడిని వ్యతిరేకిస్తున్నవారి పక్షానే సుప్రీంకోర్టు నియమించిన కమిటీ 2012లో మొగ్గుచూపటంపై రైతుసంఘాలతో కలిసి లోక్‌సత్తా న్యాయపోరాటం చేసి సానుకూల ఫలితాన్ని సాధించింది. లోక్‌సత్తా చొరవ వల్లే అప్పటి కేంద్రప్రభుత్వం కూడా జన్యుమార్పిడి పంటల పరిశోధనలకు అనుకూలంగా వాదించింది. అరకొర పరిజ్ఞానంతో కాకుండా పదివేల ఏళ్ల అంటు వ్యవసాయ సంస్కృతిని, జన్యుపంటలతో 200 కోట్లమంది ప్రాణాలను కాపాడిన నార్మన్ బోర్లాగ్ వంటి వారి కృషిని, ఇక్రిశాట్ వంటి సంస్థల విధానాలను చూసి జన్యుమార్పిడి పంటలపై నిర్ణయాలు తీసుకోవాలని, అర్హతగల శాస్త్రవేత్తలు, నియంత్రణా సంస్థలు మాత్రమే జన్యుపంటల సురక్షితంపై సర్టిఫై చేయాలని లోక్‌సత్తా వాదించింది. ఉచిత బియ్యం, ఆహార భద్రత అని చెప్పే పార్టీల గోదాముల్లో అసలు సరకు ఇదీ!

## 87) మోన్‌శాంటో విత్తనాల ధరల్ని తగ్గించగలిగాం

గుత్తాధిపత్యంతో మోన్‌శాంటో విత్తనాల కంపెనీ అమెరికా, చైనా వంటి దేశాలలో కంటే 10–15 రెట్లు ఎక్కువగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇష్టమొచ్చినట్టు ధరల్ని పెంచినప్పుడు 2006లో సుప్రీంకోర్టు పిటిషన్‌తో లోక్‌సత్తా ధరల్ని తగ్గించగలిగింది.

## 88) వాన్‌పిక్ దోపిడీని అసెంబ్లీలో బట్టబయలు చేసిన లోక్‌సత్తా

దక్షిణ కోస్తాంధ్రలో కృష్ణపట్నం, మచిలీపట్నం, వాన్‌పిక్ ఓడరేవుల నిర్మాణం పేరుతో ఏకంగా 348 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని కేంద్రానికి కూడా తెలియకుండా ఒకే గ్రూపు సంస్థకు శాశ్వత ప్రాతిపదికన ఎం.వో.యూల పేరుతో వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం రాసిచ్చేయటంపై 2011, మార్చిలో జేపీ అసెంబ్లీలో లేవనెత్తి తన హేతుబద్ధ వాదనలు, సాక్ష్యాధారాలతో ఆ కుంభకోణాన్ని బైటపెట్టారు. ఈ అవినీతి డీల్ వల్ల ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నేవల్ బేస్ విస్తరణ కోసం తీసుకున్న స్థలానికి పరిహారంగా కేటాయించిన పోర్టు ఏర్పాటు చేయటానికి స్థలమే లేకుండా పోయింది. చక్రవర్తుల హయాంలోలా ఇంకెవరూ తీరంలోకి అడుగుపెట్టటానికి వీల్లేకుండా జరిగిన ఆ డీల్‌పై లోక్‌సత్తా బైటపెట్టిన ఆధారాలతో విచారణకు అన్ని పార్టీలు కూడా డిమాండ్ చేయటంతో చివరకు

ప్రభుత్వం తలవంచింది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అవినీతిపై విమర్శలతో ఈ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు కొందరు సభ్యులు ప్రయత్నించినా, 1995 నుంచి భూముల కేటాయింపులపై నిరభ్యంతరంగా విచారణ చేపట్టచ్చని జేపీ స్పష్టంచేశారు.

### 89) ప్రజాప్రయోజనాల సెజ్‌ల ఏర్పాటుకు నాందిపలికిన లోక్‌సత్తా

బ్రిటీషు దొరల కాలంలోలా ప్రజల నుంచి భూముల్ని ఎడాపెడా లాక్కుంటున్న రోజుల్లో పరిశ్రమల కోసం ప్రజలు ప్రాణాలర్పిస్తున్న రోజుల్లో ఐవిశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల తరపున పోరాడి వారికి అప్పట్లో అత్యధిక నష్టపరిహారాన్ని ఇప్పించటంతోపాటు రోడ్డున పడ్డ వారందరికీ యాజమాన్యం చేతే శిక్షణ ఉద్యోగాలను ఇప్పించి 8,000 కుటుంబాలను పరిరక్షించారు జయప్రకాష్ నారాయణ్. ఇందుకోసం గుమాస్తా నుంచి ముఖ్యమంత్రి వరకూ ఎందరినో కలిసి ఎన్నో వ్యయప్రయాసలకోర్చారు. ఈ నమూనాయే క్రమంగా ఈదేశంలో ప్రజాప్రయోజనాల భూసేకరణ చట్టానికి నాంది పలికింది. సెజ్‌ల్ని గుడ్డిగా అంగీకరించటమో, వ్యతిరేకించటమో లోక్‌సత్తా చేయదు. సెజ్‌లకు సేకరించే భూమిని మార్కెట్ రేటుకంటే కొన్ని రెట్లు ఎక్కువ చెల్లించి కొనుగోలు చేయాలని, సెజ్ అభివృద్ధితోపాటు ఆ స్థలాన్ని అమ్మిన యజమాని కూడా అభివృద్ధి చెందేలా, లాభాలలో వాటా ఇవ్వాలని, అవసరమైతే శిక్షణనిచ్చి మరీ ఉద్యోగావకాశం కల్పించాలని, పునరావాసం చూపించాలని లోక్‌సత్తా నిర్దిష్ట సెజ్ విధానాన్ని రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించి చాలామేర ఫలితాలను సాధించింది. ఒక ఊరిలో భూమిని కొందరి నుంచే సేకరించినా ఆ ఊరంతా నిర్వాసితులయ్యే ప్రమాదముంటే అందరికీ పునరావాసం చూపించాలని లోక్‌సత్తా విధానం స్పష్టం చేస్తోంది.

### 90) అమరావతిలోనూ రైతులకు కొంత పరిహారం ఇమ్మనే చెప్పాం

భూ సేకరణ చట్టాన్ని కేంద్రం రాష్ట్రాల మీద రుద్దకుండా స్వేచ్ఛనివ్వాలని కోరే లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో భూ సమీకరణ విధానాన్ని పూర్తిగా సమర్థించింది. అయితే పునరావాస ప్యాకేజీ విషయంలో విభేదించింది. రైతులకు అభివృద్ధి చేసిన స్థలాన్ని ఇవ్వటంతోపాటు ముందుగా వారికి ఎకరాకు కనీసం రూ. 10లక్షల పరిహారం కూడా చెల్లిస్తే వారు మరోచోట తక్కువ ధరకే భూముల్ని కొనుక్కునే అవకాశముండేదని వాదించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టింది.

### 91) అమరావతి కేంద్రీకృత పాలనపై పదేపదే హెచ్చరించిన లోక్‌సత్తా

రాజధాని ఎక్కడ ఏర్పాటు చేసుకోవటమనేది ఎన్నికైన ప్రభుత్వం హక్కని, అయితే రాజధానిలోనే అన్నీ కేంద్రీకరించి హైదరాబాద్‌లో చేసిన తప్పే మళ్లీ చేయవద్దని లోక్‌సత్తా పదేపదే హెచ్చరించింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేకపోతే కనీసం కేంద్ర కేబినెట్ ఒక్క కలం పోటుతో ఇవ్వగలిగే పారిశ్రామిక పన్ను రాయితీల్ని అడగాలని లోక్‌సత్తా

అనేకపర్యాయాలు డిమాండ్ చేయగా చివరికి అమరావతి వరకు మాత్రమే ముఖ్యమంత్రి చంద్రబాబు రాయితీల్ని అడిగారు. ఇది మున్ముందు తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. లంచాలు తినే అధికార వ్యవస్థల రాజధానిని పాలనకే పరిమితం చేసి, పరిశ్రమలు, హైకోర్టు, సేవారంగం వంటివి ఉత్తరాంధ్ర, రాయలసీమ, దక్షిణ కోస్తాలోని వేర్వేరు జిల్లాల్లో ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోకపోవటం దురదృష్టకరం.

### 92) ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో లోక్‌సత్తా సూచనలే ప్రతిఫలించాయి

లోక్‌సత్తాకు ఓట్లు, సీట్లు లేకపోయినా ఆంధ్రప్రదేశ్ విభజనకు లేఖలిచ్చిన పార్టీలు ప్రాంతాలవారీగా చీలిపోయి అధ్యక్షులు పారిపోయినా విడిపోతే పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు ఏం కావాలో అసెంబ్లీలో అడిగింది, శ్రీకృష్ణ కమిటీ నివేదిక ద్వారా సూచించింది, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తును పరిరక్షించింది జేపీ ఒక్కరే. చివరకు పార్లమెంటులో కూడా జేపీ సూచించిన పరిష్కారాలనే అధికార యూపీయే, ప్రతిపక్ష బీజేపీ సమర్థించాయి. రాయలసీమకు ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు ప్రత్యేక రాయితీల్ని సూచించగా అత్యుత్సాహంతో మొత్తం రాష్ట్రానికి ప్రత్యేక హోదా అడిగి ఆచరణసాధ్యంకాని పరిస్థితితో ప్రజలకు నష్టం చేశారుగానీ, మిగిలిన విషయాల్లో దాదాపు లోక్‌సత్తా చెప్పినవన్నీ యథాతథంగా చట్టంలో ఏర్పరిచారు. రెవిన్యూలోటు భర్తీ, పోలవరం పూర్తి, కోస్తాంధ్రలో జాతీయ సంస్థల ఏర్పాటు, తెలంగాణలో విద్యుత్తు ప్రాజెక్టు వంటి లోక్‌సత్తా సూచనలన్నీ విభజన చట్టంలో ఉన్నాయి.

### 93) అణుఒప్పందంపై దేశప్రయోజనాల కోసం నిలబడింది లోక్‌సత్తాయే

ఎఫ్‌డీఐలలాగానే 2008లో పౌరఅణుఒప్పందంపై అన్ని రాజకీయ పార్టీలూ ప్రభుత్వాన్ని వ్యతిరేకించినా లోక్‌సత్తా బహిరంగంగా నిర్ద్వంద్వంగా సమర్థించటంతోపాటు ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేసింది. భిన్న ధృవాలమని చెప్పుకుంటూ ఓట్లు చీల్చే ప్రయత్నం చేసే బీజేపీ, కమ్యూనిస్టులు అత్యంత అనైతికంగా పార్లమెంటులో కేవలం ప్రభుత్వాన్ని కూలదోయటం కోసమే కలిసినప్పుడు ఎండగట్టి లోక్‌సత్తా విధానపరంగా ప్రభుత్వానికి అండగా నిలిచింది. ఇప్పుడు ఇదే బీజేపీ ప్రభుత్వం అణుఒప్పందాన్ని విస్తరించటానికి అణుకూటముల్లో సభ్యత్వానికి తహతహలాడుతోంది. ఆనాడు అనుమానించిన ప్రజలకు కూడా దేశప్రయోజనాలేమిటో, అవకాశవాద రాజకీయాలేమిటో ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది.

### 94) రాజకీయ పార్టీలు సహ చట్టం పరిధిలోకి రావాల్సిందే

రాజకీయ పార్టీలు ప్రజల ఆస్తి అని తొలి నుంచీ బాహాటంగా ప్రకటించింది లోక్‌సత్తాయే. అందుకే పార్టీలో చర్చల వివరాలకు కాకుండా తీసుకున్న నిర్ణయాలు, వాటికి ప్రాతిపదికలు, వచ్చిన ఆదాయం, చేసిన ఖర్చు చెప్పాల్సిందేనన్నది లోక్‌సత్తా

విధానం. ఇవన్నీ లోక్‌సత్తా స్వచ్ఛందంగానే ప్రజలకు తెలియచేస్తుంది కాబట్టి సమాచార హక్కు చట్టం అవసరం పార్టీకి రాలేదు. కానీ నల్లడబ్బు చెలామణితోపాటు పలు అవకాశవాద, ఏకపక్ష నిర్ణయాలు తీసుకునే తప్పుడు హామీలనిచ్చే పార్టీలు విధిగా సమాచారాన్ని ప్రజలకు తెలియచేయాల్సుంటుంది. రాజకీయ పార్టీలు సహ చట్టం పరిధిలోకి రావని కమ్యూనిస్టులు సహా కొన్ని పార్టీలు వాదించినా సరిదిద్దే ప్రయత్నం లోక్‌సత్తా చేసింది. పార్టీల ప్రజాస్వామీకరణలో భాగంగానే కాకుండా, పార్టీలిచ్చిన బంద్‌లు వంటి పిలుపులు కూడా ఎంతోకొంత ప్రజలను ప్రభావితం చేస్తాయి కాబట్టి కూడా విధిగా ఆర్‌టీఐ పరిధిలోకి రావాలని లోక్‌సత్తా అన్ని పార్టీలనూ కోరింది.

**95) మార్కెట్ యార్డుల ప్రక్షాళన**

రైతుల నుంచి సెస్సు వసూలు చేస్తూ నిర్వహించే మార్కెట్‌యార్డుల్లో పంట అమ్ముకోవటానికొచ్చిన రైతులు రాజకీయ నేతలు, అధికారులు, దళారుల ముందు బానిసల్లా నిలబడుతున్న దుస్థితిని బైటపెట్టి అసెంబ్లీలో చర్చకు పెట్టింది లోక్‌సత్తా. 2010లో రైతు ఐక్యతా యాత్రలో భాగంగా పలు మార్కెట్ యార్డులను సందర్శించిన జయప్రకాష్ నారాయణ్ అక్కడ తెచ్చిన పంటను నిల్వ చేసే పట్టాలు కూడా లేకపోవటం, పందికొక్కులు తిరుగుతుండటం, టాయిలెట్లు కూడా మహిళా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవటం చూసి చలించిపోయారు. అక్కడికక్కడ కొన్ని మార్కెట్ యార్డులలో సౌకర్యాలను కల్పించటంతోపాటు సిద్దిపేటలో తాళం వేసి ఉన్న కొత్త మార్కెట్ యార్డుని రైతుల ద్వారానే తెరిపించి లావాదేవీలు ప్రారంభించారు. ఆ తర్వాత అసెంబ్లీలో కూడా ఇదే విషయాన్ని లేవనెత్తి రైతుల నుంచి వందల కోట్ల సెస్సు వసూలు చేస్తున్న మార్కెట్ యార్డుల్లో రాజకీయ పెత్తనాన్ని నిర్మూలించి వాటి నిర్వహణను పూర్తిగా రైతులకే అప్పచెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు ఆదాయం పెంచటానికి కీలకమైన ఈ చిన్న పనిని కూడా రైతుల ఓట్లు కొల్లగొట్టిన పాలకులు ఇప్పటికీ నెరవేర్చలేకపోయారు.

**96) ప్రాణహిత–చేవెళ్లపై తీవ్ర వ్యతిరేకతల మధ్యే పోరాటం**

తెలంగాణకు వరదాయిని అంటూ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన ప్రాణహిత–చేవెళ్ల వాస్తవానికి తెలంగాణకు గుదిబండ అవుతుందని, తెల్లఏనుగులాంటి ఆ ప్రాజెక్టు మీద వెచ్చించే డబ్బుతో తెలంగాణ ప్రాంతంలో 20లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేయటంతోపాటు 10లక్షలమందికి శాశ్వత ఉపాధిని కల్పించవచ్చని లోక్‌సత్తా 2008 నుంచే పోరాడుతూ వచ్చింది. ఆ భారీ ఎత్తిపోతలకు 3,500 మెగావాట్ల విద్యుత్తు ఖర్చవుతుందని, నిర్వహణ వ్యయంతో కలుపుకుని ఎకరాకు రూ. 2. 5లక్షల పెట్టుబడి అవుతుందని, ఏరకంగా ఇది రైతుకు లాభసాటి అవుతుందని జేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తట్టెడు మన్ను తియ్యకుండా, ఒక్క ఇటుక పేర్చకుండా రూ. 1000 కోట్లు

కాంట్రాక్టర్లకు అడ్వాన్స్ ఎలా ఇచ్చారని నిలదీశారు. తర్వాత తెలంగాణ ఉద్యమం వచ్చాక కూడా తెలంగాణ సెంటిమెంట్‌కు ప్రాణహిత–చేవెళ్ల సంకేతంగా పలువురు ఉద్యమకారులు భావించినా లోక్‌సత్తా ప్రజాప్రయోజనాల దిశగా తన పోరాటం కొనసాగించింది. చివరకు తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు కూడా జేపీ వాదనను సూర్యాపేట సభలో సమర్థించారు. ఆయన ముఖ్యమంత్రయ్యాక పేరు మార్చి మళ్లీ అదే తరహాలో గుదిబండల్లాంటి ఎత్తిపోతల పథకాలను ప్రారంభించటం ప్రజల దురదృష్టం. ఆటనియమాలు మారకుండా ఆటగాళ్లు మారితే ప్రయోజనం ఉండదు గదా!

## 97) ఓటర్ల జాబితాల ప్రక్షాళన

మార్పు దిశగా ప్రజలకున్న గొప్ప ఆయుధం ఓటు. లోక్‌సత్తా ఉద్యమంలో చాలా ఎక్కువ సమయాన్ని తీసుకున్న కార్యక్రమం ఓటర్ల జాబితా ప్రక్షాళన. 2000లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌వ్యాప్తంగా మొదలుపెట్టి 2005లో సనత్‌నగర్ నియోజకవర్గంలో సమగ్ర పైలెట్ ప్రాజెక్టు వరకూ ఓటర్ల జాబితాల్లో తప్పుల్ని సవరించి తేలిగ్గా ఎప్పటికప్పుడు పేర్లు నమోదు చేసుకోవటం దిశగా లోక్‌సత్తా లోతైన ప్రయత్నం చేసింది. దీనివల్ల పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల్లో తప్పులు 40 నుంచి 15.9శాతానికి, గ్రామ ప్రాంతాలలో 15 నుంచి 5శాతానికి తగ్గాయి. లోక్‌సత్తా చేసిన ప్రయత్నాన్నే నమూనాగా తీసుకుని ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితాల్లో తప్పుల సవరణను తరచూ నిర్వహించాల్సిన కార్యక్రమంగా రూపొందించింది. ఓటర్ల జాబితాలలో ప్రజలు తేలిగ్గా తమ పేర్లను నమోదు చేసుకునేందుకు, అవసరమైన మార్పులు చేసేందుకునేందుకు నిరంతరం అందుబాటులో ఉండేందుకు పోస్టాఫీసులలో ఓటర్ల జాబితాల ఏర్పాటుకు లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా చేసిన ప్రయత్నాలు 2008లో  కొంతమేర ఫలించాయి. ప్రజలు విదేశాల్లో ఉన్నా కూడా ఎప్పుడు కోరుకుంటే అప్పుడు ఓటర్లుగా నమోదయ్యేందుకు ఏర్పాట్లు వచ్చేస్తున్నాయంటే అది లోక్‌సత్తా సుదీర్ఘ కృషి ఫలితమే.

## 98) కేంద్ర అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లులోని 17ఎపై పార్లమెంటు సభ్యులను అప్రమత్తం చేసిన లోక్‌సత్తా

కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టం, 1989కి ప్రతిపాదించిన సవరణలలో ప్రభుత్వోద్యోగులను విచారించాలంటే ముందుగా లోక్‌పాల్ అనుమతి తీసుకోవాలని చేసిన 17ఎ ప్రతిపాదన అవినీతిపై పోరును ఎలా నీరుగారుస్తుందో హెచ్చరిస్తూ లోక్‌సత్తా ప్రభుత్వానికి, పార్లమెంటు సభ్యులకు, అన్ని పార్టీలకూ లేఖలు రాసింది. అధికారులకు జీతభత్యాలు పెంచి వారిని అండతో దేశాన్ని ఏలాలి, ప్రజలు ఓటుబ్యాంకులే అనుకుంటే చివరకు దేశం తీవ్రంగా నష్టపోతుందని

హెచ్చరించింది. ఎన్నికల్లో కూడా ప్రజలు బలం అందించివుంటే లోక్‌సత్తా చేస్తున్న పోరాటం వేగంగా ఫలితాలనిచ్చేది.

## 99) మరుగుదొడ్ల నిర్మాణం-స్వచ్ఛభారత్

స్థానిక ప్రభుత్వాల ప్రాధాన్యతతోపాటు వాటి విధుల్లో పారిశుద్ధ్యానికి తద్వారా ఆరోగ్యానికి అమిత ప్రాధాన్యతనిచ్చే లోక్‌సత్తా 1997 నుంచి మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఒక ఉద్యమంగానే గుర్తించింది. మనదేశంలో టాయిలెట్లకన్నా ఎక్కువ టీవీలు ఉన్నాయనేది లోక్‌సత్తా పాప్యులర్ డైలాగుల్లో ఒకటి. జేపీ తాను స్కూలు పాఠాలు చదువుకున్న గొడవర్రులో ప్రత్యేకించి చొరవ తీసుకుని మరుగుదొడ్లు నిర్మించారు. లోక్‌సత్తా సీనియర్ నేతలు కొందరు కూడా ఈ ఉద్యమం నుంచే వచ్చారు. అందుకే లోక్‌సత్తా స్వచ్ఛభారత్ ఉద్యమాన్ని వెంటనే సమర్థించి అందులో పాల్గన్నది. అయితే స్వచ్ఛభారత్ రూపకల్పన లోపభూయిష్టం కావటంతో ఎన్ని కోట్ల ప్రచారం జరుగుతున్నా, మీడియా, సెలబ్రిటీలు ఊదరగొడుతున్నా ఆశించిన ఫలితం రావటం లేదు. స్వచ్ఛభారత్‌ను స్థానిక ప్రభుత్వాల సాధికారతతో సమన్వయం చేసి ప్రజల రోజువారీ భాగస్వామ్యంతో నిర్వహించాలని, తర్వాతి దశలో సామాజిక స్వచ్ఛభారత్‌ని జోడించాలని కొన్ని నిర్మాణాత్మక సూచనల్ని లోక్‌సత్తా చేసినా పాలకులు వ్యక్తిగత ప్రచారాన్ని, ఆధిపత్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆలోచనాపరులు, మీడియా చొరవ తీసుకోకుండా, ప్రజలు మారకుండా పాలకులే దేశాన్ని మార్చాలనుకుంటే అరుదైన ఉదాహరణే అవుతుంది.

## 100) అజరామరం లోక్‌సత్తా భావజాలం

ప్రజలను భాగస్వాముల్ని చేస్తూనే గాలిమరలా కాకుండా దిక్సూచిలా వ్యవహరించగల నిజమైన వ్యవస్థీకృత నిజాయతీ నాయకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్. అందుకే సువిశాల, సంక్లిష్ట భారత్‌లో సమూల రాజకీయ, పాలనా సంస్కరణలకు నాంది పలికి ప్రపంచంలోనే అతి పెద్ద ఆచరణాత్మక కలనుగనే సాహసాన్ని చేశారు. ఆ కలను సాకారం చేసేందుకే.. ప్రజలసాధికారతను పరిరక్షించే, పెంపొందించే మౌలిక వ్యవస్థీకృత మార్పును సాధించే లోక్‌సత్తా భావజాలాన్ని స్వేచ్ఛ, ఉదారవిలువలతో, వ్యక్తి సుఖాన్ని, సమాజ హితాన్ని సంధానం చేస్తూ ఈ దేశానికి అందించారు. తాను చెప్పింది ఆచరించి చూపుతున్నారు. లోక్‌సత్తా భావాలు, లక్ష్యాలు, సాధించిన, కృషి చేస్తున్న విజయాలు.. అన్నీ కూడా నిస్సహాయులను ఆదుకుంటూనే ప్రజల స్వతంత్ర జీవనం, స్వావలంబన లక్ష్యంగా ఉంటాయి. ఎవరి జీవితాల్లో వారిని హీరోలుగా నిలిపేవి. ఎవరి నివాసప్రాంతాన్ని వారు లిటిల్ రిపబ్లిక్కుగా నిలుపుకునేలా చేసేవి. ఆరోగ్యకరమైన ఆలోచనలతో కూడిన సృజనాత్మకతే తప్ప.. గమ్యం లేని భావోద్రేక సైద్ధాంతిక మత్తు

ఇందులో ఉండదు. సిద్ధాంతాలు, రాద్ధాంతాల బంధనాలు, మానవాతీత శక్తులు ఇక్కడ అవసరం లేదు. ఇజాల లక్ష్యమైన నిజాల చుట్టూ నేరుగా, ఓ రోజువారీ జీవితంలా నిర్మితమైన భావజాలమిది. వ్యక్తిగత విశ్వాసాలతో పనిలేకుండానే ప్రతి ఒక్కరూ తమలోని శక్తులను వినియోగించుకుంటూ ఆచరించగలిగేది. కార్యాకారణ సంబంధాన్ని తెలియచెప్పే హేతుబద్ధత, సాక్ష్యాధారాలు, సృజనాత్మకంగా అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేయటం చుట్టూ ఇది ప్రతి స్థాయిలోనూ సంబంధిత ప్రజల భాగస్వామ్యంతో వారి సాధికారత దిశగా నిర్మాణం చేస్తుంటుంది. పురాతనకాలం నుంచీ అనేక వాదాలు ఈ రకంగా మనముందుకొచ్చినా.. ప్రకృతిని, అందులో భాగమైన మనిషిని నడిపించే తార్కికతను విస్తృతమైన రాజకీయానికి కేంద్రబిందువు చేసి అందరికీ ఎదిగే అవకాశాలున్న వ్యవస్థను నిర్మించటం మాత్రం ఇప్పటికీ ఓ పెద్ద సవాలే. సంక్లిష్ట భిన్నత్వమున్న భారత్‌లోనైతే అదో మహాకార్యమే. ఈ మహాకార్యంలో భాగంగా.. పారిశుద్ధ్యం, పర్యావరణం నుంచి ఆధ్యాత్మిక వరకూ లోక్‌సత్తా స్పృశించని రంగమంటూ లేదు. రాజకీయ, పాలనా, ఆర్థిక, సామాజిక, న్యాయ.. ఇలా అన్ని రంగాలలో మౌలిక సంస్కరణలకు లోక్‌సత్తా కృషి కొనసాగుతోంది. ప్రకృతి, సామాజిక చలన సూత్రాల్లోని హేతుబద్ధతతో, ప్రజల ఆలోచనలను కాకుండా.. ఆలోచనలను ప్రభావితం చేసే పరిస్థితులను మంచికి ప్రోత్సాహకాలుగా మార్చే హేతుబద్ధ వ్యవస్థీకృత విధానాలు కాబట్టే, ఏ రంగం, ఏ ప్రాంతం నుంచి చూసినా లోక్‌సత్తా భావజాలం, విధానాలు అజరామరం. నివారించదగ్గ బాధలను తొలగించి, ప్రతి బిడ్డా తనలోని శక్తిసామర్థ్యాలను వికసింపచేసుకునేలా, పరిపూర్ణ సంతోషమయ జీవితాన్ని ఆస్వాదిస్తూ సుస్థిరంగా సాగిపోయేలా చేస్తాయివి. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేకుండా సేవల గ్యారంటీ చట్టం, వ్యవసాయ (గ్రామీణ)– వ్యవసాయేతర (పట్టణ) రంగాల మధ్య అంతరాన్ని తగ్గించటం, ఎన్నికల, న్యాయ, పోలీసు సంస్కరణలు, కులనిర్మూలన తదితర అంశాల ఎజెండాతో మొదలైన లోక్‌సత్తా 2.0 మలిదశ ఉద్యమ ప్రాధాన్యతల్లో కాలానుగుణ మార్పులున్నా.. పునాది మాత్రం లోక్‌సత్తా కాలాతీత భావజాలమే. ★



"అత్యుత్తమ సామర్థ్యంగలవారు హేతుబద్ధ, నైతిక మార్గాల ద్వారా వేగంగా అధికారంలోకి రాగలిగేలా చేయటమే రాజకీయ పార్టీల, ఎన్నికల వ్యవస్థల నిజమైన పరమార్థం"

- డా॥ జయప్రకాష్ నారాయణ్

లోక్‌సత్తా వ్యవస్థాపకులు


BE THE
CHANGE
YOU WISH TO SEE
DONATE.FDRINDIA.ORG
BIG IDEAS NEED BIG SUPPORT
Help us in bringing key reforms in Education,
Health, Elections, Politics & Local governments.
* Donation amount is exempted as per 80G of IT act
for more:www.fdrindia.org